అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 24-6-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 174 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అలవెన్స్‌లు పెంపు

ఉత్తర్వులు జారీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం మరో తీపికబురు చెప్పింది. విభాగాల వారీగా ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చే అలవెన్స్‌ను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల ప్రకారం శుక్రవారం ఆర్థికశాఖ ఉత్తర్వులిచ్చింది.

జీవో ప్రకారం ఉద్యోగులకు కలిగే ప్రయోజనాలివే...

- ట్రావెలింగ్ అండ్ కన్వీనియన్స్ అలవెన్స్ ...5లో



బీజేపీని గద్దెదించాలి

విభేదాలను పక్కన పెట్టి పని చేద్దాం : పాట్నాలో ప్రతిపక్షాల సమావేశంలో నేతలు

జులైలో సిమ్లాలో తదుపరి సమావేశం

ఉమ్మడి ఎజెండాను ఖరారు చేస్తాం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

భారత లౌకిక ప్రజాస్వామ్య పునాదికి, సమగ్రతకు పెను ముప్పుగా పరిణమిస్తున్న సంఘ్ పరివార్ శక్తులను, బీజేపీని అధికారం నుంచి గద్దె దించడమే లక్ష్యంగా జాతీయ రాజకీయాల్లో ఐక్యంగా ఉద్యమించాలని ప్రతిపక్ష పార్టీ నేతల సమావేశంలో అంగీకారం కుదిరింది. జాతీయ ప్రయోజనాల కోసం 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఐక్యంగా పోరాడాలని, విభేదాలను పక్కనపెట్టి వెసులుబాటుతో పనిచేయాలని ప్రతిపక్ష నేతలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఇందుకు గాను ...6లో

కలిసి పనిచేద్దాం...

బీహార్ సీఎం నితీశ్ కుమార్

"సమావేశం ఫలప్రదమైంది. ఈ సమావేశంలో పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. 17 పార్టీలు కలిసి పని చేయాలని నిర్ణయించాం. లోక్‌సభ ఎన్నికల్లో కలిసి ఐక్యంగా పోటీ చేయడానికి ఏకాభిప్రాయం కుదిరింది. కేంద్రంలోని ప్రస్తుత పాలనపై ఐక్యంగా పోరాడేందుకు ఉమ్మడి కూటమి ఏర్పాటుకు నేతలంతా ...6లో



లౌకిక ప్రజాస్వామ్య నిర్మాణమే లక్ష్యం

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి

దేశాన్ని ఫాసిస్ట్ హిందుత్వ దేశంగా మార్చేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నిస్తోంది. భారత లౌకిక ప్రజాస్వామ్య నిర్మాణాన్ని నాశనం చేయడమే లక్ష్యంగా సాగుతోంది. దీనిని ఐక్యంగా ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైంది.. సమాఖ్య సూత్రాలు, లౌకికవాదం, ప్రజాస్వామ్యం వంటి రాజ్యాంగ స్తంభాలన్నీ నిరంతరం దాడికి గురవుతున్నాయి. లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా మన చరిత్రను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నది. సంఘ్ పరివార్‌పై సమిష్టిగా వ్యతిరేకత రావాలి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అంతర్గత భద్రతా ఉల్లంఘనల ...6లో

బీజేపీపై సంఘటిత పోరు

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

బీజేపీ పై సంఘటిత పోరాటానికి అంగీకారం కుదిరింది. తొమ్మిదేండ్ల బీజేపీ పాలన దారుణంగా ఉంది. దేశ ప్రజాస్వామ్య, లౌకిక నిర్మాణం దాడికి గురైంది. మత-కార్పొరేట్ కూటమికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మాత్రం సిగ్గులేకుండా కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోంది. సమాఖ్య వ్యవస్థను కూడా ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. సమిష్టి పోరాటంతోనే బీజేపీని అధికారం నుంచి తరిమికొట్టగలం.

సిమ్లాలో ఎజెండా రూపొందిస్తాం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

భవిష్యత్తు ఎజెండా సిద్ధం చేసేందుకు జులైలో హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో ప్రతిపక్ష నేతల తదుపరి సమావేశం నిర్వహించనున్నాం. ఉమ్మడి ఎజెండాను సిద్ధం చేయాలనుకుంటున్నాం. ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై వచ్చే సమావేశంలో నిర్ణయాలు తీసుకుంటాం. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తాం. కేంద్రంలో బీజేపీని గద్దె దించేందుకు కలిసికట్టుగా కృషి చేస్తాం. 2024 ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఆయా రాష్ట్రాల్లో కలిసికట్టుగా ఏవిధంగా పోరాడాలనే విషయంపై ఒక ఎజెండాను ఖరారు చేస్తాం.

పొలిటికల్ హీట్

రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు

- ఎత్తుకు పై ఎత్తులు
- సోషల్ మీడియా వేదికగా రూమర్లు
- జనాన్ని గందరగోళపర్చడమే లక్ష్యం
- ఉత్తమ్ కారెక్కుతున్నారని ప్రచారం
- కేంద్రమంత్రులతో కేటీఆర్ భేటీపై అనుమానాలు
- ఢిల్లీకి రమ్మంటూ ఈటల, రాజగోపాల్‌రెడ్డికి బీజేపీ అధిష్టానం పిలుపు
- కర్నాటక కాంగ్రెస్ చీఫ్ డీకేతో కోమటిరెడ్డి సమావేశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అధికారం కావాలి. దానికోసం జనాన్ని తమవైపుకు తిప్పుకోవాలి. ప్రత్యర్థులపై అవిశ్వాస ప్రచారం చేయాలి. దానికి సోషల్ మీడియాను వేదిక చేసుకోవాలి. సంచలనం కల్గించే కామెంట్స్ చేయాలి. దానికి ప్రత్యర్థులూ అంతే ఘాటుగా స్పందించాలి. అంతిమంగా ఓటర్లను గందరగోళపర్చాలి. ఇప్పుడు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి ఇలాగే ఉంది. వీటన్నింటికీ దూరంగా జనం గోసను నెత్తికెత్తుకొని, పేదలకు ఇండ్లు, ఇంటి జాగాలు ఇవ్వాలంటూ కమ్యూనిస్టులు భూపోరాటాలు చేస్తున్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఎన్నికల సమయం దగ్గరపడుతున్నకొద్దీ ఎవరి ప్రయత్నాలు వాళ్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లను షురూ చేసింది. తాజాగా ఓ బృందం ఢిల్లీ నుంచి వచ్చి శాంతిభద్రతలు సహా ఏర్పాట్లపై ఎస్పీలు, కలెక్టర్లతో భేటీ అయ్యింది. ఇంతే వేగంగా రాజకీయపార్టీలు కూడా ఎత్తుగడలు వేస్తున్నాయి. పీసీసీ మాజీ చీఫ్, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారంటూ శుక్రవారం ఓ సోషల్ మీడియా పోస్ట్ వైరల్‌గా మారింది. చివరకు ఢిల్లీలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి...అలాంటిదేం లేదంటూ ప్రకటన చేశారు. అయినా వైరల్ ఆగకపోవడంతో 'లీగల్‌గా చర్యలు తీసుకుంటానంటూ హెచ్చరించారు. ఈ పోస్ట్ ఎవరి సృష్టి? పొగలేకుండా నిప్పు రాజుకుంటుందా? అనే చర్చ రాష్ట్ర రాజకీయవర్గాల్లో జరుగుతున్నది. ఇక మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఆపార్టీ చేరికల కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్ మధ్య 'అధికార మార్పిడి' సైలెంట్ వార్ కొనసాగుతూనే ఉంది. మునుగోడులో ఓటమి తర్వాత అక్కడ బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైలెంట్ అయ్యారు. ఈటల, కోమటిరెడ్డి కాంగ్రెస్‌లోకి జంప్ అంటూ ప్రచారం జరుగుతున్నది. దీంతో వాళ్లిద్దర్నీ ఢిల్లీ రమ్మని బీజేపీ అధిష్టానం వర్తమానం పంపింది. దేశానికి మేమే ప్రత్యామ్నాయం అంటున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రమంత్రులతో భేటీ అయ్యారనే వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో 'ఉప్పు-నిప్పు' పై నీళ్లు చల్లి, ఇద్దరూ దోస్తులవుతున్నారంటూ మరో ప్రచారం ...5లో

పోరాటాల్లో కమ్యూనిస్టులు

ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటూ ప్రతి దానికీ రాజకీయ రంగు పులుముతున్నాయి. కమ్యూనిస్టు పార్టీలు మాత్రం ఎప్పటిలాగే ప్రజాసమస్యలపై తమ గళాన్ని విప్పుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ...5లో

నవతెలంగాణ

ఆర్‌అండ్‌బీలో ఐటీ ప్రొఫెషనల్ల నియామకాలు

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియామకాలు జరగనున్నాయి. ఈమేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రం పరిధిలోని జాతీయ రహదారుల నిర్మాణ అవసరాల కోసం ఐటీ ప్రొఫెషనల్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. ఈమేరకు ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఐ.గణపతిరెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పది మంది దరఖాస్తు చేయగా, ఎనిమిది మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఐటీలో అభ్యర్థులకున్న అనుభవం ఆధారంగా నియామకం చేయనున్నారు. అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన జరిగే నియామకాల్లో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 30 వేల చొప్పున వేతనం చెల్లించనున్నారు.

ఎస్సీ కులాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి కొప్పుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ కులాల అభ్యున్నతే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ప్రతినిధుల బృందం శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రిని కలిశారు. రాష్ట్రంలో మాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు.

హైదరాబాద్ నగరంలో అన్ని కుల సంఘాల మాదిరిగా రూ.10 కోట్ల వ్యయంతో మాలాల భవనం నిర్మించాలని కోరారు. దళిత బంధు పథకం రెండో విడతలో 80 శాతాన్ని మాలలకు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకాలంలోనూ అధిక సహాయం అందిస్తూ.. ఇళ్లు లేని నిరుపేద మాలాల కుటుంబాల వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ కులాల్లో వార్షిక ఆదాయ పరిమితిని రెండు లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతూ.. ప్రభుత్వం అంద చేస్తున్న మూడు ఎకరాల భూమిని ఐదు ఎకరాలకు పెంచాలని కోరారు. ప్రయివేటు విద్యా సంస్థల్లో పదో తరగతి లోపు ఎస్సీ విద్యార్థులకు ట్యూషన్ ఫీజు..రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసిన ప్రతీ ఒక్కరికి అవకాశం కల్పించాలని కోరారు. ఇవే అంశాలు పేర్కొంటూ మంత్రికి ఆ శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జాకు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల అనుబంధ కులాల సమాఖ్య మాజీ కో ఆర్డినేటర్ రావుల అంజయ్య, మాల మహానాడు (పీవి రావు) వ్యవస్థాపక అధ్యక్షులు చెరుకు రామ చందర్, వర్కింగ్ చైర్మెన్ తాళ్ల పల్లి రవి, తెలంగాణ మాల మహానాడు అధ్యక్షులు నర్సింహ, కార్యదర్శి రావుల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మానవీయకోణంలో కారుణ్య నియామకాలు..

మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



తమ శాఖ పరిధిలోని గిరిజన సహకార సంస్థ(జీసీసీ)లో 30 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేశామని గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ (డీఎస్ఎస్) భవన్‌లో ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు జీసీ సంస్థ పురోభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. సంస్థను నమ్ముకుని విధుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సీఎం కేసీఆర్ అండగా నిలిచారని చెప్పారు. ఉద్యోగుల కుటుంబీకులకు అర్హత మేరకు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూ కారుణ్య నియామకాల ఉత్తర్వులను అందజేయటం సర్కారు ఆలోచనకు అద్దం పడుతున్నదన్నారు. జీసీసీని నమ్ముకుని అనేక కుటుంబాలు బతుకుతున్నాయని చెప్పారు. కరోనా విపత్కర పరిస్థి తుల్లో సైతం సంస్థ ఆధ్వర్యంలో శానిటైజర్ ఉత్పత్తి చేసి.. అధిక సంఖ్యలో పంపిణీ చేశామని గుర్తు చేశారు. అటవీ ఉత్పత్తులకు మరింత బ్రాండ్‌ను పెంపొందిస్తూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఉద్యోగులకు సూచించారు. ప్రభుత్వం ప్రజల ప్రయోజనాల కోసం చేపడుతున్న పలు పథకాలను ప్రజల దరి చేర్చాల్సిన బాధ్యత ఉద్యోగులదేనని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం పలు రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్మెన్ వాల్యా నాయక్,గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి, జీసీసీ జీఎం సీతారాం నాయక్, చీఫ్ ఇంజనీర్ శంకర్ రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

జులై 1న గ్రూప్-4 రాతపరీక్ష

- 9.51 లక్షల మంది దరఖాస్తు
- 2,846 కేంద్రాల ఏర్పాటు
- టీఎస్‌పీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-4 పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు శనివారం నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వెల్లడించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జులై ఒకటో తేదీన ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2ను ఓఎంఆర్ ఆధారంగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం డిసెంబర్ ఒకటిన నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-4కు రాష్ట్రవ్యాప్తంగా 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. 2,846 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష ప్రారంభానికి 45 నిమిషాల ముందు వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని ఆమె తెలిపారు. అందులోనే మార్గదర్శకాలను పొందుపరుస్తామని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను https:// www.tspsc.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

దేశానికే తెలంగాణ ఆదర్శం

- మంత్రి హరీష్‌రావు
- బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్న సాగునీరు, తాగునీరు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు, వ్యవసాయం, పేదల సంక్షేమం కోసం చేపట్టిన కార్యాచరణ నేడు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని రాష్ట్ర మంత్రి హరీష్‌రావు అన్నారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటే తెలంగాణ మోడల్ పాలన అక్కడ కూడా అమలవుతుందని స్పష్టం చేశారు. హరీష్‌రావు సమ క్షంలో మహారాష్ట్రకు చెంది న పలువురు నాయకులు శుక్రవారం పార్టీలో చేరారు. వారికి మంత్రి బీఆర్ఎస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జనతాపార్టీ లాతూర్ జిల్లా అధ్యక్షుడు జయ సింగ్ యాదవ్ బీఆర్ఎస్‌లో చేరడం ప్రాధాన్యత సంతరించుకున్నది. వీరితో పాటు ఆ జిల్లా సంఘటనకు చెందిన వ్రాజ్ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ నుంచి అర్జున్ రాథోడ్, భగవంత్ కులకర్ణి తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ నాయకులు జయంత్ దేశ్ ముఖ్ పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పండుగ వాతావరణంలో తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దశాబ్ది ఉత్సవాలు జరిగాయని తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి హృదయం ఉప్పొంగేలా ఉత్సవాలు సాగాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఘనకీర్తిని దశదిశలా చాటి చెప్పే స్థాయిలో జరిగాయని తెలిపారు.



పొద్దునా...సాయంత్రం కరెంట్ షాక్

పీక్ డిమాండ్ పేరుతో అధిక విద్యుత్ చార్జీలు

- గెజిట్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్రాలు అమలు చేయాలని ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మోడీ సర్కారు ఎవర్నీ వదలట్లేదు. ప్రభుత్వం అందించే ఏ సేవా ఉచితం కాదు. అన్నింటికీ డబ్బు చెల్లించాల్సిందే. తొలుత నామమాత్రంగా రుసుములు పెట్టి, ఆ తర్వాత వివిధ రకాల పేర్లతో చార్జీలు పెంచేసి సామాన్యుడిని బాదేయడం మోడీ సర్కారు ప్రత్యేకత! ఇప్పుడు ఇదే తరహాలో పీక్ డిమాండ్ పేరుతో కరెంటు చార్జీలనూ పెంచుతూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఎవరికైనా సహజంగా కరెంటుతో ఎప్పుడు పని ఉంటుంది? ఉదయం పిల్లల్ని స్కూళ్లకు తయారు చేయడం దగ్గరి నుంచి ఆఫీసులు, రోజువారీ పనులకు వెళ్లే టైం ఉదయం 6 నుంచి 10 గంటల లోపే...అలాగే సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ఇండ్లలో లైట్లు, ఫ్యాన్లు వేసుకొని పనులు చేసుకుంటారు. ఇప్పుడు మోడీ సర్కారు దృష్టి ఈ 'టైం'పై పడింది. ఆ టైంలో కరెంటు వాడితే అధిక చార్జీలు వసూలు చేయాలంటూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పైగా దాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలనీ ఆదేశించారు. దీనికి పర్యావరణహితం హ్యాష్‌ట్యాగ్ కట్టి కర్బన ఉద్గారాలు తగ్గించి, సాంప్రదాయ ఇంధన వనరులు...సోలార్, విండ్, జలవిద్యుత్ వంటి వాటిని ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం అంటూ ప్రకటించారు. మోడీ సర్కారు చెప్తున్న 'సంప్రదాయ ఇంధన వనరులు' అన్నీ ఇప్పటికే ప్రయివేటు కార్పొరేట్ సంస్థల చేతుల్లోనే ఉన్నాయి. అంతిమంగా వారికి లబ్ది చేకూర్చడమే కేంద్రం లక్ష్యమని స్పష్టమవుతుంది. దానికోసం 'పీక్ అవర్' పేరుతో జనాన్ని బాదేసేందుకు సిద్ధపడ్డారు.

ఇప్పటికే వంటింట్లో గ్యాస్ బండ సబ్సిడీని పూర్తిగా ఎత్తేసి, దాని ధరను రూ.1,200 చేర్చిన విషయం తెలిసిందే. 2023 విద్యుత్ సంస్కరణల పేరుతో భవిష్యత్‌లో కరెంటు బిల్లుల్ని ఇదే తరహాలో పెంచడమే మోడీ సర్కారు లక్ష్యంగా పనిచేస్తున్నది. పీక్ అవర్‌లో కరెంటు వాడితే అధిక చార్జీలు చెల్లించాలి. ఆ తర్వాత వాడే కరెంటు చార్జీల్లో 20 శాతం రాయితీ అంటూ 'బట్టల దుకాణాల్లో వ్యాపారులు ఇచ్చే డిస్కౌంట్ల' తరహాలో ప్రకటన చేసింది. ముందే టారిఫ్ రేట్లు పెంచేసి, దానిలో 20 శాతం రాయితీ అంటూ మరో మోసపూరిత వ్యాపారానికి మోడీ ప్రభుత్వం తెరలేపిందంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఈ కొత్త విధానాలు 2024 ఏప్రిల్ 1 నుంచి తొలుత 10 కిలోవాట్ల లోపు వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు అమలు చేస్తారు. గృహ వినియోగదారుల కరెంటు కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించి, 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తేస్తామని కేంద్రం ప్రకటించింది. ఇక్కడితో ఈ 'దందా' నిలిచిపోవట్లేదు. కరెంటు కనెక్షన్ తీసుకొనేటప్పుడు వినియోగదారుడు ఎన్ని కిలోవాట్లు వాడుకుంటారో ముందే చెప్పాలి. అంతకుమించి ఎక్కువ వాడుకుంటే జరిమానాలు, సర్‌చార్జీల పేరుతో ఏడాదికోసారి వడ్డీతో సహా లెక్కించి బిల్లులు పంపుతారు. కడితే సరి...లేకుంటే కనెక్షన్ కట్! మోడీనా...మజాకా!!

లైంగికదాడికి యత్నించిన వ్యక్తిని .. ఇనుపరాడితో కొట్టి చంపిన మహిళ

నవతెలంగాణ-రాజేంద్రనగర్

ఇంట్లోకి వెళ్లి మహిళపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తిని మహిళ రాడ్డుతో కొట్టి చంపింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం జరిగింది. స్థానికులు, సీఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్ ప్రాంతానికి చెందిన జయమ్మ రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో నిద్ర లేచి ఇంటి తలుపులు తీసింది. అదే సమయంలో పక్క ఇంట్లో ఉండే వ్యక్తి శ్రీనివాస్(45) ఆమె ఇంట్లోకి ప్రవేశించి జయమ్మపై లైంగికదాడికి ప్రయత్నించారు. వెంటనే ఆమె బయటకు వచ్చి పక్కనే ఉన్న రాడుతో శ్రీనివాస్ తలపై బలంగా కొట్టింది. అతడు అక్కడికక్కడే చనిపోయాడు. శ్రీనివాస్ ఆ సమయంలో బాగా మద్యం తాగి ఉన్నాడు. వెంటనే జయమ్మ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయింది. తనపై లైంగికదాడికి ప్రయత్నించినందుకు రాడుతో కొట్టానని ఆమె పోలీసులకు తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గృహలక్ష్మితో గూడు గోస తీరదు

- ఇంటి నిర్మాణానికి రూ.15లక్షలు ఇవ్వాల్సిందే..
- 27లోపు ప్రభుత్వం నిర్దిష్ట ప్రకటన చేయాలి
- ఇండ్ల స్థలాల పోరాటం ఆగదు : తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక కన్వీనర్ ఎస్.వీరయ్య



నవతెలంగాణ- జైపూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకంతో గూడులేని వారి గోడు తీరదని, ఇంటి నిర్మాణానికి రూ.15లక్షలు ఇవ్వాలని తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య అన్నారు. ఇండ్లు, ఇంటి స్థలాల కోసం చేపట్టిన పేదల పోరాటం ఎవరి బెదిరింపులకూ ఆగదని స్పష్టం చేశారు. పోరాటంలో విజయం సాధించే వరకు పేదలకు ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం ఈ నెల 18న మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభించిన బస్సు యాత్ర శుక్రవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం బావురావుపేట్ పోరాట కేంద్రానికి చేరుకుంది. బావురావుపేట్ శివారులో రెండు నెలలుగా పేదలు చేస్తున్న ఇండ్ల స్థలాల పోరాటానికి మద్దతు తెలిపారు. పోరాట కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీరయ్య మాట్లాడారు.

పేదలు చేపట్టిన భూపోరాటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చితీరాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా గృహలక్ష్మి పథకం తీసుకొచ్చిందని, ఈ పథకం ద్వారా పేదలకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదని అన్నారు. ఇంటి స్థలం ఉంటే గృహలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షలు ఇస్తామని చెబుతోందని ఈ నిధులతో నిర్మాణం చేయడం కష్టమని అన్నారు. ఇంటి స్థలం కోసంలేని వారెవరూ గృహలక్ష్మి పథకంతో లబ్దిపొందలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం గంపగుత్తగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు రూ.8లక్షలతో నిర్మిస్తుంటే పేదలు వ్యక్తిగతంగా రూ.3లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా పూర్తి చేసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇంటి సమస్య తీరాలంటే రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇవ్వడంతోపాటు రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు మొత్తం రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సొంత ఇల్లు, స్థలం లేనివారు తప్పనిసరై ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్నారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ఎక్కడైతే గుడిసెలు వేసుకున్నారో అక్కడే స్థలం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మోసం చేసినందున, రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పకుండా పేదలకు న్యాయం చేయాలన్నారు. ఒక్క చెన్నూర్‌లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 61 కేంద్రాల్లో గతేడాది నుంచి పోరాటం కొనసాగుతోందన్నారు. ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న వారికి మద్దతుగా చేపట్టిన ఈ బస్సు యాత్ర 27న రంగారెడ్డి జిల్లాకు చేరుకుంటుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో బహిరంగ సభకు ముందే ఇండ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేల ప్రభుత్వం ఈ విషయంలో స్పందించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బస్సు యాత్ర బృందం సభ్యులు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, వృత్తిదారుల సంఘాల రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బొప్పని పద్మ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోట రమేశ్, అనుగంటి వెంకటేశ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ జగదీష్, ,తదితరులు పాల్గొన్నారు.

కొంతమంది కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరుతారు

- నల్లగొండలో అన్ని సీట్లు కారుకే...
- రేవంత్ పార్టీ మారలేదా?
- ఇష్టాగోష్టిలో మండలి చైర్మెన్ గుత్తా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రానున్న రోజుల్లో కొంత మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతారని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులకు రాష్ట్రంపై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. వచ్చేఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో అన్ని స్థానాల్లో కారు పరుగుపెడుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనమండలిలోని తన ఛాంబర్‌లో ఇష్టాగోష్టిలో విలేకర్లతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తాను ఎక్కడా పోటీ చేయబోనని తెలిపారు. తన కుమారుడికి పార్టీ అవకాశం ఇస్తే పోటీలో ఉంటారని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందన్నారు. కాంగ్రెస్‌లో చేరుతామంటూ చెప్పుకునే ఖమ్మం, మహబూబ్‌నగర్ నేతలు వాళ్ళ గురించి వాళ్లే ఎక్కువగా ఊహించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని తన కోరిక అని చెప్పారు. జిల్లా రాజకీయాల్లో అంతర్గత కలహాలు అనేది సహజమన్నారు. జిల్లా నాయకత్వంపై పూర్తిస్థాయి సంతృప్తి ఎక్కడా ఉండదని చెప్పారు. ఎన్నికలు వచ్చినపుడల్లా చేరికలు, మార్పులు, చేర్పులు అనేది సహజమేనన్నారు. ఖమ్మంలో 2018 ఎన్నికల కంటే ఎక్కువ సీట్లు బీఆర్ఎస్‌కు వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ లేకుండానే కూటమి అని సీఎం కేసీఆర్ అంటున్నాడు కాబట్టే ఆయన విపక్ష సమావేశాలకు పోవడం లేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాంగ్రెస్‌లోకి వెళ్లబోరని స్పష్టం చేశారు. తమ వారసుల కోసం వేరే పార్టీలోకి వెళ్లబోమనీ, అవకాశం రాకపోతే పార్టీ నిలబెట్టిన అభ్యర్థికి మద్దతు ఇస్తామన్నారు. వారసత్వ రాజకీయాలు అనేవి కేవలం గుర్తింపు వరకు మాత్రమేనన్నారు. అవి విజయం సాధించేందుకు పనికి రావన్నారు. రేవంత్‌రెడ్డి మాటలకు అంతూ పొంతూ ఉండదనీ, ఆయన మాత్రం పార్టీ మారలేదా? అని ప్రశ్నించారు. రాజీనామా లేఖను స్పీకర్‌కు ఇవ్వకుండా పార్టీ అధ్యక్షుడికి ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కేంద్రం తీసుకురావాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసిందే తప్ప ఒక్క న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల విభజన హామీలు కేంద్రం పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు.

సవరించిన రాజ్యాంగ పీఠికనే వాడదాం

- పదో తరగతి సాంఘికశాస్త్రం పాఠ్యపుస్తకాలపై దాన్ని అతికించాలి
- డీఈవోలకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సవరించిన రాజ్యాంగ పీఠికనే వాడతామంటూ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) స్పష్టం చేసింది. దాన్ని డౌన్‌లోడ్ చేసి డీఈవోలకు పంపించామని తెలిపింది. పదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాల కవర్ పేజీపై దాన్ని అతికించాలని ఆదేశించింది. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి తెలుగు, ఆంగ్ల మాధ్యమం సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాల కవర్ పేజీపై రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకిక పదాల్లేకుండా ముద్రించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో డైరెక్టర్ స్పందించారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలకు కొత్తగా డిజైన్ రూపొందించామని ఆమె తెలిపారు. అయితే పదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాల్లోని కవర్ పేజీపై పాత రాజ్యాంగ పీఠికను డౌన్‌లోడ్ చేసి కొత్త డిజైన్ చేసి ముద్రించారని పేర్కొన్నారు. సవరించిన రాజ్యాంగ పీఠికను డౌన్‌లోడ్ చేశామని తెలిపారు. దాన్ని పదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాల కవర్ పేజీపై అతికించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవో) ఈ ఆదేశాలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కోరారు. అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలలకు హెడ్మాస్టర్లు, ప్రిన్సిపాళ్లకు సవరించిన రాజ్యాంగ పీఠికను పంపించి ఆ పాఠ్యపుస్తకాల కవర్ పేజీపై అతికించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత నివేదికను వెంటనే ఎస్‌సీఈఆర్టీకి పంపించాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల జోరు..!

బడిబాటలో.. కొత్తగా లక్ష మందికిపైగా విద్యార్థుల చేరిక

- ప్రయివేటు స్కూళ్ల నుంచీ జాయినింగ్స్
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పెరుగుతున్న ఆసక్తి

ముగిసిన బడిబాట.. కొనసాగనున్న ప్రవేశాలు ప్రక్రియ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల ధనదాహం, దోపిడీ.. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెరుగుదల నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నాయి.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుండగా.. అందుకు అనుగుణంగా విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి స్పందన వస్తోంది. ప్రధానంగా సర్కారు బడుల్లో మనబస్తీ-మనబడి ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అంతకంతకూ ఆసక్తి పెరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులపాటు నిర్వహించిన బడిబాట కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ఉపాధ్యాయులు గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల్లో ఇంటింటికీ తిరిగి కొత్తగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికిపైగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రయివేటు స్కూళ్ల నుంచి కూడా చేరినట్టు చెబుతున్నారు. ఇంకా ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పూర్తి లెక్కలు రావాల్సి ఉంది. 1 నుంచి 12 తరగతి వరకు ఉన్న అన్ని ప్రభుత్వ స్కూళ్లలో బడిబాట కార్యక్రమం జరిగింది.

పెరిగిన విద్యార్థుల సంఖ్య

విద్యార్థులను సర్కారు స్కూళ్ల వైపు ఆకర్షించడం కోసం ప్రభుత్వం ప్రతియేటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈనెల 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం రోజుకొక కార్యక్రమంతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతోంది. మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ, డిజిటల్ విద్య, మన (బస్తీ), ఊరు- మనబడిలో భాగంగా పాఠశాలల అభివృద్ధి వంటి తదితర సౌకర్యాలను వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ బడులవైపు ఆకర్షించేలా అవగాహన కల్పించారు. గతేడాదితో పోల్చిచూస్తే ఈ విద్యాసంవత్సరం లక్ష మందిని చేర్పించినట్టు సంబంధిత అధికారులు చెప్పారు. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఇదంతా టీచర్లు, అధికారుల సమిష్టి కృషితోనే సాధ్యమైందని విద్యాశాఖ అధికారులంటున్నారు.

ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ..

బడిబాటలో భాగంగా మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బస్తీలు, కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ మధ్యలో చదువు మానేసిన వారిని, బాలకార్మికులను, బడీడు పిల్లలను, ప్రయివేట్ పాఠశాలల్లో చదివే వారిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేశారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయి. మరో నెల రోజులపాటు ఈ ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోందని సంబంధిత అధికారులు తెలిపారు. నగరవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు 691 ఉండగా.. 1,14,607 మంది విద్యనభ్యసిస్తున్నారు.

బడిబాటలో క్లాసుల వారీగా నూతన అడ్మిషన్లు సంఖ్య చూస్తే.. ప్రీప్రైమరీ 504 మంది, 1వ తరగతిలో అంగన్వాడీ నుంచి 1,226 మంది, ప్రయివేట్ స్కూళ్ల నుంచి 809, నేరుగా ప్రవేశాలు 3863 మంది, మొత్తం 1వ తరగతిలో 5,898 మంది అడ్మిషన్లు పొందారు. ఇక ఆయా ప్రయివేట్ పాఠశాలల నుంచి 2వ తరగతి నుంచి 12వ తరగతి వరకు 6918 మంది ప్రవేశాలు పొందగా.. ఒకటి నుంచి కలిపితే ప్రయివేట్ పాఠశాలల నుంచి 7,727 మంది చేరారు. ఇలా మొత్తం 12816 విద్యార్థులను స్కూళ్లలో చేర్పించారు. ప్రవేశాల ప్రక్రియ వచ్చే నెల వరకు కొనసాగనుందని, ఇంకా విద్యార్థుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ కనీజ్ ఫాతీమా తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరిలో 4600 చేరినట్టు జిల్లా అధికారులు తెలిపారు.

కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ బడుల్లో చేరిన విద్యార్థుల సంఖ్య

హైదరాబాద్	-	12816
మేడ్చల్-మల్కాజిగిరి	-	4600
సంగారెడ్డి	-	6348
మెదక్	-	4135
సిద్దిపేట	-	6185
జనగామ	-	4580
వరంగల్	-	4604
హన్మకొండ	-	3725
మహబూబాబాద్	-	3054
భూపాలపల్లి	-	1860
ములుగు	-	2006
నాగర్‌కర్నూల్	-	5008
మహబూబ్‌నగర్	-	4250
వనపర్తి	-	3653
నారాయణ్‌పేట్	-	2150
గద్వాల్	-	135
ఆదిలాబాద్	-	4537
ఖమ్మం	-	3,847
భద్రాద్రికొత్తగూడెం	-	7,111

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

- అంగన్‌వాడీలకు రూ.26,000 వేతనం ఇవ్వాలి : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి



నవతెలంగాణ - వనపర్తి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలపై యూనియన్ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త జీపు జాతా శుక్రవారం వనపర్తి జిల్లాకు చేరుకుంది. జాతాకు సీఐటీయూ, అంగన్వాడీ నాయకులు జిల్లా కేంద్రంలోని మర్రికుంట ధర్నాచౌక్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. మర్రికుంట దగ్గర ధర్నాచౌక్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షులు శారద అధ్యక్షత వహించిన బహిరంగ సభలో జయలక్ష్మి మాట్లాడారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 45 సమావేశం తీర్మానం ప్రకారం అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో అంగన్వాడీ వ్యవస్థను రద్దు చేసేందుకు, అంగన్‌వాడీ టీచర్ల ఉపాధిని తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలపై పనిభారం తీవ్రంగా పెరిగిందని, ఐసీడీఎస్‌కు సంబంధం లేని అనేక విధులను చేయిస్తున్నారన్నారు. ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధం లేని బీఎల్ఓ డ్యూటీలను నిబంధనల ప్రకారం మరెవరికైనా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పుట్ట ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు ఏం రాజు, జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, ఎన్.రాములు, మద్దిలేటి, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కవిత, యూనియన్ జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, వనపర్తి ప్రాజెక్టు అధ్యక్షులు జి జ్యోతి, కార్యదర్శి సుమతి, ఆత్మకూరు ప్రాజెక్టు నాయకులు వెంకటేశ్వరమ్మ, నాగేంద్రమ్మ, జిల్లా కోశాధికారి రాధా, పెబ్బేరు ప్రాజెక్టు నాయకులు శాంతాబాయి, అలివేల, వనపర్తి నాయకులు విజయలక్ష్మి, ఊర్మిళ పాల్గొన్నారు.

ఆర్థిక, అనారోగ్య సమస్యలతో.. కుమార్తెతో సహా దంపతుల ఆత్మహత్య

నవతెలంగాణ-పెనుబల్లి

ఆర్థిక, అనారోగ్య సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన దంపతులు.. కుమార్తెతో సహా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్తకారాయగూడెం గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. పోట్రు వెంకట కృష్ణారావు (40), సుహాసిని (38) దంపతులకు అమృత (18), కార్తీక్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుహాసినికి నెలన్నర క్రితం ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా తిరువూరులో గర్భసంచికి శస్త్రచికిత్స జరిగింది. అప్పుడు నమూనాలను బయాప్సీకి పంపగా గురువారం క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. తిరువూరు వైద్యులను సంప్రదించగా కీమో థెరపీకి హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో దంపతులతో పాటు కూతురు అమృత(18) ముగ్గురూ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తిరువూరు నుంచి స్వగ్రామానికి వచ్చేటప్పుడు మూడు స్టూళ్లు, తాడు కొనుగోలు చేసుకొని వచ్చారు. అనంతరం కొత్త కారాయిగూడెంలోని మామిడితోటకు చేరుకున్నారు. గురువారం రాత్రి అక్కడే మామిడిచెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి సీఐ హనూక్, ఎస్ఐ సూరజ్ చేసుకొని పరిశీలించారు. ఇది ఇలా ఉండగా వీరి కుమారుడు కార్తీక్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. తను ఇంటి వద్ద ఉండిపోవడం, చెల్లితో సహా తల్లిదండ్రులు ఆస్పత్రికని వెళ్లి తిరిగి ఇంటికి రాకుండా ఆత్మహత్య చేసుకోవడంతో తీవ్ర దు:ఖంలో మునిగిపోయాడు.

అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి

- ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయమందివ్వాలి
- ఆత్మకూర్ టూ సదాశివపేటకు పేదల పాదయాత్ర
- తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా, వినతి
- పట్టాలిచ్చి పొజిషన్ చూపకపోతే ఇండ్లు నిర్మించుకుంటాం: జయరాజు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలని, గృహలక్ష్మీ పథకం కింద ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆత్మకూర్ గ్రామంలో పేదలకు పట్టాలిచ్చిన భూమిలో పొజిషన్ చూపి ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది నిరుపేదలు ఆత్మకూర్ నుంచి సదాశివపేట తహసీల్దార్ కార్యాలయం వరకు 15 కిలో మీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. ముండుటెండల్ని లెక్కచేయకుండా వృద్ధులు, మహిళలు కాలినడకన తహసీల్‌కు వచ్చి అక్కడ బైటాయించారు. అధికారులు బయటికి రావాలని, పట్టాలిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలంటూ నినదించారు. తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. ఆత్మకూర్‌లో 170 సర్వే నెంబర్‌లో ఉన్న ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో టీడీపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పేదలకు ఇండ్ల స్థలాలిచ్చి పట్టా సర్టిఫికెట్లు పంపిణీ చేసి పొజిషన్ చూపలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్ల పాలనలోనైనా పేదలకు పొజిషన్ చూపి ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందిస్తారని ఎదురు చూసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అందుకే పేదలంతా ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పాదయాత్ర రూపంలో పోరాటానికి దిగాల్సి వచ్చిందన్నారు. వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నా పేదలకు వంద గజాల ఇంటి స్థలం ఇచ్చేందుకు మనసు రావట్లేదన్నారు. మరో పక్క రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కంపెనీలు, రాజకీయ నాయకులు మాత్రం ప్రభుత్వ భూముల్ని కబ్జా చేస్తున్నా పట్టింపులేదని ఆరోపించారు. అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలని, లేని పక్షంలో పేదలతో కలిసి తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాదయాత్రలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్, వ్యకాస జిల్లా కార్యదర్శి ఎం.నర్సింహులు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పెద్దాపురం అశోక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యాదవరెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు మల్లేశం, శ్రీనివాస్, మహేష్, పోశయ్య, పుష్పమ్మ పాల్గొన్నారు.


సంపాదకీయం

'మణిపూర్'పై మౌనం ఇంకెన్నాళ్లు?

నేడు దేశమంతా మతం రంగు పులుముకుంటోంది. ఇది రోజు రోజుకూ దావాగ్నిలా రగులుకుంటోంది. ఏకంగా మనుషుల ప్రాణాలను బలిగొంటోంది. అయినా మన దేశాధినేత మౌనంగానే ఉంటున్నారు. మణిపూర్‌లో 'గిరిజన హోదా'పై కుకీలు, మెయిటీలు రెండు వర్గాల మధ్య చెలరేగిన వివాదం హింసాత్మక, ఉద్రిక్తతలకు దారితీసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మణిపూర్ మంటల్లో కాలుతుంటే మన "విశ్వగురు" మాత్రం విమానమెక్కి విదేశీ పర్యటనలకు చెక్కేశారు... 'ఇక్కడ మేము ఆదుకునేవారి కోసం ఆర్తనాదాలు పెడుతుంటే ఈ దేశాధినేత ఎక్కడ విందు భోజనం ఆరగిస్తున్నార'ని మణిపూర్ వాసులు ప్రశ్నిస్తున్నారు. తల్లులు, పిల్లలు, వృద్ధులు ప్రశాంతమైన మణిపూర్ కావాలని నేడు రోడ్లమీదకొస్తే ఆయన మాత్రం ఎవరికీ అందకుండా 'గాల్లో' తేలుతున్నారు. అతను కావాలనే మణిపూర్‌పై మౌనంగా ఉంటున్నారా?

ఓ వైపు మణిపూర్ హింసాత్మక ఘటనల్లో మండిపోతుంటే.. మరో వైపు ప్రధాని అమెరికా వైట్‌హౌస్‌లో విందులు, యోగా వేడుకలు జరుపుకోవడం పట్ల సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హింసాకాండకు వ్యతిరేకంగా కుకీ కమ్యూనిటీకి చెందినవారు దేశరాజధానిలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా నివాసం ఎదుట 'సేవ్ కుకీ లైవ్స్(కుకీల ప్రాణాలను కాపాడండి)' అనే సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలియజేస్తున్నారు. నిజానికి ఇప్పుడు కాపాడాల్సింది కుకీలొక్కరినే కాదు మతకోరల్లో చిక్కుకుంటున్న దేశ ప్రజల్ని కూడా...

దేశమంతా డబుల్ ఇంజన్ సర్కార్ రావాలనేది బీజేపీ నినాదం. అప్పుడే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి అవుతాయన్నది వారి విధానం! మరి మణిపూర్ బీజేపీ పాలిత రాష్ట్రమే. డబులింజన్ సర్కారే... అయినా అక్కడ రగిలిన చిచ్చును ఎందుకు ఆర్పడం లేదనేది సంశయం? ప్రజల ప్రాణాలు పోతున్నా, వారి ఆస్తులు ధ్వంసమవుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదనేదే అంతర్మథనం. రాష్ట్రంలో ఇప్పటికే చాలా చర్చిలు తగలబడ్డాయి. 'మణిపూర్ మంటల్లో కాలిపోతుంటే మోడీ ఎక్కడా?' అని ఇటీవల వెలసిన పోస్టర్లను చూస్తే ప్రజల ఆవేదన అర్థమవుతోంది. అక్కడ ఘర్షణ ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా వారిని పట్టించుకోక పోవడం వెనుక కారణాలేమిటి? ఈ భయానక, హింసాత్మక ఘటనల్లో ఏకంగా నూట ముప్పై మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది గాయాల పాలయ్యారు. యాభై వేలకు పైగా నిరాశ్రయులయ్యారు. రాష్ట్రం రక్తమోడుతుంటే ప్రజలు భయంభయంగా బతుకు లీడుస్తున్నారు. కొంతమందైతే వలసబాట పట్టారు. ఇంత జరుగుతున్నా డబులింజన్ సర్కార్‌లో స్పందన లేదు!



అసలు మణిపూర్‌లో తమ స్వార్థ రాజకీయాలకు మత చిచ్చుకు ఆజ్యం పోసిందే బీజేపీ. అక్కడ కొండ ప్రాంతాల్లో ఉండే గిరిజన ప్రజల్లో కుకీల్లో క్రైస్తవులు అధికం. ఇక మైదాన, లోయ ప్రాంతంలో ఉండే మెయిటీల్లో హిందువులెక్కువ. ఈ మెయిటీల్లో తమకు గిరిజన హోదా కల్పించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ మేరకు ఆ వర్గం ప్రజలు ఆందోళనలు, నిరసనలు, ర్యాలీలు కూడా చేపట్టారు. మెయిటీల డిమాండ్‌ను కుకీలు మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీన్ని ఒక అవకాశంగా తీసుకుని బీజేపీ ఈ వివాదానికి ఆజ్యం పోస్తూ వస్తోందన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఇటీవల ఆ రాష్ట్ర హైకోర్టు మెయిటీలను ఎస్టీ జాబితాలో చేర్చటాన్ని పరిగణలోకి తీసుకోవడంతో ఈ వివాదం మరింత తీవ్రరూపం దాల్చి నేటి అల్లర్లకు దారితీసింది. దీని వెనుక పాత్రదారి, సూత్రదారి బీజేపీయేనన్నది అక్కడి సామాజిక విద్యావేత్తల ఆరోపణ. సీఎం బీరెన్ సింగ్ స్వయానా మెయిటీ వర్గానికి చెందినవారు. ముఖ్యమంత్రే మెయిటీ వర్గం వ్యక్తి కావటం, అందులోనూ మెయిటీలంతా హిందువులవ్వడంతో బీజేపీ దీనిని రాజకీయంగా తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నమే ఈ హింసకు కారణమవుతోందన్నది విమర్శ.

మణిపూర్‌లో మత ఛాందసవాదం పెరిగిపోవటానికి బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ వైఖరే కారణమని సామాజిక, ప్రజా సంఘాలు భావిస్తున్నాయి. కాగా, ఇది నిజమేనని ప్రధాని మౌనం, ప్రభుత్వాల తీరు నిరూపిస్తున్నాయి! మెయిటీ, కుకీల మధ్య వివాదాన్ని హిందూ, క్రైస్తవుల మధ్య గొడవగా చిత్రించే బీజేపీ, దాని అనుబంధ సంఘాలు ప్రయత్నాలు దీనిని మరింత బలపరుస్తున్నాయి. కుకీలు మయన్మార్ (బర్మా) నుంచి వచ్చారని ఉద్దేశపూర్వకంగానే ఉద్రిక్తతలను నెలకొల్పుతున్నారు. లేదు ఇదంతా అబద్ధమయితే ఈ మంటల్ని ఆర్పేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి కాదా! అటువైపు తొంగైనా చూడటం లేదెందుకు? ఓ వైపు మణిపూర్ హింసాత్మక ఘటనల్లో మండిపోతుంటే.. మరో వైపు ప్రధాని అమెరికా వైట్‌హౌస్‌లో విందులు, యోగా వేడుకలు జరుపుకోవడం పట్ల సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హింసాకాండకు వ్యతిరేకంగా కుకీ కమ్యూనిటీకి చెందినవారు దేశ రాజధానిలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసం ఎదుట 'సేవ్ కుకీ లైవ్స్(కుకీల ప్రాణాలను కాపాడండి)' అనే సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలియజేస్తున్నారు. నిజానికి ఇప్పుడు కాపాడాల్సింది కుకీలొక్కరినే కాదు మతకోరల్లో చిక్కుకుంటున్న దేశ ప్రజల్ని కూడా...

అర్ధఫాసిజం నుండి పూర్తి ఫాసిజం వైపునకు...

గత ఐదు దశాబ్దాల భారతదేశ రాజకీయ చరిత్ర నడక తీరు ఇది. నేడు దేశంలో హిందూత్వ శక్తులు అధికార పీఠంపై కూర్చున్నాయి. మతం పేరిట, మూఢవిశ్వాసాల పేరిట ఇతర మతాలపై విషప్రచారం సాగిస్తూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థకి మూలస్తంభాలైన లౌకికతత్వం, సామాజిక న్యాయం, సమాఖ్య వ్యవస్థలపై కేంద్ర బీజేపీ పాశవికంగా దాడిచేస్తున్నది. చివరకు భారత రాజ్యాంగాన్ని చుట్టి పారేయడానికి, దాని స్థానంలో అత్యంత క్రూరమైన, అమానవీయమైన మనుధర్మ శాస్త్రాన్ని ప్రతిష్ఠించడానికి అర్రులు చాస్తున్నది. ఈ పరిస్థితి హఠాత్తుగా జరుగుతున్నది కాదు. ఈ నియంతృత్వానికి బీజాలు 48సంవత్సరాల క్రితం అనగా 1975 జూన్ 25 అర్ధరాత్రి ఆనాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని (ఎమర్జెన్సీ) ప్రకటించినప్పుడే బీజాలు ప్రారంభమైంది. 1975 జూన్ 25 నుండి 1977 మార్చి వరకు దాదాపు 21 నెలలపాటు ఎమర్జెన్సీ బీభత్సకాండ సాగింది. రాష్ట్రాల హక్కుల మీద దాడి, నక్సలైట్లను, ఆ పేరిట మరెందరో రాజకీయ ఖైదీలను మట్టుపెట్టడం, ప్రజాస్వామ్య ఉద్యమాలపై పైశాచిక దాడులు, ప్రలోభాలు వెదజల్లి ఇతర రాజకీయ పార్టీల నుండి పార్టీలు మార్పించడం వంటివి ఎమర్జెన్సీ కాలంలో యధేచ్ఛగా సాగించారు. బెంగాల్, కేరళ, త్రిపుర వంటి రాష్ట్రాలలో వామపక్ష పార్టీల పైన, ఉధృతంగా సాగుతున్న భూపోరాటాలపైన కాంగ్రెస్ గుండాలు పోలీసుల అండదండలతో విరుచుకుపడ్డారు. 1974 రైల్వే కార్మికులు జరిపిన అపూర్వమైన అఖిల భారత సమ్మెను అత్యంత అమానుషంగా అణచివేశారు. వందలాది మంది కార్మిక నాయకులను ఉద్యోగాల నుండి తొలగించడం, జైళ్లల్లో కుక్కటం, కార్యాలయాలపై దాడులు నిర్వహించడం మనం చూశాం. అన్నింటికీ మించి వాక్ స్వాతంత్ర్యం పైన, పత్రికా స్వేచ్ఛ పైన, మానవ హక్కుల పైన కనీవినీ ఎరుగని రీతిలో సాగిన అణచివేత అది. అందుకే ఆ కాలాన్ని (పాలనని) అర్ధ ఫాసిస్ట్ అన్నారు.



ఆర్. రఘు

ఎమర్జెన్సీ ముందు, తర్వాత

1971లో జరిగిన సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ మూడింత రెండొంతులు మెజారిటీ సాధించింది. వివిధ రాష్ట్రాలకు జరిగిన ఎన్నికలలో కూడా విజయం సాధించింది. అయితే రాయబరేలిలో గెలుపు కోసం ఇందిరాగాంధీ అక్రమాలకు పాల్పడ్డారని ప్రత్యర్థి వేసిన పిటిషన్‌పై 1975లో జూన్ 12న అలహాబాద్ హైకోర్టు తీర్పు నిచ్చింది. ఆమె ఎన్నిక చెల్లదని, ఆరు సంవత్సరాల పాటు ఆమె పోటీకి అనర్హురాలని సంచలనమైన తీర్పునిచ్చింది. నిజానికి సీపీఐ(ఎం) పార్టీ 1972లో జరిగిన తొమ్మిదవ మహాసభలో "గణనీయమైన రాయితీలు చూపి జన సామాన్యంలోని పెద్ద భాగాన్ని సంతృప్తి పరిచేశక్తి కాంగ్రెస్‌కి లేకపోవడం, మరిన్ని భారాలు మోపటం, నిర్బంధ కాండను ప్రయోగించడం, వామపక్షాలు, ప్రతిపక్షాలు బలహీనంగా ఉండటం, పాలకపార్టీ ప్రతిపక్షాలను సహించలేని స్థితిలో ఉండటం... ఇవన్నీ ఏక పార్టీ నియంతృత్వానికి దారితీసే ప్రమాదం ఉంది. అన్ని ప్రజాతంత్ర పార్టీల ఉనికికి ప్రమాదం ఏర్పడింది. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ఓటింగ్ హక్కుతో సహా కాంగ్రెస్ పాలనలో ఇక ఎంత మాత్రం సురక్షితంగా ఉండవు" అని హెచ్చరించింది. ఆ హెచ్చరిక మూడు సంవత్సరాల్లోనే వాస్తవ రూపం తీసుకుంది. ఓ పక్క అనేక పద్ధతుల ద్వారా కాంగ్రెస్ తన బలాన్ని నిరూపించుకుంటున్నా, మరో పక్క వర్గ పోరాటాలు వెల్లువెత్తాయి. స్వతంత్రం వచ్చిన 30సంవత్సరాలకే భారత పాలక వర్గాలైన బూర్జువా, భూస్వామ్య వర్గాల పాలన ఈ దేశాన్ని ముందుకు నడిపించలేదని, అలవిగాని సంక్షోభంలోకి దేశాన్ని నెడతాయని ఆ సందర్భంగా పాలకవర్గాలే తాము బాకాలూదుకునే సాధారణ ప్రజాస్వామ్యాన్ని కూడా సహించలేనిస్థితి దాపురించి, నిరంకుశత్వానికి తెరలేపుతాయని 1975లో నిరూపితమైంది. 1977లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ చిత్తుచిత్తుగా ఓడిపోయింది. ఇందిరాగాంధీ, ఆమె ముద్దుల కొడుకు సంజయ్‌గాంధీతో సహా కాంగ్రెస్ అధినాయకులంతా మట్టికరిచారు. కాంగ్రెసేతర బూర్జువా పార్టీలు సంకలు గుద్దుకున్నాయి.

1978లో జరిగిన సీపీఐ(ఎం) పదవ మహాసభ "ఎన్నికలలో కాంగ్రెస్ పరాభవం సంభవించినా నియంతృత్వానికి అనుకూల వాతావరణ సృష్టించే వర్గాల పరాజయానికి ఇది దారితీయలేదు. అందువల్ల బాహాటంగా నియంతృత్వాన్ని రుద్దటానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఇంకా కొనసాగించాల్సి ఉంది" అని ప్రజానీకానికి హెచ్చరించింది. ఈ నాలుగు దశాబ్దాలపైన పరిస్థితి సీపీఐ(ఎం) చేసిన హెచ్చరికకు అద్దం పడుతున్నది. కాంగ్రెస్‌ని ఓడించి అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం తన వర్గస్వభావ రీత్యా ఎమర్జెన్సీ సృష్టించిన నియంతృత్వ పోకడలను, వాటిని చట్టబద్ధం చేయడానికి తెచ్చిన 42వ రాజ్యాంగ సవరణను రద్దు చేయడానికి పూనుకోలేదు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని అందుకు జనతా ప్రభుత్వం ముందుకు తెచ్చిన 45వ సవరణ బిల్లును ఆమోదించలేక చాలా నెలలపాటు చర్చలతో కాలం వెళ్ళబుచ్చారు. అంతేకాదు కాంగ్రెస్ ప్రతిపాదించిన అనేక ప్రతీఘాత అంశాలను అందులో చొప్పించారు. అందులో ముఖ్యమైనది, అత్యవసర పరిస్థితిని ప్రకటించుకునే హక్కు, నిర్బంధించే హక్కు పొందుపరిచారు. దీంతో ఎమర్జెన్సీకి దారితీసిన పరిస్థితులు, అటువంటి పరిస్థితులు వచ్చినప్పుడల్లా పాలకవర్గాలు ఎంత క్రూరమైన చర్యలకు పాల్పడతాయో మనకి అర్థమవుతుంది. జనతా పార్టీ ప్రభుత్వం ఈ ప్రధాన వైఫల్యం, ముఖ్యంగా ఈ నియంతృత్వ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య కాంక్షతో ఉద్యమాల్లోకి వచ్చిన కోటానుకోట్ల మంది జనం ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరించడం వలన 1980లో జరిగిన ఎన్నికల్లో జనతా ప్రభుత్వం కూలిపోయి కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. వాస్తవానికి జనతా ప్రభుత్వం కూలిపోవడంలో, జనతా పార్టీ విచ్ఛిన్నం అవటంలో మరో ప్రధాన కారణం ఆర్‌ఎస్‌ఎస్ సభ్యత్వాన్ని వదులుకోమని తెగేసి చెప్పిన వాజ్‌పాయి, అద్వానీ వంటి ప్రముఖ హిందుత్వ నాయకుల పాత్ర ఉంది. జనతా విచ్ఛిన్నం తర్వాతే ఈ నాయకుల ఆధ్వర్యంలో 1980లో భారతీయ జనతా పార్టీ ఏర్పడింది.

నిరంకుశత్వం, నియంతృత్వం సాధారణీకరించబడ్డాయి

జనతా పార్టీని కూల్చి బయటికి వచ్చిన హిందుత్వ శక్తుల పార్టీ బీజేపీ. ఎమర్జెన్సీ కాలాన్ని, ముఖ్యంగా ఇందిరాగాంధీని తిట్టిపోస్తారు తప్ప, నిరంకుశ పోకడలకు, అందుకు రాజ్యాంగాన్ని సైతం తారుమారు చేయడంలో వారెన్నడు నోరుమెదపరు. ఇప్పుడు ఆ పార్టీ అత్యధిక మెజారిటీతో కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాలలోనూ అధికారంలోకి వచ్చింది. వచ్చింది మొదలు ప్రజాతంత్ర హక్కులపైన, రాజ్యాంగ విలువల పైన దాడి ప్రారంభించింది. అందుకు సిబిఐ, ఈడి, ఎన్నికల కమిషన్ చివరకు ఆర్బీఐ, సైన్యం, న్యాయస్థానాలు వంటి ఏ వ్యవస్థను వదలకుండా అన్నింటినీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం విచ్చలవిడిగా వాడుకుంటున్నారు. ఈరోజు దేశంలో అనేకమంది మానవ హక్కుల మేధావులు, రచయితలు, దళిత గిరిజన హక్కుల కోసం పోరాడే సామాజిక కార్యకర్తలు 'ఊపా' చట్టం కింద జైళ్లలో మగ్గుతున్నారు. ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టు 2022లో దేశంలో సాగుతున్న రాజద్రోహం కేసులను నిలిపివేయాలని, ప్రభుత్వం దీనిపై ఒక సమగ్ర సమీక్ష జరపాలని ఆదేశించింది. తాజాగా లా కమిషన్ తన 279వ నివేదికను విడుదల చేసింది. భారత క్రిమినల్ చట్టంలోని సెక్షన్ 124ఏని కమిషన్ పునఃసమీక్షించింది. అత్యంత ప్రమాదకరమైన ప్రతిపాదనలు చేసింది. ఈ సెక్షన్ క్రింద నిర్బంధించిన వారు కనీస కాలపరిమితి మూడు నుండి ఏడు సంవత్సరాలకు పెంచింది. అలాగే ఈ సెక్షన్ కిందకు వ్యక్తుల రాతలు, ఉపన్యాసాలు, ప్రకటనలు ఉన్నాయా లేదా అని నిర్ధారించే ప్రాథమిక హక్కు పోలీస్ వారికి అప్పగించింది. అలాగే హింసను ప్రేరేపించడానికి అనుకూలంగా ఉండటం కూడా ఈ సెక్షన్ పరిధిలోకి తేవాలని లా కమిషన్ ప్రతిపాదించింది. ఈ 124ఏ సెక్షన్ అనేది 1870లో స్వాతంత్ర పోరాటయోధుల్ని అణచివేయడానికి బ్రిటిష్ వలస పాలకులు తెచ్చిన చట్టం. బాల గంగాధర తిలక్ ఛత్రపతి శివాజీని ప్రశంసిస్తూ రాసిన సంపాదకీయాలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతీయుల తిరుగుబాటుకు కారణమయ్యాయని ఆయనను బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధించింది. అంటే ఇది వలస పాలకులు స్వతంత్ర పోరాటాన్ని అణచివేయడానికి ప్రభుత్వంపై వ్యతిరేకత రెచ్చగొట్టడం అన్న అంశాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించబడింది. సుదీర్ఘ పోరాటం, అత్యంత త్యాగమయం, లక్షలాదిమంది ప్రాణతర్పణతో స్వాతంత్రం సాధించుకున్న ఒక దేశంలో వలస పాలన కాలంనాటి ఇటువంటి చట్టాలను కొనసాగించటం అత్యంత దుర్మార్గం.

నిజానికి ప్రభుత్వ వ్యతిరేకత, దేశ వ్యతిరేకత ఒకటి కాదు. ప్రభుత్వం మీదే కాదు, రాజ్యం మీద, రాజకీయ వ్యవస్థ మీద, ప్రస్తుతం సమాజంలో ఉన్న అనేక పెడధోరణుల మీద గొంతెత్తటం, అణగారిన ప్రజల్ని సమీకరించడం, పోరాటాలు నిర్మించడం ప్రజాతంత్ర వ్యవస్థలో అంతర్భాగం. కానీ దీన్నంతా తలక్రిందులు చేసి ప్రభుత్వాన్ని విమర్శించినా, వారి విధానాలను విమర్శించినా దేశద్రోహం క్రింద జమ గట్టి, రాజద్రోహం కింద కేసులు పెట్టే పరిస్థితికి ఈరోజు దేశం చేరింది. ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేసుకుంటూ తన "మన్ కీ బాత్"లో దేశ ప్రధాని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉంది.



బూర్జువా పార్టీలు ఇప్పటికే ఇటువంటి నిర్బంధ చట్టాల ఉపేక్షకు కారణం వారి వర్గ స్వార్థమేనని వేరే చెప్పనక్కరలేదు. నిజానికి ప్రభుత్వ వ్యతిరేకత, దేశ వ్యతిరేకత ఒకటి కాదు. ప్రభుత్వం మీదే కాదు, రాజ్యం మీద, రాజకీయ వ్యవస్థ మీద, ప్రస్తుతం సమాజంలో ఉన్న అనేక పెడధోరణుల మీద గొంతెత్తటం, అణగారిన ప్రజల్ని సమీకరించడం, పోరాటాలు నిర్మించడం ప్రజాతంత్ర వ్యవస్థలో అంతర్భాగం. కానీ దీన్నంతా తలక్రిందులు చేసి ప్రభుత్వాన్ని విమర్శించినా, వారి విధానాలను విమర్శించినా దేశద్రోహం క్రింద జమ గట్టి, రాజద్రోహం కింద కేసులు పెట్టే పరిస్థితికి ఈరోజు దేశం చేరింది. ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేసుకుంటూ తన "మన్ కీ బాత్"లో దేశ ప్రధాని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉంది. అలాగే బీజేపీ నియంతృత్వ పాలనని విమర్శిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే, బీజేపీ వారు బ్రిటిష్ పాలకుల నుండి నియంతృత్వ సామాగ్రిని అరువు తెచ్చుకున్నారనటం వారికి ఎమర్జెన్సీతో దేశాన్ని అతలాకుతలం చేసింది తమ అధినాయకులే అని గుర్తుకు రాకపోవడం యాదృచ్ఛికం కాదు.

పరిస్థితి ఎక్కడిదాకా వచ్చిందంటే కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారే కాదు, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న, ఉండిన వైసీపీ, టీడీపీ, జనతాదళ్, కాంగ్రెస్ ప్రభుత్వాలన్నీ తమ పాలనలో ప్రభుత్వంపై విమర్శలను భరించలేక కొత్త కొత్త నల్ల చట్టాలను తెస్తూనే ఉన్నాయి. 'రాజ ద్రోహం' క్రిమినల్ చట్టం నుండి తొలగించకుండా జాగ్రత్త పడుతూనే ఉన్నాయి. అసహనం, నిర్బంధం, అణచివేతలు పాలక పార్టీల విధానాల్లో విడదీయరాని అంతర్భాగం అయి పోయాయి. రాజ్యాంగం ప్రసాదిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కనుమరుగవుతున్నాయి. ఈ పరిస్థితి హిందూత్వ శక్తులు నడుపుతున్న ఫాసిస్టు తరహా రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నాయి. అందువలన ఈ పరిస్థితిని సమూలంగా మార్చగల శక్తి, చారిత్రక బాధ్యత వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలది. పీడిత వర్గ పోరాటాలది. (జూన్25 ఎమర్జెన్సీ ప్రకటించిన రోజు)

సెల్: 9490098422



ఆకలిలేని లోకం చూడగలమా..?

ఐక్యరాజ్యసమితి ప్రధాన శాఖలైన ప్రపంచ ఆహార సంస్థ (యఫ్ఏఓ), యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐయఫ్ఏడి), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూయఫ్‌పి)లు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల ఆధారంగా ఆహార నివేదికను విడుదల చేశారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో(యస్‌డిజి) భాగంగా 2030 నాటికి ప్రపంచంలో ఆకలి చావులు, పోషకాహార లోపం లేకుండా చూస్తూ, 'జీరో హంగర్ (ఆకలిలేని లోకం)' సాధించాలనే ఉన్నత, ఉత్తమ నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచంలో పోషకాహారలోపం అత్యధికంగా ఆసియా దేశాల్లో 418మిలియన్లు ఉండగా, ఆఫ్రికాలో 282మిలియన్లు ఉన్నారని తెలుస్తున్నది. ప్రత్యేక చర్యలు అమలు పరచని యెడల 2030 నాటికి 660మిలియన్ల పేదలు ఉంటారని, ఆకలిని అంతం చేయడం అసాధ్యమని తెలుస్తున్నది. కరోనా మహమ్మారి విజృంభనతో అదనంగా 30మిలియన్ల పేదలు ఆకలితో అలమటిస్తున్నారని అర్థం అవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 237కోట్లకు పైగా (ప్రతి ముగ్గురిలో ఒకరు) ప్రజలకు అవసరమైనంత ఆహారం లభించడం లేదని నివేదిక తెలుపుతున్నది. లింగ వివక్ష కారణంగా పురుషుల కన్న మహిళల్లో 10శాతం అధికంగా ఆహార అభద్రత అనుభవిస్తున్నారు. ఆహార ధాన్యాల అధిక ధరలు, ఆదాయం తగ్గడం వల్ల 300కోట్ల పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహారలోపం ప్రపంచ మానవాళికి శాపంగా వెంటాడుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా 22శాతం (150 కోట్లు) ఐదేండ్ల లోపు పిల్లలు శరీర వృద్ధి నిలిచిపోవడం (స్టంటింగ్)తో, 6.7శాతం (4.54 కోట్లు) అభివృద్ధి తగ్గడం (వేస్టింగ్)తో, 5.7శాతం (3.89కోట్లు) అధిక బరువు (ఓవర్ వేయిట్) సమస్యలతో బాధపడుతున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో పిల్లల పోషకాహారలోపం అత్యధికంగా కనిపిస్తున్నది. ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో 15-49ఏండ్ల మహిళల్లో 30శాతం రక్తహీనత (ఎనీమియా) సమస్య కనిపించగా, అమెరికా, యూరప్‌లో 14.6శాతం మాత్రమే నమోదైంది. గర్భిణి మహిళల్లో రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల మందగించడం, తల్లిపాల లభ్యత పడిపోవడం, తక్కువ బరువుతో శిశుజననాలు, ఓవర్ వేయిట్ పిల్లలు పెరగడం, వయోజనుల్లో స్థూలకాయం లాంటి సమస్యల మధ్య 2030 నాటికి ఆకలిని అంతం చేయడం అసాధ్యమని వివరించారు.

ఆహార అభద్రత, పోషకాహారలోపం పెరగడానికి కారణాలుగా వాతావరణ అసాధారణ ప్రతికూల మార్పులు, ఆర్థిక మందగమనం, ఆర్థిక అసమానతలు, లాక్‌డౌన్, కర్ఫ్యూలు లాంటి అంశాలు పేర్కొనబడినవి. ఆహార ధాన్యాల దిగుబడి తగ్గడం, మార్కెటింగ్ శృంఖలంలో లొసుగులు (ఉత్పత్తి, పంట కోత, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్, సరైన ధర పలకడం), ఆదాయాలు తగ్గడంతో పోషకాహారానికి పేదలు దూరమవుతున్నారు. పోషకాహార ఆహార లభ్యత పెరగడానికి కారణాలుగా మానవీయతను పోషిస్తూ శాంతి స్థాపనలు, వాతావరణ ఒడిదుడుకులను తట్టుకోగల ఆహార వ్యవస్థలు, ఆర్థిక కష్టాలను అధిగమించడం, ఆహార సరఫరా శృంఖలంలో నాణ్యతను పరిరక్షించడం, పేదరికంతో పాటు అసమానతలను తొలగించడం, పోషకాహారం పట్ల ఆరోగ్య అవగాహన కల్పించడం లాంటి అంశాలు పేర్కొనబడినవి. ఆర్థిక అసమానతలు పెరిగితే ప్రకృతి సహజ వనరులైన సారవంతమైన నేలలు, మత్స్యసంపద, అటవీ సంపద, నీటి వనరుల కోసం సంఘర్షణలు కలగడం సర్వసాధారణమని నమ్మాలి. సమాజంలో ఆదాయం, ఉత్పత్తి సామర్థ్యం, ఆస్తులు, టెక్నాలజీ, విద్య, ఆరోగ్య రంగాల్లో అసమానతలు పెరిగితే వాటి దుష్ప్రభావానికి అధికంగా మహిళలు, పిల్లలపై నేరుగా పడుతుంది.

ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి వినియోగం వరకు ఇమిడి ఉన్న పలు దశల్లో ఆహారం వ్యర్థం కావడం నేర సమానమని నమ్మాలి. ఆహారాన్ని ఆదా చేస్తే ఆహారం ఉత్పత్తి చేసిన దాని కన్న మిన్న అని తెలుసుకోవాలి. 'యుయస్ ఫుడ్ సిస్టమ్స్ సమిట్' సూచనల ప్రకారం ప్రపంచ దేశాలు తమదైన చర్యలను తీసుకుంటూ 2030 నాటికి 'జీరో హంగర్' దిశగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన ఆహార అభద్రత (యస్‌డిజి టార్గెట్-2.1), పోషకాహారలోపాలను (యస్‌డిజి టార్గెట్-2.2) అధిగమించి, అనుకున్న సదుద్దేశ్యాలను సగర్వంగా చేరుకోవాలని ఆశిద్దాం.

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

నేటి నిజాలు

ఎక్కడైనా నిష్పాక్షికం ఉందా?
మనిషి పుట్టుకలో
మహా ప్రస్థానంలో
మంచి ఘడియల పేర
ప్రసవ మరణాలలో?
'కార్పో' ఆస్పత్రుల
కాసుల మాయే కదా?

అవును ఇప్పుడు రాజ్యాలు
కార్పొరేట్ల లాభాల భోజ్యాలు
జాతి జాతీయతల రాగాలు
వాటి చెప్పుకింద నలిగే తేళ్ళు
కుల మత అహాలు ఏవైనా
వాటి లాభార్జనల దాసోహాలు
ప్రపంచమొక పాడిపశువై
నిత్యం పితకాలి లాభాలు
దానికే దేశ పొలిమేరలు చెరిపే
పరదేశీ పెట్టుబడి వ్యాపారాలు

దేశమంటూ ఒకటుందని
చాటింపు వేయడానికే
ప్రజాస్వామ్య పాలక
ప్రభు వర్గ పీఠాలు
మాటలు ఏ కోటలు దాటినా
చేతలు 'కార్పో'ల దాసోహాలు
దేశభక్తి ప్రభోద గీతాలేవైనా
మెదడుకెత్తిన మతం మత్తులే
కైపెక్కించే అర్థసత్యాల ఎత్తులే

బ్రాహ్మణ రెడ్డి కమ్మ కాపు
ఆస్తి భేషజాలు దూసినా
మాల మాదిగ బిసిలమంటూ
అస్తిత్వ ఆర్తనాదాలు చేసినా
సరుకు కొనేవాడే
కార్పొరేటుకు దేవుడు
వినకుంటే కొనకుంటే
బెదిరేసి అదిరేసి పేరేది పెట్టినా
ఏ శాసన హద్దుల్లో బందీని చేసినా
పాలక పలకంపై దేశ ద్రోహి వాడు
రాజాదేశంతో చెరసాల బాధితుడే

'కార్పో' లాభానికి లేని
కుల మత విభజనలు
నిత్యం కష్టం అమ్మి బ్రతికే
'శ్రముల'కేల ఈ కంపు

గెంజ పుట్టించేది సరుకు సృష్టించేది
శ్రమశక్తి ఒక్కటే కష్టజీవి ఒక్కడే
గజమంత ఈ నిజము
జగమంత వెలిగినా
కోర మీసాలు తిప్పడం
కులమత తోకలెత్తడం వంటి
పౌరుషాల రసాలు ఉడికిస్తూ
విడదీసి పడదోస్తున్నారు
వొద్దులే వొద్దిప్పుడు
కులమతాధార అస్తిత్వాలు
కదపండి కలపండి
శ్రమైక్యతా రాగాలాపనలు

కుల మత అహాలు కత్తిరించి
శ్రమజీవుల రెక్కలెక్క కోసం
జనం కదిలి పిడికిళ్ళి లెగిస్తే
మంది బలం ముందు
మద బలం కూలదా?
కష్టాలెరుగని రోజు కోసం
కాలం పడవెక్కి నడవలేమా?
బాధల్లేని జన గానం
గుండె గొంతుకై పాడదా?

- ఉన్నం వెంకటేశ్వర్లు


ఆర్టీసీలను బలిపశువులు చేయకండి!

పుష్పా శ్రీనివాస్

కుక్కను చంపాలంటే ఆ కుక్కను పిచ్చికుక్క అని చిత్రీకరించితే చంపడం తేలికవుతుందన్న నానుడిలా కేంద్ర రవాణా మంత్రివర్యుల మాటలుండటం ఆందోళన కలిగిస్తున్నదని, పెట్టుబడిదారుల ప్రయోజనాలు పరిరక్షించడం కోసం ప్రజారవాణా సంస్థలైన ఆర్టీసీలను బలిపశువులను చేయవద్దని, ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌లను దోషులుగా చిత్రీకరించ వద్దని కేంద్ర రవాణాశాఖ మంత్రివర్యులకు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ లేఖ రాసింది. భారతదేశంలో డీజిల్ బస్ ఒక కిలో మీటర్ నడపడానికి రూ.115లు ఖర్చవుతున్నదని, అదే విద్యుత్ బస్‌లకు ఖరారైన టెండర్స్‌లో ఏసీ బస్‌లుకు అయితే కి.మీ.కు రూ.41లు, నాన్ ఏసి బస్ అయితే రూ.39లుకి ఫైనల్ అయ్యాయని, అందువల్ల సగానికి పైగా ఖర్చు తగ్గుతుందని, మే 24, 2023న 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండి యన్ ఇండస్ట్రీ' (సిఐఐ) వార్షిక సమావేశంలో కేంద్ర ఉపరితల రవాణాశాఖ మాత్యులు నితిన్ గడ్కరీ మాట్లాడటం అత్యంత దుర్మార్గం. ఇంతటితో ఊరుకోకుండా బస్‌లలో సింగిల్ డోర్ పద్ధతిని తీసుకొచ్చి, డిజిటల్ టిక్కెట్లు ఇవ్వడంతో పాటు, కండక్టర్లు చేస్తున్న ఫ్రాడ్‌ను తగ్గించడం కోసమేనని చెప్పి కండక్టర్ల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారు. వారిపై నిందారోపణ చేశారు. అలాగే విద్యుత్ బస్‌లకు ఎందుకు వెళ్తున్నామంటే డ్రైవర్లు చేస్తున్న డీజిల్ దొంగతనాన్ని నివారించడం కోసమేనని, మొత్తం డ్రైవర్లందరిని డీజిల్ దొంగలుగా చిత్రీకరించడం అత్యంత హేయమైనది.

విద్యుత్‌బస్‌లవల్ల నిజంగా ఆర్టీసీలు బతుకుతాయా?

మంత్రిగారి మాటల ప్రకారం డీజిల్ బస్ ఒక కి.మీ. రూ.115లు ఖర్చవుతుంది అంటున్నారు. ఇది నిజమే అయితే లీటర్ డీజిల్ ఒక కి.మీ. కూడా రాదు. మరి తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ లెక్కల ప్రకారం ఒక లీటర్ 5.24కి.మీ. నడుస్తున్నాయి. అంటే కి.మీ. నడపడానికి కేవలం రూ.18లు మాత్రమే డీజిల్‌కు ఖర్చవుతున్నది. ఈ నిజం మంత్రికి తెలిసే, ఆర్టీసీలపై అభాండాలు వేస్తున్నారు. ఏసీ విద్యుత్ బస్‌లు అయితే రూ.42లు, నాన్ ఏసీ అయితే రూ.39లకే టెండర్లు వచ్చాయి అని కేంద్ర మంత్రివర్యులు చెప్తున్నది నిజమేనా? టీఎస్‌ఆర్టీసీ త్వరలో 1010 విద్యుత్ బస్‌లు సమకూర్చుకొంటున్నదని, 500 బస్‌లు టెండర్ సుమారు రూ.55లు ఉండగా, మరో 500 బస్‌ల కోసం టెండర్ రూ.58ల వరకు ఉంటుందని, డబుల్ డక్కర్ బస్‌లకు దాదాపు రూ.80ల వరకు టెండర్స్ వేసినట్లు, ఈ టెండర్లన్నీ గ్రాస్ కాస్ట్ కాంటాక్ట్ (బస్‌ల కొనుగోలు బదులు బస్‌సేవలను కొనుగోలు చేస్తారు) పద్ధతిపైనే ఇచ్చినట్లు పత్రికలో వార్తలు వచ్చాయి. అంటే విద్యుత్ బస్‌ల కాంట్రాక్టు రూ.39లకే నడుపుతుంటే, వద్దు వద్దు మేము రూ.55ల నుండి రూ.58లు ఇస్తామని ఆర్టీసీ అధికారులు అంటున్నారా? కానే కాదు. దేశంలో వేసిన ఏ విద్యుత్ బస్ టెండర్ కూడా మంత్రిగారు చెప్పిన రేటుకు రాలేదు అన్నది నిజం. ఇప్పటి వరకు భారతదేశంలో ఫైనల్ అయిన టెండర్లులో కనీస మొత్తం రూ.52ల నుండి రూ.70ల వరకు ఉన్నాయి. ఇవన్నీ కూడా జీసీసీ పద్ధతి లోనే నడుస్తాయి. ప్రతి బస్‌కు 50లక్షల రూపాయల మేర సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకే ఇస్తుంది. ఆ బస్‌లను కండక్టర్లతో నడపాలనుకుంటే ఆ ఖర్చు అదనంగా ఆర్టీసీలు భరించాల్సిందే. హైదరాబాద్‌లో రాబోయే విద్యుత్ బస్‌లకు కండక్టర్‌తో నడపాలంటే



సుమారు రూ.62లు ఆర్టీసీ చెల్లించాల్సి వుంటుంది. అంటే మంత్రి చెబు తున్న దానికి, నిజానికి మధ్య కి.మీ.కు రూ.20పైనే తేడా ఉంటుంది. ఈ నిజాన్ని ఎందుకు కప్పిపుచ్చుతున్నారు?

భారాలు ప్రజలకు, లాభాలు కార్పొరేట్లకు

2022-23 ఆర్థిక సంవత్సరంలో కి.మీ. రూ.51లు ఆదాయం రాగా రూ.57లు ఖర్చయినట్లు ఆర్టీసి చెప్తున్నది. అంటే ప్రతి కి.మీ. రూ.6 ఎక్కువ ఖర్చవుతుందని, దానిని తగ్గించుకొనేందుకు కార్మికులపై భరించలేని పని భారాలు పెంచుతున్నారు. ప్రస్తుతం 44వేల మంది సంస్థలో ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు. 2025లోపు 3500 విద్యుత్ బస్‌లు తెస్తామని ఆర్టీసీ అధికారులు ప్రకటిస్తున్నారు. ఇవన్నీ కూడా జీసీసీ పద్ధతి ప్రకారం నడుపుతారు అంటే ఇప్పుడు బస్ వెనుక ఆరుగురు పొందుతున్న ఉపాధిని కోల్పోతారు. (3500×6=21,000). ఇంత మంది కార్మికులు తగ్గిపోతే ఆర్టీసీ ఖర్చులు భారీగా తగ్గాలి కదా? మరి తగ్గుతాయా? ఇంతమంది ఉద్యోగాలు లేకుండాపోయిన తరువాత కూడా కండక్టర్‌తో నడపాలంటే రూ.60లపైనే విద్యుత్ బస్‌లకు చెల్లించాల్సి వస్తుంది. కిలో మీటర్‌కు ఇప్పుడు వస్తున్న ఆదాయం కచ్చితంగా వస్తుందను కుంటే కూడా ప్రతి కి.మీ. రూ.10లు అదనంగా విద్యుత్ బస్‌లు నడిపే సంస్థలకు చెల్లించాల్సి వస్తుంది. మరి ఆ డబ్బులు ఎక్కడ నుండి వస్తాయి? అంటే అంతి మంగా ప్రజల నుండి టిక్కెట్లు ఛార్జీలు పెంచడం ద్వారా, సెస్ రూపంలో భారం మోపాల్సి వస్తుంది. కార్పొరేట్ విద్యుత్ బస్‌ల కంపెనీలు లాభాలు దండుకొంటాయి. ఆర్టీసీలో మూడవవంతు అద్దె బస్‌లుండగా, మరో మూడవ వంతు కార్పొరేట్ విద్యుత్ బస్‌లు అయి, టీఎస్ ఆర్టీసీ అన్న బోర్డు మిగిలి, మొత్తం ప్రయివేటు కార్పొరేట్ల పెత్తనం లోకి వెళ్ళే ప్రమాదం ఉంది. ఈ విధంగా కార్పొరేట్లకు లాభాలు గ్యారెంటీ చేయడం కోసమే సిఐఐ మీటింగ్‌లో మంత్రి ఆర్టీసీలపై ఆ వ్యాఖ్యలు చేశారని అర్థం చేసుకోవాలి. ఈ విద్యుత్ బస్‌ల అనేక అంశాలపై స్పష్టత లేదు. పర్యావరణహితం మంచిదే. కానీ వీటి బ్యాటరీలను స్క్రాపింగ్ పాలసీ ఏమిటో మన దేశంలో లేదు. ఇప్పుడున్న బ్యాటరీల చార్జింగ్ 300కి.మీ. వరకు వస్తుంది. హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్ళేలోపు సూర్యాపేటలో ఒకసారి చార్జింగ్ చేయవలసి వస్తుందని వార్తలు వచ్చాయి. విద్యుత్ బస్‌ల చార్జింగ్ కోసం కనీసం 3గంటలకు పైగా పడ్తుంది. ఫలితంగా ఆర్టీసీ బస్‌ల షెడ్యూలింగ్ మొత్తం కుప్పకూలుతుంది. అలాగే బ్యాటరీ స్వాపింగ్ కోసం ప్రయతిస్తే, ఆర్టీసీ చెల్లించాల్సిన డబ్బులు రెట్టింపయ్యే ప్రమాదం ఉంది. అందుకని ఈ విద్యుత్ బస్‌ల వల్ల కలుగు తాయని చెపుతున్న ప్రయోజనాలు, నష్టాలు, ఆర్టీసీల భవిష్యత్, ప్రజల పరిస్థితులపై మొత్తం లబ్ధిదారులందరి అభిప్రాయాలు తీసుకోవాలి. ఇప్పుడున్న రూపంలోనైనా ఆర్టీసీ సంస్థను కాపాడుకోవడానికి ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలి.

కిలో మీటర్‌కు ఇప్పుడు వస్తున్న ఆదాయం కచ్చితంగా వస్తుందను కుంటే కూడా ప్రతి కి.మీ. రూ.10లు అదనంగా విద్యుత్ బస్‌లు నడిపే సంస్థలకు చెల్లించాల్సి వస్తుంది. మరి ఆ డబ్బులు ఎక్కడ నుండి వస్తాయి? అంటే అంతి మంగా ప్రజల నుండి టిక్కెట్లు ఛార్జీలు పెంచడం ద్వారా, సెస్ రూపంలో భారం మోపాల్సి వస్తుంది. కార్పొరేట్ విద్యుత్ బస్‌ల కంపెనీలు లాభాలు దండుకొంటాయి. ఆర్టీసీలో మూడవవంతు అద్దె బస్‌లుండగా, మరో మూడవ వంతు కార్పొరేట్ విద్యుత్ బస్‌లు అయి, టీఎస్ ఆర్టీసీ అన్న బోర్డు మిగిలి, మొత్తం ప్రయివేటు కార్పొరేట్ల పెత్తనం లోకి వెళ్ళే ప్రమాదం ఉంది.

ప్రొఫెషనల్‌గా ఉండాల్సిందే

ప్రస్తుతం కొన్ని కంపెనీలు వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పిస్తున్నాయి. మరికొన్ని మూడు రోజులు ఆఫీస్‌కు వచ్చి, మూడు రోజులు ఇంటి నుంచి పని చేసేలా అవకాశం కల్పిస్తున్నాయి. ఆఫీస్‌కి వెళ్ళడం అంటే నీట్‌గా రెడీ అయిపోయి వెళ్తాం. కానీ ఇంటి నుండి పని చేయడమంటే రెడీ అవడంలో కాస్తంత అశ్రద్ధ ఉంటుంది. అయితే ఇంటి నుండి పని చేసే సమయంలో ఆన్‌లైన్, వీడియో కాన్ఫరెన్స్‌లు ఎక్కువగా జరుగుతుంటాయి. ఆ మీటింగ్ సమయంలో మీరు ఇంట్లో వుండి వర్క్ చేస్తున్నప్పటికీ ప్రొఫెషనల్‌గా



కనిపించాలి. అలాంటి ప్రొఫెషనలిజం కోసం కొన్ని టిప్స్ ఉన్నాయి. అవేమిటో చూద్దాం రండి.

- ఆఫీస్‌లో మీ పని ప్రదేశం ఎలా ఉంటుందో మీ హోమ్ ఆఫీస్ కూడా వీలున్నంత వరకూ అలాగే సెట్ చేసుకోండి. వర్క్ మొదలుపెట్టబోయే ముందే మీ వైర్లెస్ హెడ్ ఫోన్స్, నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్స్ .. మీకు ఏవి కావాలనుకుంటే అవి రెడీగా పెట్టుకోండి. మీటింగ్ మధ్యలో పరిగెత్తి తెచ్చుకునే పద్ధతికి స్వస్తి చెప్పండి.
- ఆఫీసు ఆఫీసే ఇల్లు ఇల్లే. ఆఫీస్ మధ్యలో ఇంటి పనుల కోసం లేవకండి. ఆఫీసులో ఎలా ఉంటారో ఇంట్లో కూడా అలాగే ఉండండి. ఆఫీసులో టీవీ చూడరు కదా, ఇంట్లో కూడా చూడకండి. ఇరవై ఐదు నిమిషాలు పని చేశాక ఐదు నిమిషాలు అటూ ఇటూ తిరిగి, మంచి నీళ్ళు తాగి, ముఖం మీద నీళ్ళు చల్లుకుని మళ్ళీ వచ్చి కూర్చోండి. ఆఫీస్‌లో కొలీగ్స్‌తో కలిసి తీసుకునే టీ బ్రేక్ సమయంలో ఇలా చేయండి.
- నీట్‌గా డ్రెస్ అయితేనే ఉత్సాహంగా పని చేయగలం. మనం వేసుకునే బట్టలే మన మూడ్‌ని డిసైడ్ చేస్తాయి. అందుకే మంచి షేడ్స్‌లో ఉన్న డ్రెస్ సెలెక్ట్ చేసుకుంటే హ్యాపీగా పని చేయగలం. అంతే కాక సెలెక్ట్ చేసుకునే షేడ్స్ కూడా కెమెరాకి అనువుగా ఉండాలి. స్ట్రైప్స్, చెక్స్ ఉన్నవి ఆన్‌లైన్ మీటింగ్స్‌లో అంత నీట్‌గా కనిపించవు. న్యూట్రల్ షేడ్స్‌లో, ప్లెయిన్ కలర్స్‌తో ఉన్న షర్ట్స్ వీడియో కాల్స్‌కీ, మీటింగ్స్‌కీ బాగా సరిపోతాయి.
- కెమెరా ఎప్పుడూ మీ కంటికి ఎదురుగా ఉండేలా లాప్టాప్ అడ్జస్ట్ చేసుకోండి. దాంతో సడన్‌గా ఎటెండ్ అవ్వాల్సిన మీటింగ్స్‌కి సరిపోయేలా ఐ లెవెల్ ఉంటుంది. అలాగే ఒక కర్చీఫ్ పక్కనే ఉంచుకోండి. మీరు ఐరన్ చేసిన డ్రెస్ వేసుకుని ఉంటే పరవాలేదు. లేదంటే నీట్‌గా ఐరన్ చేసిన లైట్ కలర్ డ్రెస్ ముందురోజే పక్కన పెట్టుకోండి.

సూర్యకాంతి లేకున్నా...

మొక్కలు పెంచుకోవాలని చాలా మంది అనుకుంటారు. కాని బయట స్థలం లేక పెంచుకోలేకపోతున్నామని అంటుంటారు. పట్టణాల్లో అయితే సూర్యకాంతి పడని ఇండ్లు చాలా ఉంటాయి. అందుకే మొక్కలు పెంచుకోవాలనే కోరిక చాలా మందికి కల గానే ఉంటుంది. అయితే సూర్యరశ్మి లేకపోయినా పచ్చగా ఉండి బాగా పెరిగే కొన్ని మొక్కలు ఉన్నాయి. వీటిని తక్కువ కాంతి మొక్కలు అంటారు. అందువల్ల ఇంట్లో తక్కువ వెలుతురు ఉన్న ప్రదేశంలో నాటవచ్చు. ఇవి ఇంటి అందాన్ని కూడా పెంచుతాయి.



కాస్ట్ ఐరన్ ప్లాంట్ : ఈ మొక్కకు దాని లక్షణాల కారణంగా ఆ పేరు వచ్చింది. మొక్కలు నాటడం మీద పెద్దగా అనుభవం లేకున్నా దీనిని సులభంగా పెంచుకోవచ్చు. ఎందుకంటే ఈ మొక్కకు ఎక్కువ పోషణ అవసరం ఉండదు. అలాగే, సూర్యరశ్మి లేకుండా కూడా సులభంగా పెరుగుతుంది.

చైనీస్ ఎవర్ గ్రీన్ ప్లాంట్ : ఈ మొక్కను అగ్లోనెమా అంటారు. దీనికి కనీస కాంతి అవసరం కాబట్టి మీరు ఈ మొక్కను ఇంటి లోపల నాటవచ్చు. కానీ ఈ మొక్కలకు క్లోరిన్ ఉన్న నీటిని పోస్తే ఎండిపోయే అవకాశం ఉంటుంది.

ఫిలోడెండ్రాన్ ప్లాంట్ : ఈ మొక్క గాలిని శుద్ధి చేయడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ఫిలోడెండ్రాన్ మొక్కలో అనేక రకాలు ఉన్నాయి. ఈ మొక్క పెరగడం ప్రారంభించినప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి కుండలో పెంచుతూ నిటారుగా ఉండే కర్రను ఆధారంగ ఉంచాల్సి ఉంటుంది. తద్వారా ఈ మొక్క సరిగ్గా పెరుగుతుంది.

సింగోనియం మొక్క : ఈ మొక్కను 'యారోహెడ్' అని కూడా అంటారు. ఈ మొక్క ఆకులు బాణపు తలల వలె ఉంటాయి. ఈ మొక్క ఏదైనా భాగాన్ని తీసుకునైనా నాటవచ్చు. ఇది ఆక్సిజన్‌ను పుష్కలంగా అందిస్తుంది. గాలిని శుద్ధి చేస్తుంది. దీనిని నేల, నీరు రెండింటిలోనూ పెంచవచ్చు. అంతేకాదు, చిన్న మొక్కలను సీసా లేదా పూల కుండల్లో కూడా నాటవచ్చు.

స్నేక్ ప్లాంట్ : స్నేక్ ప్లాంట్ గాలిని శుద్ధి చేయడానికి ఉత్తమమైన మొక్కగా పేర్కొనవచ్చు. ఈ మొక్క మట్టిలో, నీటిలో రెండింటిలోనూ నాటవచ్చు. ఈ మొక్కకు ప్రతిరోజూ నీరు పెట్టవలసిన అవసరం లేదు. ఇంట్లో ఎక్కడైనా ఉంచుకోవచ్చు.

స్మార్ట్ ఫోన్ వచ్చిన తర్వాత అందరి జీవితాలు చాలా మారిపోయాయి. కంటికి కనిపించిన ప్రతి అందమైన దృశ్యాన్ని అందులో బంధించాలని అనుకుంటారు. అంత వరకు మంచిదే. కానీ కొంత మంది మితిమీరిపోయి నాలుగ్గోడల మధ్య వుండాల్సిన విషయాలను కూడా వీడియోలు తీసేస్తున్నారు. దీనివల్ల అనేక సమస్యలు వస్తున్నాయి. అలాంటి సమస్యతోనే ఈ వారం ఐద్వా అదాలత్‌కు వచ్చింది లత. అసలు ఆమె సమస్య ఏంటో తెలుసుకుందాం...

మారకపోతే అతనితో కష్టం

ఐద్వా అదాలత్
సెల్ : 9490098024



లతది మధ్యతరగతి కుటుంబం. డిగ్రీ చేసింది. భర్త సురేష్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పెండ్లి తర్వాత ఇద్దరూ సిటీకి వచ్చేశారు. సురేష్ అక్క కూడా సిటీలోనే ఉంటుంది. ప్రతి చిన్న విషయం అక్కతో పంచుకోవడం సురేష్‌కి అలవాటు. తన ఇంట్లో జరిగే విషయాలను కూడా కెమెరాలు పెట్టి అక్కకు చూపించేవాడు. అంతేకాదు ఆమె ఎప్పుడు కావాలంటే అప్పుడు చూసేందుకు లైవ్ కెమెరాలను కూడా ఏర్పాటు చేశాడు. అలా చూస్తూ ఆమె ఆ లైవ్‌లోనే 'ఇదిగో ఈ పని సరిగ్గా చేయలేదు, ఆ పని సరిగ్గా చేయలేదు, ఈ బట్టలు ఎందుకు వేసుకున్నావు, వేరేవి వేసుకో, మా తమ్ముడికి ఇలాంటి బట్టలు నచ్చవు' అని చెప్పేది. చివరకు వంట కూడా ఆమె చెప్పిందే వండాలి. ఇదంతా లతకు అస్సలు నచ్చలేదు. కెమెరాలు తీసేయమంటే సురేష్ వినడు.

చిన్న చిన్న మోడ్రన్ డ్రెస్సులు తీసుకొచ్చి వేసుకోమంటాడు. లతకు అలాంటి బట్టలు వేసుకోవడం ఇష్టం లేదు. అయినా భర్త అడిగాడని, ఇంట్లోనే కదా అని వేసుకుంది. అయితే ఆమె ఆ బట్టలు వేసుకున్న తర్వాత సురేష్ ఫొటోలు తీసేవాడు. 'ఫొటోలు ఎందుకు తీస్తున్నారు, ఎవరైనా చూస్తే బాగోదు' అన్నా వినడు. ఆ ఫోటోలు లత అన్నయ్యకు పంపించి 'మీ చెల్లి వద్దన్నా వినకుండా ఇలాంటి డ్రెస్సులు వేసుకొని తిరుగుతుంది. నేనేమైనా అంటే 'మనం ఉండేది సిటీలో ఈ మాత్రం వేసుకోకపోతే ఎలా' అటుంది' అని చెప్పాడు. దాంతో లతను తల్లిదండ్రులు కోప్పడ్డారు. 'కుటుంబ పరువు తీస్తున్నావు. సురేష్ చెప్పినట్లు విను, నీకు అంతగా వేసుకోవాలి అనిపిస్తే చుడిదార్ లాంటివి వేసుకో. ఇంకో సారి సురేష్‌ని బాధ పెట్టకు' అన్నారు.

> పెండ్లి అనేది రెండు మనసులకు సంబంధించిన అందమైన బంధం. అలాంటి బంధాన్ని నువ్వు అవహేళన చేస్తున్నావు. భార్యాభర్తలు నాలుగు గోడల మధ్య చేసే పనిని కూడా వీడియోలు తీస్తున్నావు. వాటిని నీ స్నేహితులకు చూపిస్తున్నావు. ఇది ముమ్మాటికీ తప్పే? మీ అక్క ఇంటికి వచ్చినప్పుడు లత ఏదైనా పొరపాటు చేస్తే సరిచేయవచ్చు. కానీ కెమెరాల్లో చూస్తూ ప్రతి రోజూ, ప్రతి పనిలో లోపాలు వెదకడం సరికాదు. నువ్వూ, మీ అక్క ఇలాంటివి చేయడం వెంటనే మానుకోవాలి

ఇలా ప్రతి విషయంలో తనదే తప్పు అన్నట్లు చూపించేవాడు. లత తన పుట్టింకి వెళ్ళినా, బయటకు ఎక్కడికైనా వెళ్ళినా వెంట తీసుకువెళ్లే బ్యాగ్ చెక్ చెస్తాడు. 'ఎందుకు ఇలా చేస్తున్నావు' అంటే 'ఇక్కడి నుండి ఏమైనా తీసుకొని మీ అమ్మ వాళ్లకు ఇస్తావేమో' అని, అంటాడు. 'ఈ చిన్న హ్యాండ్ బ్యాగ్‌లో ఏం తీసుకెళ్తాను' అన్నా వినేవాడు కాదు. దాంతో ఆమె ఎక్కడికి వెళ్లినా బ్యాగ్ తీసుకెళ్ళడమే మానేసింది. కనీసం బట్టలు కూడా తీసుకెళ్ళదు. ఫంక్షన్, పెండ్లి లాంటివి జరిగితే సురేష్ తీసుకువస్తే వేసుకునేది, లేదంటే వాళ్ళ వదినల బట్టలు వేసుకునేది.



తన స్నేహితులు ఎవరైనా ఇంటికి వస్తే లతను మాట్లాడవద్దంటాడు. అది అమ్మాయిలైనా సరే. 'ఏంటి నీ భార్య అసలు ఎవరితో మాట్లాడదు, ఎందుకు ఇలా ఉంటుంది' అంటే 'తను ఎప్పుడూ అంతే, ఇలాగే ఉంటుంది' అని చెబుతాడు. రూమ్‌లోకి వచ్చిన తర్వాత ఫోన్లో పిచ్చి పిచ్చి వీడియోలు చూస్తుంటాడు. లతను కూడా అలా చేయమంటాడు. అలా చేయకపోతే ఆ విషయం కూడా అక్కకు చెబుతాడు. ఆమేమో 'నిన్ను పెండ్లి చేసుకుంది ఎందుకు, వాడిని ఆ మాత్రం సుఖ పెట్టలేవా, భర్తను ఎలా చూసుకోవాలో నేర్పించ లేదా మీ వాళ్లు' అంటూ దెప్పిపొడిచేది.

ఒక రోజైతే లత మంచంపై పడుకుంటే ఆమె చుట్టూ తిరుగుతూ వీడియో తీస్తున్నాడు. ఇలాంటివి ఎందుకు వీడియో తీయడం అని చెప్పినా వినకుండా ప్రతి రోజు వీడియోలు తీసేవాడు. ఒక రోజు ఆ వీడియోలు తన స్నేహితులకు చూపించాడు. అది లతకు తెలిసి భర్తతో గొడవపెట్టుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. తెలిసిన వారి ద్వారా ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

లీగల్‌సెల్ సభ్యులు ఫోన్ చేసి సురేష్‌ని పిలిపించి మాట్లాడితే 'నాకు నా భార్య రోజూ కొత్తగా, మోడ్రన్‌గా కనిపించాలి. నేను ఉద్యోగం చేసే దగ్గర అందరూ ఎంతో అందంగా ఉంటారు. లతను కూడా అలా ఉండు అని చెప్పడం తప్పా. నా భార్య అందాలను ఫోన్లో దాచుకుంటున్నాను. అది కూడా ఆమెకు ఇష్టం ఉండదు. ఫొటోలు, వీడియోలు తియ్యొద్దు అంటుంది. ఇక నేను ఇంట్లో లేనప్పుడు ఆమె ఏం చేస్తుందో నాకెలా తెలుస్తుంది. అందుకే ఇంట్లో కెమెరాలు పెట్టాను. అది అప్పుడప్పుడు అక్క చూస్తుంది. లత ఏదైనా పొరపాటు చేస్తే చెబుతుంది అంతే. అది కూడా తప్పా. పల్లెటూరి అమ్మాయిని పెండ్లి చేసుకుంటే ఇలాగే ఉంటుంది' అంటూ చెప్పుకొచ్చాడు.

పెండ్లి అనేది రెండు మనసులకు సంబంధించిన అందమైన బంధం. అలాంటి బంధాన్ని నువ్వు అవహేళన చేస్తున్నావు. భార్యాభర్తలు నాలుగు గోడల మధ్య ఉండాల్సిన విషయాలను కూడా వీడియోలు తీస్తున్నావు. వాటిని నీ స్నేహితులకు చూపిస్తున్నావు. ఇది ముమ్మాటికీ తప్పే? మీ అక్క ఇంటికి వచ్చినప్పుడు లత ఏదైనా పొరపాటు చేస్తే సరిచేయవచ్చు. కానీ కెమెరాల్లో చూస్తూ ప్రతి రోజూ, ప్రతి పనిలో లోపాలు వెదకడం సరికాదు. నువ్వూ, మీ అక్క ఇలాంటివి చేయడం వెంటనే మానుకోవాలి' అని చెప్పి అతని ఫోన్లో వున్న లత వీడియోలు, ఫొటోలు మొత్తం డిలిట్ చేయించారు. ఇక ముందు ఇలాంటి పనులు చేస్తే పరిస్థితి మరోరకంగా ఉంటుందని గట్టిగా హెచ్చరించారు.

'సురేష్ తన ప్రవర్తన మార్చుకొని మంచిగా ఉంటేనే అతనితో కలిసి ఉంటాను. లేదంటే వెళ్ళిపోతాను' అని అందరి ముందు లత నిర్భయంగా చెప్పింది. లత కుటుంబ సభ్యులు కూడా ఆమెకు అండగా నిలబడ్డారు. దాంతో సురేష్ ఆలోచనలో పడ్డాడు. భార్య తనతో ఇక ఉండదని, భార్య వదిలేసి పోయిందని ఊర్లో తెలిస్తే పరువు పోతుందని భయపడ్డాడు. చేసేది లేక 'సరే మేడమ్, ఇకపై తనకు ఇష్టం లేని పని చేయను. ఇకపై నా వల్ల లతకు ఎలాంటి సమస్యా ఉండదు. ఒక వేళ అలా జరిగితే మీరు ఏ శిక్ష వేసినా భరిస్తాను' అని చెప్పి లతను తీసుకొని వెళ్ళిపోయాడు.

- వై. వరలక్ష్మి, 9948794051

పొలిటికల్ హీట్

(మొదటిపేజీ తరువాయి)

మొదలైంది. ఇక ఐటీ, ఈడీ, సీబీఐలను నమ్ముకున్న బీజేపీ 'మునుగోడు'తో డీలాపడి, కర్నాటక ఫలితాలతో 'బేర్' మంటూ రాష్ట్రంలో తమ స్థానం ఎక్కడోనని వెతుకులాట మొదలెట్టింది. ఏ నేత ఎప్పుడు ఎటు జంప్ అవుతాడో అర్థంకాని స్థితిలో ఎవరికి వారు తమ రాజకీయ భవిష్యత్ కోసం పావులు కదుపుతున్నారు. కర్నాటకలో కాంగ్రెస్ విజయం తర్వాత రాష్ట్రంలో రాజకీయపరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఈ విషయాన్ని బీఆర్ఎస్ కూడా గమనించింది. అందుకే ఇటీవలి బహిరంగ సభల్లో సీఎం కేసీఆర్ సహా మంత్రులంగా తమ వాగ్బాణాల్ని కాంగ్రెస్‌పైకి ఎక్కుపెడుతున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయ వేడి రగిలిస్తున్నారు. మరోవైపు సీఎం కేసీఆర్ కోవర్టులు బీజేపీ, కాంగ్రెస్‌లో ఉన్నారనీ, ఆయారాం, గయారాంల సమాచారంపై ఆయనకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతున్నదనే ప్రచారమూ జరుగుతున్నది. అదే సమయంలో పోలీస్ ఇంటలిజెన్స్ వ్యవస్థ కూడా రాజకీయ పరిణామాలు, నేతల కదలికలపై సీఎం కేసీఆర్‌కు ఎప్పటికప్పుడు రిపోర్టులు ఇస్తున్నట్టు సమాచారం.

ఢిల్లీ వెళ్తారా?

బీజేపీతో కొంత కాలంగా అంటీముట్టనట్టున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎంపీ రాజగోపాల్‌రెడ్డికి అధిష్టానం నుంచి పిలుపువచ్చినా, వారు వెళ్తారా...లేదా అనే చర్చ రాజకీయవర్గాల్లో జరుగుతున్నది. దానికితోడు ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావుతో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి భేటీ రాష్ట్రంలో మరింత రాజకీయ వేడిని రగిల్చింది. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కర్నాటక కాంగ్రెస్ చీఫ్, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో ప్రత్యేకంగా సమావేశం కావడం చర్చనీయాంశమైంది. రాజగోపాల్‌రెడ్డికి మార్గాన్ని సుగమం చేయడం కోసమేనంటూ ప్రచారం జరుగుతున్నది. ఈటల, రాజగోపాల్‌రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు రాగానే శుక్రవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అందుబాటులో ఉన్న నేతలతో బండి సంజయ్ సమావేశమవడం పలు ఊహాగానాలకు తావిస్తున్నది.

బీఆర్ఎస్ రివర్స్ ఆపరేషన్

రాష్ట్రంలో కాంగ్రెస్ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌తో అప్రమత్తమైన బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కూడా రివర్స్‌గేర్‌లో పని మొదలుపెట్టారు. రేవంత్‌రెడ్డిపై అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్‌లోని కీలక నేతలను బీఆర్ఎస్‌లోకి లాక్కోవడంపై దృష్టిపెట్టారు. అందులో భాగంగానే సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌పై ఫోకస్ పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఆ క్రమంలోనే ఉత్తమ్‌తో సీక్రెట్‌గా ఎమ్మెల్సీ వద్దిరాజు రవిచంద్ర సమాశమైనట్టు తెలిసింది. ఎమ్మెల్సీ కవితపై ఈడీ కేసులు స్తబ్దుగా మారడానికి బీఆర్ఎస్, బీజేపీ మధ్యలో కుదిరిన ఒప్పదమేనంటూ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే శుక్రవారం బహిరంగంగా విమర్శించారు. అమిత్‌షాతో కేటీఆర్ భేటీ కూడా అందులో భాగమేనంటూ కొనసాగింపును ఇచ్చారు. ఆయన ప్రశ్నలోనూ అర్థముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పోరుబాటలో కమ్యూనిస్టులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాలు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలనీ, ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కొట్లాడుతున్నాయి. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) పోరుబాట పట్టి ప్రజల్ని కదిలిస్తున్నది. రాజకీయ కొట్లాటను పక్కనబెట్టి ప్రజాసమస్యలపై దృష్టిసారించాలని పాలకులకు హితవు పలుకుతున్నది.

పటాన్‌చెరు వరకు మెట్రో పొడిగిస్తామనడం హాస్యాస్పదం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ నడిబొడ్డున మెట్రోరైల్‌కు దిక్కులేదు కానీ పటాన్‌చెరు వరకు పొడిగిస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ విమర్శించారు. ఓల్డ్ సిటీ (పాతబస్తీ) మీదుగా ఇమ్లిబన్ నుంచి ఫలక్‌నుమా కారిడార్ వరకు 5.5 కిలోమీటర్ల మెట్రో రైలును విస్తరించే ప్రణాళికను 2018లోనే అసెంబ్లీలో సీఎం ప్రకటించారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఆ పనులను ప్రారంభించలేదని పేర్కొన్నారు.

నిరుపేదలందరికీ 125 గజాల స్థలం ఇవ్వాలి

- తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలందరికీ వెంటనే 125 గజాల స్థలం ఇవ్వాలని తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం సాయంత్రం మంచిర్యాల జిల్లా చెన్నూరు నుంచి జగిత్యాల జిల్లాకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని వాణినగర్, ఎస్సారెస్పీ చిన్న కెనాల్ పక్కన వడ్డెరా, బుడగ జంగాలు గుడిసెలు వేసుకున్న ప్రాంతాన్ని నాయకులు సందర్శించారు. గుడిసెవాసులు, పేదలు బోనాలు, బతుకమ్మలతో యాత్ర బృందానికి స్వాగతం పలికారు. అనంతరం కోరుట్లలో నిర్వహించిన సభలో నేతలు మాట్లాడారు. జిగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణీనగర్, ఎస్సారెస్పీ చిన్న కెనాల్ పక్కన గుడిసెలు వేసుకుని కొన్నేండ్లుగా ఇక్కడే నివసిస్తున్న నిరుపేదలందరికీ 125గజాల ఇంటి స్థలం కేటాయించి, పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ పోరాటంలో భాగంగా కోరుట్లలో ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకోగా వారిపై పలుమార్లు దాడులు చేసి గుడిసెలను తొలగించి తగలబెట్టారని, 65 మందిపై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. పది మందిపై లాఠీచార్జి చేసి గాయపరిచినా పేదలందరూ జంకకుండా పోరాడుతున్నారని తెలిపారు.

ఆ సమయంలో వర్షం కురిసినా లెక్కచేయకుండా సభ సాగగా.. పేదలు సైతం కదల్లేదు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక నాయకులు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, వృత్తి సంఘాల రాష్ట్ర కో-కన్వీనర్ ఆశయ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ పాల్గొన్నారు.

చైనాతో ప్రచ్ఛన్న యుద్ధం పేరిట...మోడీతో జట్టు కట్టొద్దు

- అమెరికాకు హార్వర్డ్ వర్సిటీ ప్రొఫెసర్ జసనోఫ్ హెచ్చరిక

న్యూఢిల్లీ : భారత్‌లో ప్రజాస్వామ్యం, పౌర సమాజం, మైనారిటీల హక్కులపై గత 40 సంవత్సరాలుగా జరుగుతున్న దాడులు నరేంద్ర మోడీ పాలనలో పరాకాష్టకు చేరుకున్నాయని హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాయా జసనోఫ్ విమర్శించారు. చైనాతో ప్రచ్ఛన్న యుద్ధం సాగించే ఉద్దేశంతో మోడీతో జట్టు కట్టవద్దని ఆమె అమెరికా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. న్యూయార్క్ టైమ్స్ పత్రికలో ఆమె గురువారం ఓ వ్యాసం రాస్తూ

మోడీ నేతృత్వంలో భారతదేశం ఎలా ఉన్నదో అమెరికా పౌరులు తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. హిందూ జాతీయతావాద సిద్ధాంతం అనే పదునైన ఆయుధంతో ఆయన ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని వివరించారు. 'నరేంద్ర మోడీ కొందరికి గర్వకారణం కావచ్చు. కానీ చాలా మంది ఆయన నిరంకుశత్వాన్ని, అణచివేతను చవిచూశారు. ఇది మనందరికీ ఆందోళన కలిగిస్తోంది.

స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ, విద్యా స్వేచ్ఛ వంటి ప్రపంచ సూచికలలో భారత్ స్థానం పడిపోయింది. ప్రభుత్వాన్ని విమర్శించే వారిపై వేధింపులు పెరిగిపోతున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, మీడియా కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయి. స్వేచ్ఛను హరించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. పార్లమెంట్ సభ్యత్వం రద్దు ద్వారా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా కుట్ర పన్నారు. పాఠ్య పుస్తకాల నుండి ముస్లింల చరిత్రను తొలగించారు. కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యం తగ్గిపోయింది. సంపన్నులు మరింత సంపన్నులు అవుతున్నారు. ఆహారధాన్యాల ధరలు పెరిగాయి. ఆరోగ్య రంగంలో ప్రభుత్వ వ్యయం తగ్గింది. పర్యావరణ కార్యకర్తలపై ఉక్కుపాదం మోపుతున్నారు' అని జసనోఫ్ వివరించారు. భారత్‌లో మత విద్వేషాలు పెచ్చరిల్లాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గుజరాత్ అల్లర్లకు కారకుడంటూ మోడీకి అమెరికా వీసా నిరాకరించిందని గుర్తు చేశారు.

సీఎం సారూ...కనికరించండి

- బదిలీల కోసం స్పౌజ్ టీచర్ల నిరీక్షణ
- 18 నెలలుగా ఎదురుచూపులు
- 13 జిల్లాల్లో దంపతులకు తప్పని తిప్పలు
- ఖాళీలున్నా పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బదిలీల కోసం స్పౌజ్ టీచర్లు 18 నెలలుగా ఎదురుచూస్తున్నారు. 13 జిల్లాల్లోని ఉపాధ్యాయ దంపతులను ఒక చోటకు చేర్చాలని కోరుకుంటున్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి కేసీఆర్ సార్...కనికరించాలంటూ వేడుకుంటున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను 20 జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతుల బదిలీలను ప్రభుత్వం పూర్తి చేసింది. మిగతా 13 జిల్లాల బదిలీలను మాత్రం చేపట్టకుండా నిషేధం విధించింది. అయితే మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో గతేడాది జనవరిలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలోని 615 మందికి స్పౌజ్ బదిలీలను చేపట్టారు. ఇంకా 1,600 మందికి స్పౌజ్ కోటాలో ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉన్నది. వారంతా 2022, జనవరి నుంచి అంటే 18 నెలలుగా స్పౌజ్ బదిలీల కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. మంత్రులు, విద్యాశాఖ అధికారులను కలిసి విన్నవించినా, నిరసనలు, ముట్టడులు నిర్వహించినా బదిలీల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. స్పౌజ్ బదిలీలు జరగకపోవడంతో మహిళా ఉపాధ్యాయుల బాధలు వర్ణనాతీతం. విద్యాసంవత్సరం ప్రారంభమైంది. దీంతో బడులకు స్పౌజ్ టీచర్లు హాజరవుతున్నారు. అయితే భర్త ఒకచోట, భార్య మరో చోట.. పిల్లలు మరోచోట ఉంటున్నారు. ఇక స్పౌజ్ టీచర్లపైనే ఆధారపడి ఉన్న తల్లిదండ్రులు మరింత ఇబ్బంది పడుతున్నారు. కుటుంబాలకు దూరంగా ఉండలేక, ఉద్యోగం చేయలేక వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, భాషా పండితుల స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టాలని కోరుతున్నారు.

ఆ జిల్లాల్లో ఖాళీలున్నా...

అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతుల బదిలీలు చేపట్టేందుకు అవసరమైన ఖాళీలు అందుబాటులో ఉన్నాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ఉదాహరణకు సూర్యాపేట జిల్లాలో 21 మంది ఎస్జీటీలు స్పౌజ్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ జిల్లాలో సుమారు 300 ఎస్జీటీ పోస్టుల ఖాళీలు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో కేవలం ఐదుగురు మాత్రమే స్పౌజ్ బదిలీ కోసం దరఖాస్తు చేశారు. అక్కడ వందల సంఖ్యలో ఖాళీలున్నట్టు సమాచారం. స్పౌజ్ బదిలీలు జరగని మిగతా జిల్లాలైన వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజిగిరి, సిద్దిపేట, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మంచిర్యాల, ఖమ్మం జిల్లాల్లో కూడా దాదాపు ఇదే విధమైన పరిస్థితి నెలకొంది. ఆ 13 జిల్లాల్లోని స్పౌజ్ బదిలీలను చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ ఎందుకు ఆసక్తి చూపడం లేదంటూ ఉపాధ్యాయ దంపతులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఆ జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు చేపడితే ఉపాధ్యాయ ఖాళీలుండబోవని, నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

మలిదశ ఉద్యమానికి సిద్ధమవుతాం : వివేక్

మలిదశ ఉద్యమానికి సిద్ధమవుతామని స్పౌజ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు వివేక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. 13 జిల్లాల్లో స్పౌజ్ టీచర్లకు బదిలీలు చేపట్టి న్యాయం చేసేంత వరకు ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తామని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అలవెన్స్‌లు పెంపు

(మొదటిపేజీ తరువాయి)


30 శాతం.

- బదిలీపై వెళ్లే ఉద్యోగులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ 30శాతం.
- సెలవురోజుల్లో పనిచేసే లిఫ్ట్ ఆపరేటర్లు, డ్రైవర్లకు అదనంగా రూ. 150 చెల్లింపు.
- షెడ్యూల్ ఏరియాలో పనిచేసే ఉద్యోగులకు స్పెషల్ కాంపన్సేటరీ అలవెన్స్ 30శాతం.
- వికలాంగ ఉద్యోగులకు ఇచ్చే కన్వీనియన్స్ అలవెన్స్ రూ. 2వేల నుంచి రూ. 3వేలకు పెంపు.
- ఇండ్లు నిర్మించుకునే ఉద్యోగులకు ఇచ్చే అడ్వాన్స్ పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ. 30లక్షలకు పెంచుతూ నిర్ణయం.
- కారు కొనుగోలు చేసే వారికి ఇచ్చే అడ్వాన్స్ పరిమితిని రూ. 6 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంపు.
- మోటార్ సైకిల్ కొనుగోలు చేసే వారికి ఇచ్చే అడ్వాన్స్ రూ.80వేల నుంచి లక్ష రూపాయలకు పెంచుతూ నిర్ణయం.
- ఉద్యోగుల పిల్లల వివాహాలకు సంబంధించి.. కుమార్తె పెళ్లికి ఇచ్చే అడ్వాన్స్ రూ. లక్ష నుంచి రూ. 4 లక్షలకు పెంపు.
- కుమారుడి పెండ్లికి ఇచ్చే అడ్వాన్స్ రూ. 75వేల నుంచి రూ. 3 లక్షలకు పెరిగింది.
- స్టేట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ ఉద్యోగులకు ఇచ్చే ఇన్సెంటివ్ 30శాతం.
- గ్రేహౌండ్స్, ఇంటిలిజెన్స్, ట్రాఫిక్, సీఐడీ, ఆక్టోపస్, యాంటీ నక్సలైట్ స్క్వాడ్ విభాగాల్లో పని చేసే పోలీసులకు ఇచ్చే స్పెషల్ అలవెన్స్‌ను 2020 పే స్కేల్ ప్రకారం వర్తింపజేయాలని నిర్ణయం.
- పెన్షనర్లు మరణిస్తే అందించే తక్షణ సాయం రూ. 20 వేల నుంచి రూ. 30వేలకు పెంపు.
- ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తించే అన్ని విభాగాల్లోని ఉద్యోగులకు అదనంగా 15శాతం స్పెషల్ అలవెన్స్ ఇవ్వాలని నిర్ణయించింది. కొద్దిరోజుల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం 2.73 శాతం డీఏ ప్రకటించింది. తాజాగా మరింత ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. విభాగాల వారీగా ఆదేశాలు జారీ చేసింది.

వేగంగా విస్తరిస్తున్న నైరుతి

- పలు జిల్లాలకు భారీ వర్ష సూచన
- 401 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీంతో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం రాష్ట్రంలో 401 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. వచ్చే రెండు,మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కొన్ని ప్రాంతాల్లో, మోస్తరు వానలు ఎక్కువచోట్ల పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఆ జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సిద్దిపేట, సూర్యాపేట, రంగారెడ్డి, యాదాద్రిభువనగిరి, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలున్నాయి. శుక్రవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 401 ప్రాంతాల్లో వర్షం పడింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో అత్యధికంగా 8.10 సెంటీమీటర్ల వాన పడింది. 93 ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

బీజేపీని గద్దెదించాలి

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం బీహార్ రాజధాని పాట్నాలో 17 రాజకీయ పార్టీలు సమావేశం అయ్యాయి. దాదాపు నాలుగు గంటలపాటు జరిగిన సమావేశానికి బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధ్యక్షత వహించారు. ప్రతిపక్ష పార్టీలు మరింత సమన్వయంతో ముందుకు సాగడానికి భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించడానికి,తగిన రాజకీయ వ్యూహం కోసం.. జులై రెండో వారంలో హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

సిద్ధాంతాల మధ్య పోరు ఇది : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

ఇది సిద్ధాంతాల మధ్య పోరు.. "మాకు కొన్ని విభేదాలు ఉండవచ్చు, అయితే ఒక లక్ష్యం కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాం. మా భావజాలాన్ని కాపాడుకోవడానికి కృషి చేస్తాం". నిజానికి, తమలో విభేదాలు ఉన్నప్పటికీ కలిసికట్టుగా పోరాడాలని నిర్ణయించుకున్నాం. సిద్ధాంతాలపై పరస్పరం చర్చించుకుని వాటిని పరిరక్షించుకునేందుకు కృషి చేస్తాం.. దేశ పునాదులపై బీజేపీ దాడి చేస్తోంది. ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడితేనే దేశాన్ని రక్షించుకోవచ్చు. దేశం కోసం త్యాగాలు చేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉన్నది. ఢిల్లీ ఆర్డినెన్స్ వివాదంపై ఆప్‌తో విభేదాలు లేకుండా చూసేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉంది.

యునైటెడ్ ఫ్రంట్ ప్రజల ఆశీర్వాదం :ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్

"ఇక్కడ (పాట్నా) ప్రారంభమైన జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) ఉద్యమం మాదిరిగానే, మా ఐక్య ఫ్రంట్‌కు ప్రజల ఆశీస్సులు లభిస్తాయి".

కలిసే ఉన్నాం..కలిసికట్టుగా పోటీ చేస్తాం: మమతా బెనర్జీ

ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా ఉన్నాయని, కలిసికట్టుగానే ఎన్నికల్లో పోరాడతాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. పాట్నాలో ఏదైతే ప్రారంభమైనా ప్రజా ఉద్యమం రూపుదిద్దుకుంటుందని పాట్నాలో తొలి సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. "మేమంతా ఐక్యంగా ఉన్నాం. బిజెపికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుతాం" అని అన్నారు. "బీజేపీ చరిత్రను మార్చాలని కోరుకుంటుంది. మేము చరిత్రను రక్షించేలా చూస్తాం " అని అన్నారు. తాము ప్రతిపక్ష పార్టీలమేనని, దేశభక్తి ఉన్న దేశ పౌరులమని, 'భారత్ మాతను' ప్రేమించే వారిమని ఆమె నొక్కి చెప్పారు. ఫాసిస్ట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం వినిపించడమే తమ లక్ష్యమని చెప్పారు.

జమ్మూకాశ్మీర్‌కు చేరని ప్రజాస్వామ్యం: ఒమర్ అబ్దుల్లా

అతలాకుతలమైన ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు, తిరిగి ప్రజాస్వామ్యాన్ని పాదుకొలిపేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ పాట్నాలో సమావేశమైనట్టు నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ప్రజాస్వామ్యం హత్యకు గురైన దేశంలోనే తాను, మెహబూబా ముఫ్తీ ఉన్నామని అన్నారు.

ప్రజాస్వామ్యంపై అమెరికాలో గురువారంనాడు చర్చ లు జరిగాయని, జమ్మూకశ్మీర్‌కు ప్రజాస్వామ్యం ఎందుకు చేరువకాలేదని ఒమర్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంపై దాడి జరగడం జమ్ము కాశ్మీర్‌లో ప్రారంభమైందని, ఇప్పుడు దేశవ్యాప్తంగా జరుగుతోందని పీడీపీ అధినేత మెహబూబా ముఫ్తీ విమర్శించారు. మన రాజ్యాంగం, లౌకికవాదం, ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతున్న తీరు జమ్మూ కాశ్మీర్‌లో మొదలైంద న్నారు. ఇప్పుడు ఇది దేశవ్యాప్తంగా జరుగుతోందని పేర్కొన్నారు.

దేశ సమగ్రతను కాపాడేందుకు మేము కలిసి వచ్చాం: ఉద్ధవ్ థాకరే

మాకు భిన్నమైన సిద్ధాంతాలు ఉన్నాయని, కానీ దేశ వైవిధ్యం, సమగ్రతను కాపాడటానికి తాము కలిసి వచ్చామని మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ థాకరే అన్నారు.

ఈ సమావేశంలో లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్, మజోన్ కుమార్ ఝా (ఆర్‌జేడీ), తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, టిఆర్ బాలు (డీఎంకె), జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ (జేఎంఎం), ఢిల్లీ, పంజాబ్ సిఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్, రాజ్యసభ ఎంపీలు సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా (ఆప్), ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), కెసి వేణుగోపాల్ (కాంగ్రెస్), సుప్రియా సులే, ప్రఫుల్ పటేల్ (ఎన్‌సీపీ), ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్ (శివసేన ఉద్ధవ్ ఠాక్రే), అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్, ఫిర్హాద్ హకీమ్ (టీఎంసీ), లలన్ సింగ్ (జేడీయూ), దీపాంకర్ భట్టాచార్య (సీపీఐ(ఎంఎల్)) పాల్గొన్నారు.

లౌకిక ప్రజాస్వామ్య నిర్మాణమే లక్ష్యం :ఏచూరి

(మొదటిపేజీ తరువాయి)

వంటి ప్రజలను ప్రభావితం చేసే సమస్యలపై ప్రతిపక్ష పార్టీలు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనను నిర్వహించనున్నాయి.. బీజేపీకి వ్యతిరేకంగా ఓట్లు చీలిపోకుండా ఉండేందుకు రాష్ట్రాల్లో చర్చలు జరగనున్నాయి.

కలిసి పనిచేద్దాం...: నితీశ్

(మొదటిపేజీ తరువాయి)

అంగీకరించారు" . తాము జాతీయ ప్రయోజనాల కోసం పని చేస్తున్నామని, దేశ చరిత్రను మార్చడానికి, జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోంది.

లక్ష సాయం దరఖాస్తుల పరిశీలన

- ప్రతీనెల 15న బీసీ కులవత్తుల వారికి లక్ష సాయం
- సాయం కోసం 5,28,862 అప్లికేషన్లు : మంత్రి గంగుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వెనుకబడిన వర్గాలకు రూ.లక్ష సహాయం కోసం క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల పరిశీలన ప్రారంభమయిందని మంత్రి గంగుల కమలాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 5,28,862 దరఖాస్తులు వచ్చాయనీ, వర్గాల వారిగా బీసీ ఏ 2,66,001 మంది, బీసీ బీ 1,85,136, బీసీ డి 65,310, ఎంబీసీలు 12,415 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. దరఖాస్తుల క్రమసంఖ్య ప్రకారం పరిశీలన కొనసాగుతుందని వివరించారు. ప్రతీ నెల ఐదో తారీఖు వరకు పరిశీలన పూర్తైన వారికి అదేనెల 15న స్థానిక శాసనసభ్యుల చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని అందజేస్తామని మంత్రి గంగుల తెలిపారు.

భూదాన పత్రాలు పొందిన పేదలందరికీ పట్టాలివ్వాలి

- సీపీఐ(ఎంఎల్)ఆర్ఐ, ఓపీడీఆర్, ఏఐఆర్‌డబ్ల్యూఓ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భూదాన పత్రాలు పొందిన పేదలందరికీ వెంటనే పట్టాలివ్వాలని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది టి.లక్ష్మీదేవి, ఏఐఆర్‌డబ్ల్యూ రాష్ట్ర కమిటీ సభ్యులు బీవీ.సుధారాణి, సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం, రాష్ట్ర కమిటీ సభ్యులు పూర్ణచందర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మెన్ గున్నా రాజేందర్‌రెడ్డి తారామంతి పేటలోని 235, 236, 615, 616, 617 తదితర సర్వే నెంబర్లలో 2014 మార్చి, ఏప్రిల్ నెలల్లో కుటుంబానికీ 100 గజాల చొప్పున ఇంటి స్థలాలను ఇచ్చి ప్రొసీడింగ్స్ ను జారీ చేసారని గుర్తుచేశారు. ఆ ప్రొసీడింగ్ ఆర్డర్లు పొందిన పేదలు తాము ఇండ్లు కట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని హయత్‌నగర్ ఎస్టీఓ కార్యాలయంలో తలా రూ.3200 జమచేశారని తెలిపారు. అప్పటి జాయింట్ కలెక్టర్ కూడా పేదలకు డీ ఫాం పట్టాలివ్వాలని కలెక్టర్‌కు లేఖ రాశారని గుర్తుచేశారు. కలెక్టర్ ఇవ్వకుండా తాత్సారం చేశారని ఆరోపించారు. సీఎం కూతరు కవిత, మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, తదితరులకు వినతిపత్రాలిచ్చినా, ధర్నాచౌక్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేసినా రాష్ట్ర సర్కారు పట్టడం లేదని వాపోయారు. ఆ పేదలకు డీ ఫాం పట్టాలివ్వాలని హైకోర్టు చెప్పినా రాష్ట్ర సర్కారు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఊహాజనిత కథనాలను ప్రసారం చేస్తున్నారు..

వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తనకూ తెలంగాణ ప్రజలకు మధ్య దూరం పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఊహాజ నిత కథనాలను ప్రసారం చేస్తూ ఇబ్బంది పెడుతు న్నారని ఆమె వాపోయారు. తన చివరి శ్వాస వరకు తెలంగాణ బిడ్డగానే ఉంటానని తెలిపారు. ఇక్కడి ప్రజల సమస్యలపై పోరాడుతూనే ఉంటానని పేర్కొన్నారు. తనపై వార్తలు రాసే వారు..కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలో జరిగిన వైఫల్యాల గురించి కూడా రాయాలని సూచించారు.

అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రక్షణ శాఖ భూములివ్వండి

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఏరియాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలి

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు మంత్రి కేటీఆర్ వినతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వివిధ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రక్షణ శాఖ భూములను త్వరగా బదిలీ చేయాలని రాష్ట్ర మున్సిపల్,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీ రామారావు కోరారు. శుక్రవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ (ఎస్‌సీబీ) సివిల్ ఏరియాల తొలగింపును వేగవంతం చేయాలని, ఎస్‌సీబీ ఏరియాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టులు చేపట్టనున్నట్టు తెలిపారు. మెహదీపట్నం వద్ద స్కైవాక్ అభివృద్ధి, హైదరాబాద్-కరీంనగర్-రామగుండం రోడ్ లో ప్యారడైజ్ జంక్షన్ (జింఖానా గ్రౌండ్స్ దగ్గర) నుంచి ఓఆర్ఆర్ జంక్షన్ వరకు ఎలివేటెడ్ కారిడార్ అభివృద్ధి, ఎన్‌హెచ్-44లో కండ్లకోయ సమీపంలోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఓఆర్ఆర్

జంక్షన్ వరకు ఎలివేటెడ్ కారిడార్ అభివృద్ధి, హెచ్‌ఆర్‌డీసీఎల్ ప్రాజెక్ట్ కింద లింక్ రోడ్లు, కొన్ని రోడ్ల విస్తరణ పనులు వంటి ప్రాజెక్టుల కోసం భూమి బదిలీ చేయాలని కోరారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో మంత్రి కేటీఆర్ వెంట ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, జి.రంజిత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి చైర్మెన్ బోయినపల్లి వినోద్, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ ఉన్నారు.

తెలంగాణ అభివృద్ధి చాటాలే...

తెలంగాణ అభివృద్ధిని ప్రపంచానికి చాటేలా తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నామని మంత్రి కేటీఆర్ చెప్పారు. అమరులకు ..అభివృద్ధే అసలైన నివాళి అని తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఐటీ, ఏరో స్పేస్, డిఫెన్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ ఇలా అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతితో ముందుకు పోతున్న హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం కేంద్రం సహకరించాలని అనేకసార్లు కేంద్ర ప్రభుత్వానికి



విజ్ఞప్తి చేశామన్నారు. తొమ్మిదేండ్లలో హైదరాబాద్ నగరానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా వచ్చింది గుండు సున్నా అని విమర్శించారు.

హైదరాబాద్ లాంటి నగరంలో స్కైవేల నిర్మాణం కోసం అనేక సార్లు విజ్ఞప్తి చేశామని, రక్షణ శాఖ మంత్రులు మారుతున్నా, కేంద్ర ప్రభుత్వ వైఖరి మారలేదని దుయ్యబట్టారు. స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రధాని మోడీని కలిసి విజ్ఞప్తి చేసినా ఎలాంటి స్పందన లేదని, జూబ్లీ బస్టాండ్ నుంచి రాజీవ్ రహదారి వరకు ఒక స్కై వే నిర్మాణం, పారడైజ్ చౌరస్తా నుంచి మేడ్చల్ ఓఆర్ఆర్ వరకు మరో స్కై వే నిర్మాణం కోసం రక్షణ శాఖ భూములు ఇవ్వాలని అనేకసార్లు విజ్ఞప్తి చేశామని, కానీ ఇవ్వలేదని అన్నారు. ఇప్పుడు మరోసారి ఈ విషయాన్ని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

రక్షణ శాఖ నుంచి రాజీవ్ రహదారి వైపు స్కై వేల నిర్మాణం కోసం 96 ఎకరాల భూమి, మేడ్చల్ వైపు మరో 56 ఎకరాల భూమి ఇస్తే అంతే విలువ కలిగిన భూమిని ఇస్తామని చెప్పినా స్పందన లేదని విమర్శించారు. స్కై వేల మాదిరే స్కై వాక్‌ల నిర్మాణాన్ని కూడా చేస్తున్నామని, ఉప్పల్‌లో చేపట్టిన స్కై వాక్ పూర్తయిందని, కానీ రక్షణ శాఖ పరిమితుల వలన మెహదీపట్నంలో ప్రారంభించిన ప్రాజెక్టు ఆగిపోయిందని అన్నారు. గోల్కొండ, ఇబ్రహీం బాగ్ లింకు రోడ్ల కోసం అవసరమైన రక్షణ భూమిని కూడా కోరామని, కంటోన్మెంట్లో నిరుపయోగంగా ఉన్న భూములను జీహెచ్‌ఎంసీకి ఇస్తే అక్కడ ప్రజలకు అవసరమైన ఆస్పత్రులు, కమ్యూనిటీ హాళ్లను నిర్మాణం చేస్తామని అన్నారు. తమ వైపు నుంచి ప్రయత్న లోపం లేకుండా గత పది సంవత్సరాలుగా ఈ అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నామని, ఈసారి అయినా సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నామని అన్నారు.

నేడు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరితో భేటీ

నేడు (శనివారం) పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిని కలుస్తామని, లక్డీకపూల్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు మెట్రో రైల్ విస్తరణ, నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు మెట్రో కోసం విజ్ఞప్తి చేస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే అనేకసార్లు ఈ అంశంలో డీపీఆర్‌లు ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద ఎంఎంటీఎస్ కోసం అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించినా కేంద్రం నుంచి స్పందన లేదని విమర్శించారు. ఎస్ఆర్డీపీ కింద అనేక కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసామని, కానీ రసూల్ పురా వద్ద మూడు, నాలుగు ఎకరాల హోం శాఖ భూమి అందిస్తే అక్కడ ఎస్ఆర్డీపీ ప్రాజెక్టు పూర్తి అవుతుందని అన్నారు. ఈ విషయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని, ఈ విషయంలో అమిత్ షాను కలిసేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రం కలిసి రావాలని కోరారు. పటాన్‌చెరువు నుంచి హయత్ నగర్ వరకు మెట్రో విస్తరణకు కూడా కేంద్రం కలిసి రావాలన్నారు.

కేంద్రం సహకరించట్లే....

తొమ్మిదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం తెలంగాణకు సహకరించలేదని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న ద్రోహాన్ని కొనసాగిస్తుందని విమర్శించారు. ఒకవేళ కేంద్రం తన వైఖరి మార్చుకోకుంటే ప్రజల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని హెచ్చరించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డిది అమాయకత్వమో, అజ్ఞానమో తెల్వదని, కిషన్ రెడ్డి ఇచ్చిన ప్రజెంటేషన్‌లో ప్రజలకు ఇచ్చిన అప్పును కూడా కేంద్రం ఇచ్చిన నిధులుగా చూపించారని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో సుమారు 10 చిన్న పట్టణాలకు మెట్రోలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, హైదరాబాద్‌లో ఎందుకు మెట్రోకి సహకరించాలడం లేదో తెలపాలని అన్నారు. హైదరాబాద్‌లో వరదలు వస్తే సహకరిం చని కేంద్రం, గుజరాత్, ఇతర బీజేపీ రాష్ట్రాల్లో వరదలు వస్తే ఎందుకు నిధులిచ్చిందో కిషన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. నిస్సహాయంగా ఉన్న కిషన్ రెడ్డిని కంటే పెద్ద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తాము ఇవ్వగలమని అన్నారు.

ప్రధానమంత్రి మోడీకి అవకాశం ఇస్తే ఢిల్లీని కూడా తీసుకెళ్లి గుజరాత్‌లో పెడతారని విమర్శించారు. 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో దేశాన్ని అభివృద్ధి చేయడంలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ఘోరంగా విఫలం అయ్యాయని దుయ్యబట్టారు. ఇప్పటికీ విద్యుత్, నీటి సరఫరాలేని గ్రామాలు కూడా దేశంలో ఉన్నాయంటే వీటి బాధ్యత పూర్తిగా ఈ రెండు జాతీయ పార్టీలదే అన్నారు. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా ప్రజల్లో ఐకమత్యం రావాల్సిన అవసరం ఉందని, అంశాల వారీగా ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసే ప్రయత్నాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని, అభివృద్ధి నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలనుకుంటున్నామన్నారు. నిజామాబాద్, కరీంనగర్ పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కైన విషయం అందరికీ తెలుసని, ఎవరు ఎవరితో కుమక్కు అవుతున్నారో ప్రజలకు తెలుసని అన్నారు.

అత్యంత బలహీనమైన ప్రధాని మోడీ

దేశంలో ఇప్పటిదాకా పనిచేసిన ప్రధాన మంత్రుల్లోకెల్లా అత్యంత బలహీనమైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని, మోడీ బలహీనతలను దేశంలో అందరికంటే ఎక్కువగా తమ పార్టీయే విమర్శించిందని అన్నారు. సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఢిల్లీలో తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో నిలబడతామని, సమైక్య స్ఫూర్తికి వ్యతిరేకమైన ఈ ఆర్డినెన్సును కాంగ్రెస్ ఏ విధంగా సపోర్ట్ చేస్తుందో వాళ్లే చెప్పాలని అన్నారు.

ఆ రెండు పార్టీలవి పగటి కలలే..

- బీజేపీ, కాంగ్రెస్‌లకు పరాభవం తప్పదు : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో గెలవటం ద్వారా రాష్ట్రంలో అధికారంలోకి వస్తామంటూ బీజేపీ, కాంగ్రెస్‌లు వేటికవే పగటి కలలు కంటున్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఎద్దేవా చేశారు. ఆ రెండు పార్టీలకూ అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం తప్పదని ఆయన హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ భూపాలపల్లి పర్యటన సందర్భంగా తమ ప్రభుత్వంపైన, సీఎం కేసీఆర్‌పైనా ఇష్టానుసారంగా నోరు పారేసుకున్నారని విమర్శించారు. సింగరేణిని ప్రయివేటీకరించకుండా చూస్తామంటూ ఆయన ప్రగల్భాలు పలికారని అన్నారు. వాస్తవానికి ఆ సంస్థకు సంబంధించిన నాలుగు బ్లాకులను బహిరంగ వేలం ద్వారా ప్రయివేటుకు అప్పగించేందుకు కుట్ర పన్నింది ఎవరంటూ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వమే అందుకు పూనుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ వాస్తవాన్ని మరిచిన బండి సంజయ్... నిస్సిగ్గుగా తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి తెలంగాణ ప్రజలను అన్ని విషయాల్లోనూ మోసం చేస్తున్నది బీజేపీ, ప్రధాని మోడీయేనని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీల్లో ఏ ఒక్కదాన్నైనా అమలు చేశారా..? అని ప్రశ్నించారు. మరోవైపు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటున్న తరుణంలో కాంగ్రెస్ నేతలు... సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయటం అత్యంత శోచనీయమని అన్నారు. మీడియాలో ప్రచారం కోసమే ఇలాంటి హడావుడి చేస్తున్నారని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి వంద సీట్లు ఖాయమంటూ గండ్ర ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రంతో చర్చించేందుకే మంత్రి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారని ఆయన చెప్పారు. ఇది పూర్తిగా ప్రభుత్వ అధికారిక కార్యక్రమమని తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ దంపతులు... బీఆర్‌ఎస్‌లో చేరబోతున్నారనే వార్తలపై అడగ్గా... 'దాని గురించి తనకేమీ తెలియదని' సమాధానమిచ్చారు.

రేవంత్‌రెడ్డివి మరుగుజ్జు మాటలు

- అవినీతి అరోపణలపై మంత్రి వేముల ఫైర్

నవతెలంగాణ-హైదరాబాద్

అమరవీరు జ్యోతి నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలు మతిలేని మరగుజ్జు మాటలుగా రాష్ట్ర రోడ్లు భవనాలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కొట్టిపారేశారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటే ఓర్వలేని కుంచిత మనస్తత్వంతో రేవంత్‌ఉన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఎంతో గొప్పగా మనసు పెట్టి అమరుల స్థూపాన్ని నిర్మించిందనీ గుర్తు చేశారు. ఒటు రాజకీయాల కోసం కాదని వ్యాఖ్యానించారు. ఒకసారి రేవంత్‌రెడ్డి ఆరు అంతస్థుల అమరజ్యోతిపి సందర్శించి అక్కడ ఏర్పాట్లు చూస్తే నిర్మాణం గొప్పతనం అర్థమవుతుందని సూచించారు. తెలంగాణ అమర వీరుల త్యాగాల గురించి మాట్లాడే నైతికహక్కు కాంగ్రెస్‌కు లేదని తేల్చి చెప్పారు. అసలు అమరుల బలిదానాలు జరిగిందే కాంగ్రెస్ పార్టీ చేసిన జాప్యం, గందరగోళ ప్రకటనల వల్ల అని గర్తుచేశారు. 2004లో టీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకొని..కామన్ మినిమం ప్రోగ్రాం(సీఎంపీ)లో పెట్టి మాట తప్పారని చెప్పారు. 2009 డిసెంబర్ తొమ్మిదిన ప్రకటన చేసి వెనక్కు తీసుకున్నారు. అందుకే బలిదానాలు జరిగాయని చెప్పారు. కేసిఆర్, కెటిఆర్‌ను వ్యక్తిగతంగా తిడితే వార్తల్లో ఉంటాననే ఆరాటంతో రేవంత్ పసలేని ఆరోపణలు చేస్తున్నాడనీ, బ్లాక్ మెయిలర్‌తో నీతులు చెప్పించుకోవాల్సిన ఖర్మ మాకు పట్టలేదని మంత్రి వేముల ఘాటుగా వ్యాఖ్యానించారు. చంద్రబాబు మెప్పు కోసం తెలంగాణ ఉద్యమకారులపైకి పిట్టలదొరలా తుపాకీతో వెళ్లిన నీవా అమరవీరుల గురించి మాట్లాడేది ? నీవు అమరవీరుల గురించి మాట్లాడితే వారి ఆత్మలు ఘోషిస్తాయి. అమరుల త్యాగాల గురించి అసలు రేవంత్‌రెడ్డికి ఏం తెలుసని మాట్లాడుతున్నడంటూ నిలదీశారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బ్రోకర్లను అడ్డం పెట్టుకుని రాజకీయాలు

- ఈటలపై ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఫైర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కొంతమంది బ్రోకర్లను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. తాను ఒక యూట్యూబర్‌ను కిడ్నాప్ చేసి, కొట్టినట్టు కథలు అల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. తాను కిడ్నాప్ చేశానని నిరూపిస్తే... కమలాపూర్‌లో ముక్కు నేలకు రాస్తానని అన్నారు. ఒకవేళ అది అవాస్తవమని తేలితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా..? అని ఈటలను ప్రశ్నించారు. ఇందుకు సిద్ధమేనా అంటూ సవాల్ విసిరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ బండ శ్రీనివాస్‌తో కలిసి కౌశిక్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈటలకు వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కదని అన్నారు. అందువల్లే ఆయన అసహనంతో ఏదేదో మాట్లాడుతున్నారనీ, సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లను బదనాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్ అనే ముసుగులో రాజకీయ కుట్రలు చేస్తున్న బీసీ దొర ఈటల అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

కొత్తగా 17బీసీ డిగ్రీ గురుకులాలు

- మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా 17 నూతన బీసీ డిగ్రీ గురుకులాలు ప్రారంభించటానికి ప్రభుత్వం జీవో జారీ చేసిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణలో పూర్వం కేవలం 19 బీసీ గురుకులాలు అరకొర వసతులతో ఉండేవనీ, సీఎం కేసీఆర్ సంకల్పంతో వాటి సంఖ్యను 327కు పెంచుకున్నామని తెలిపారు. విద్య ద్వారా వెనుకబడిన వర్గాల జీవితాల్లో సమూల మార్పులు వస్తాయని పేర్కొన్నారు. బీసీ గురుకులాల ద్వారా రాష్ట్రంలో దాదాపు 2లక్షల మంది వెనుకబడిన విద్యార్థులు ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యాసంవత్సరంలో జోగులాంబ గద్వాల్, నారాయణ్ పేట్, నాగర్ కర్నూల్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, అదిలాబాద్, కొమరంభీం అసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బీసీ గురుకులాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు.

లోతైన అవగాహన ఉంటేనే రాణిస్తారు

- అధికార ప్రతినిధుల సమావేశంలో మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిశిత పరిశీలన, లోతైన అవగాహన ఉంటేనే రాజకీయాల్లో రాణిస్తారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కొత్తగా నియమితులైన అధికార ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు గాంధీభవన్‌లో అధికార ప్రతినిధులు హాజరయ్యేలా పని విభజన చేయాలన్నారు. జిల్లాల వారీగా అధికార ప్రతినిధులకు బాధ్యతలు అప్పగించాలని కోరారు. రోజువారీ అంశాలపై అధికార ప్రతినిధులు తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కీలక అంశాల్లో పార్టీ విధానం తెలుసుకున్నాకే స్పందించాలని సూచించారు. ఎన్నికల సమయంలో అత్యంత జాగ్రత్తగా చురుకుగా వ్యవహరించాలని దిశా,నిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలపై వెంట వెంటనే స్పందించాలని సూచన.

ఎన్నికల నేపథ్యంలో ఆర్‌అండ్‌బీకి సవాళ్లు

పెరుగుతున్న పని ఒత్తిడి

- నెలరోజుల్లో నిమ్స్‌కు టెండర్లు
- కలెక్టరేట్లు, క్యాంపు ఆఫీసుల నిర్మాణంలో బిజీబిజీ
- షెడ్యూల్ వచ్చేలోగా పనులు పూర్తి చేసే యత్నం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్


వచ్చే సాధారణ ఎన్నికలు రోడ్లు, భవనాల శాఖను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నాయి. గులాబీ సర్కారు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఆర్ అండ్ బీ అధికారులపై పనిఒత్తిడి తీవ్రంగా పెరుగుతున్నది. సెప్టెంబరులో దాదాపుగా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రానుందనే ప్రచారం జరుగుతున్నది. రాజకీయ పార్టీలు సైతం ఆ మేరకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. అధికార పార్టీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేసుకునే పనిలో ఉండగా, ప్రతిపక్షాలు ప్రజాసమస్యలపై పోరాటపథంలో ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించింది. సమీక్షలు జరుగుతున్నాయి. ఓటర్ల జాబితాలు, ఇతర అంశాలపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, కలెక్టర్లతో మాట్లాడుతున్న విషయం విధితమే. ఈనేపథ్యంలో రోడ్లు, భవనాల శాఖ యుద్ధ ప్రాతిపదికన ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టులను పూర్తిచేసే ప్రయత్నాల్లో ఉంది. సీఎం కేసీఆర్‌తోపాటు ఆయా జిల్లాల్లోని పనులకు సంబంధించి మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ స్థాయి నేతలు అధికారులపై ఆయా పనులు పూర్తి చేయాలంటూ పదే పదే కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలు పనులకు సంబంధించి శంకుస్థాపనలు చేసింది.అవి ఎన్నికల్లోపు పూర్తయ్యేలా చూడటం, మిగతావి పనులు జరుగుతున్నాయనే భావన ప్రజల్లో కలిగేలా చర్యలు తీసుకుంటూ ముందుకు పోతున్నది. ఐదు ఆస్పత్రులు, ఎనిమిది మెడికల్ కాలేజీలు, మూడు టిమ్స్‌తోపాటు వరంగల్ ఆస్పత్రులకు ఇప్పటికే సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. మూడు టిమ్స్ ఆస్పత్రులకు రూ.2700 కోట్లతో ప్రణాళిక రూపొందించారు. వరంగల్ దవాఖానాకు రూ. 1100 కోట్లు కేటాయించారు. అలాగే తాజాగా రెండు వారాల క్రితం నిమ్స్‌లో 2000 పడకలతో కొత్త బ్లాక్‌కు భూమిపూజ చేసిన విషయం విదితమే. దీనికి రూ.1575 కోట్లు ప్రతిపాదించారు. 25 కలెక్టరేట్లు పూర్తయ్యాయి. మరో నాలుగు ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నాయి. సూర్యాపేట, మెదక్, భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల్లో సెప్టెంబరులో కలెక్టరేట్లను పూర్తిచేసి ప్రజలకు పరిపాలనను అందుబాటులో తేనున్నారు. అలాగే ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు ఇప్పటికే 100 వరకు నిర్మించారు. మరికొన్ని ఉన్నాయి. నగరంలోని 15 నియోజకవర్గాల్లో భవనాల నిర్మాణానికి స్థలాలు దొరకక ఇబ్బందులు ఎదురవుతున్నట్టు సమాచారం. ఇకపోతే పాతబస్తీలో మాకు క్యాంపు ఆఫీసులు అవసరం లేదని ఎంఐఎం ఎమ్మెల్యేలు చెబుతున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌లో హెచ్‌ఓడీల కోసం ట్విన్ టవర్స్ కడతామని ఇటీవల సీఎం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లోగా ఆ ఆలోచన అమలయ్యే అవకాశాలు కనిపించడం లేదని ఉన్నతాధికారులు అంటున్నారు. కేసీఆర్ సర్కారు ఏర్పడిన మొదటి టర్మ్‌లో మిశ్రమాభివృద్ధి జరిగిందనీ, రెండో విడతతో మాత్రం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల జోరు పెరిగిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త సచివాలయాన్ని నిర్మించి తాను అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసుకుంది. అలాగే అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపం ఇలా అనేక రకాల నిర్మాణాలను వేగంగా పూర్తిచేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రయత్నంలో ఉంది. ఆయా నిర్మాణాల్లో మెఘా, ఎల్‌అండ్‌టీ, కేపీసీ, షాపూర్జీ-పల్లోంజీ, డీఈసీ, తదితర సంస్థలు కాంట్రాక్టులు దక్కించుకున్నాయి. భారీ ఆస్పత్రుల నిర్మాణం ద్వారా వైద్యసదుపాయాలను ప్రజల దగ్గరకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతున్నది. జులై 20వ తేదీ వరకు నిమ్స్ కొత్త బ్లాక్‌కు టెండర్లను ఆహ్వానించారు. భారీగా ప్రాజెక్టులు చేపడుతున్న తరుణంలో నిధులు సైతం విరివిగా అవసరమవు తాయి. అలాగే పాత బకాయిలు సైతం రూ. 1000 కోట్ల వరకు ఉన్న సంగతి తెలిసిందే. ఒకవైపు పనుల ఒత్తిడి, మరో వైపు పాత బకాయిలు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు, వర్కింగ్ ఏజెన్సీల నుంచి వస్తున్న విజ్ఞప్తులతో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని అంటున్న అధికారులు లేకపోలేదు.

ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణకు లైన్‌క్లియర్

- బడ్జెట్‌లో ఇచ్చింది రూ. 500 కోట్లే
- గతేడాదీ చేసిన ఖర్చు రూ. 600 కోట్లు
- త్వరితగతిన పూర్తయ్యేనా..?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం చుట్టూతా నిర్మించతలపెట్టిన ప్రాంతీయ వలయ రహదారి(ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణంలో కదలిక రానుంది. భూసేకరణ ప్రక్రియకు ఇప్పటికే లైన్‌క్లియర్ అయింది. కాగా పూర్తిచేసేందుకు మాత్రం భారీ నిధులు అవసరం ఉన్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాట ప్రారంభించాయి. నిధులు ఒకేసారి ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నాయి. ఆర్‌ఆర్‌ఆర్‌ను రెండు భాగాలుగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దక్షిణ భాగానికి సంబంధించిన ప్రక్రియ పూర్తయి టెండర్లు సైతం పిలిచారు. దీనికి 6,480 కోట్లు కాగా, 182 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. అలాగే ఉత్తర భాగానికి రెండు నెలల క్రితం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. దీనికి 158 కిలోమీటర్లకుగాను రూ.9,164 కోట్లు అవసరమవుతాయి. రెండు భాగాలు కలిపి 340 కిలోమీటర్లు. దీనికి రూ.17 వేల కోట్లు ఖర్చుచేయనున్నారు. ఇందులో భూసేకరణే అత్యంత కీలకం కానుంది. ఎనిమిది లైన్ల రింగురోడ్డు నిర్మాణానికి అయ్యే భూసేకరణ కార్యక్రమాన్ని వేగంగా చేపట్టేందుకు అవసరమయ్యే నిధులు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కేటాయించలేదు. తొలుత కేవలం రూ.100 కోట్లు మాత్రమే డిపాజిట్ చేసింది. విడతల వారీగా నిధులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఈ నిధులు ఆ ప్రాజెక్టు భూసేకరణకు ఏమాత్రం సరిపోవని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. సుమారు రూ.1400 కోట్లు ఇస్తే తప్ప, భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగదని అంటున్నవారూ ఉన్నారు.



50 శాతం చొప్పున

రీజినల్ రింగు రోడ్డు నిర్మాణానికి కేంద్రం నిధులు ఇస్తుండగా, భూసేకరణకు అయ్యే ఖర్చును మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ భరించాల్సి ఉంటుంది. గతేడాది 2021-22 బడ్జెట్‌లో రూ.750 కోట్లు కేటాయించగా, అందులో కేవలం రూ.600 కోట్లు ఖర్చుచేసినట్టు సవరించిన బడ్జెట్ అంచనాల్లో సర్కారు పేర్కొంది. మిగతా రూ. 150 కోట్లను ప్రభుత్వం ఇంకా వ్యయం చేయలేదు. గత ఏడాది మాత్రం రూ.500 కోట్లు ఇచ్చింది.

4700 ఎకరాలు అవసరం

వాస్తవానికి ఉత్తరభాగం ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి సుమారు 4700 ఎకరాల భూమి కావాలి. దీనికోసం మొత్తం రూ.4000 కోట్లు అవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది. అంటే రూ. 2000 కోట్ల చొప్పున వ్యయం చేయాలి. గత బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు, ఖర్చును పరిశీలిస్తే, పూర్తిస్థాయిలో వ్యయం చేసినా ఇంకో రూ.1100 కోట్లు భూసేకరణకు అవసరం కానున్నాయి. ఇప్పటికే ఈ ఉత్తరభాగం ప్రాజెక్టుకు రూ. 9,164 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా, నిధులు ఆలస్యంగా ఇస్తే, ఆ వ్యయం సైతం మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. అయితే అవసరాన్ని బట్టి ప్రభుత్వం నిధులను ఇస్తుందని రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.

రెండు ప్యాకేజీల్లో..

ఒప్పందం తర్వాత తొలివిడతలో సంగారెడ్డి నుంచి తూప్రాన్ వరకు 60 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రంగం సిద్ధమవుతున్నది. దీనిని రెండు ప్యాకేజీలుగా విభజించాలని కేంద్రం నిర్ణయించింది. పనులను వేగంగా పూర్తిచేసేందుకు ప్రతి 30 కిలోమీటర్లను ఒక ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవనున్నారు. దీనికోసం 260 ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంటుంది. ఈమేరకు ఆయా భూయజమానులకు నోటీసులు జారీచేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన ప్రతిసారి కొంతమేర భూసేకరణ చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తున్నది. ఈమేరకు ఎన్‌హెచ్‌ఏఐ, కేంద్ర ఉపరితల రవాణాశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. ఈనేపథ్యంలో తొలుత నిర్మించే 60 కిలోమీటర్లకు భూసేకరణ చేసుకున్నాయి.

కొత్త నోటిఫికేషన్లు

ఉత్తరభాగం 182 కిలోమీటర్ల రహదారిని 11 భాగాలుగా విభజించి ఆ మార్గంలో సర్వే నిర్వహించి భూయజమానులకు గుర్తించేందుకు నాలుగు విడతలుగా కేంద్రం నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఏడాదిలోగా ఈ ప్రక్రియను పూర్తిచేసి భూసేకరణకు వీలుగా తుది నోటిఫికేషన్ జారీచేయాల్సి ఉంది. జోగిపేట, యాదాద్రి, చౌటుప్పల్ ప్రాంతాల రెవెన్యూ అధికారుల పరిధిలో సర్వే నోటిఫికేషన్ ఇచ్చి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో ఆయా ప్రాంతాలకే తుది నోటిఫికేషన్ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసి రెండునెలలైంది.

స్వస్థా ఎక్స్‌ఫోలో గవర్నర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర అయూష్ మంత్రిత్వ శాఖకు చెందిన స్వస్థా ఆధ్వర్యంలో హైటెక్‌సిటీలో శుక్రవారం నిర్వహించిన గ్లోబల్ ఆయూష్, వెల్‌నెస్ ఎక్స్‌ఫో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నట్టు రాజ్‌భవన్ ప్రెస్ సెక్రటరీ తెలిపారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు

- కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీఐలో కలెక్టర్లు, ఎస్పీలతో కేంద్ర ఎన్నికల బందం శుక్రవారం సమావేశం నిర్వహించింది. సాధారణ ఎన్నికల్లో పాటించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించింది. నాలుగు రోజుల పాటు తెలంగాణలో ఈ బృందం పర్యటించనుంది. అందులో భాగంగానే నిర్వహించిన సమావేశంలో సమస్యాత్మక ప్రాంతాలు, స్ట్రాంగ్ రూమ్స్, పోలింగ్ కేంద్రాల దగ్గర భద్రతపై సమీక్షించారు. ఓటర్ల జాబితా, తప్పుల సవరణపై ఆదేశాలు జారీ చేసింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహం, ఓటింగ్ శాతాన్ని పెంచేలా, ఓటింగ్ శాతం తక్కువ నమోదు అవుతున్న వాటిని గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొనే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు.

అన్ని జిల్లాల్లో లీగల్ సర్వీస్ సెంటర్లు

- 17 జిల్లాల్లో ప్రారంభించిన హైకోర్టు సీజే

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ (ఎల్‌ఏడీసీఎస్) కేంద్రాలను హైకోర్టు ఏర్పాటు చేసింది. ఫిబ్రవరిలో 16 జిల్లాల్లో ఏర్పాటు చేయగా, గురువారం మిగిలిన 17 జిల్లాల్లో ఏర్పాటు చేసింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ జస్టిస్ పి.నవీన్‌రావు సంయుక్తంగా వాటిని హైకోర్టు నుంచి ఆన్‌లైన్ విధానంలో ప్రారంభించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఖమ్మం, కొమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, జగిత్యాల, జయశంకర్ భూపాల్‌పల్లి, జోగుళాంబ గద్వాల, కామారెడ్డి, ములుగు, నారాయణపేట్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో ఏర్పాటు చేసింది.

వ్యవసాయరంగంలో జీవవైవిధ్యం కోసం ప్రత్యేక ఎంజెడా

- టీఎస్‌బీబీ చైర్మెన్ రజత్‌కుమార్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో వ్యవసాయ రంగంలో జీవవైవిధ్యం కోసం ప్రత్యేక ఎజెండాతో ముందుకెళ్తున్నామని తెలంగాణ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు(టీఎస్‌బీబీ) చైర్మెన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో టీఎస్‌బీబీ, యునైటెడ్ నేషనల్స్ డెలప్‌మెంట్ ప్రోగ్రాం, ఎన్‌బీఏ సంయుక్తాధ్వర్యంలో బయోడైవర్సిటీ ఫైనాన్స్ ఇన్షిటేటివ్ ప్రాజెక్టుపై ఒప్పందం జరిగింది. రజత్‌కుమార్ సమక్షంలో యూఎన్‌డీపీ, టీఎస్‌బీబీ మధ్య ఒప్పందం పత్రంపై అధికారులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీఏ చైర్‌పర్సన్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ సి.చలేందర్‌రెడ్డి, తెలంగాణ వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, యూఎన్‌డీపీ క్లైమెట్ అడాప్టేషన్ చీఫ్ రుచిపంత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజత్‌కుమార్, రఘునందన్‌రావు మాట్లాడుతూ..తెలంగాణ వ్యవసాయ జీవవైవిధ్య వారసత్వానికి ప్రసిద్ధి చెందిందన్నారు. దేశంలో బయోడైవర్సిటీని కాపాడేందుకు బయోఫిన్ సంస్థ ప్రజలు, ప్రభుత్వం, ప్రయివేటు రంగాలతో కలిసి పనిచేస్తుందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పండే ప్రత్యేకమైన పంటలను కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మచ్చల కందుల సాగుతో రైతులు ఏవిధంగా లాభాలు పొందుతున్నారో వివరించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను విడమర్చి చెప్పారు.

సైన్సుపై శాస్త్రీయదృక్పథం పెరగాలి

- ఏఐపీఎఫ్ సదస్సులో జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్ రాజింవాలె



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సైన్స్ విస్తరించకుంటే, సమాజంలో అంధవిశ్వాసాలు పెరుగుతాయని ఆలిండియా ప్రొగ్రెసివ్ ఫోరం (ఏఐపీఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్ రాజింవాలె అన్నారు. సైన్స్‌పై శాస్త్రీయ దృక్పథం పెరగాలనీ, పరిశోధనలు విస్తరించాలని అభిప్రాయపడ్డారు. సైన్స్ ఫలాలు సమాజంలో అందరికీ సమానంగా అందాలని ఆకాంక్షించారు. ఏఐపీఎఫ్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారంనాడిక్కడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో "రక్షణలో శాస్త్రీయ దృక్పథం" అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అనిల్ రాజింవాలె మాట్లాడుతూ నిత్యజీవితంలో సైన్స్ ప్రాధాన్యతను వివరించారు. వస్తువుల ఉత్పత్తితో పాటు పంపిణీ కూడా సమానంగా జరగాలన్నారు. భౌతిక శాస్త్రంలో చలన సిద్ధాంతం నూతన ఒరవడికి నాందిపలికిందనీ, అణువు నుంచి చోదక శక్తులు పెనుమార్పులు సంభవించి సైన్సులో కొత్త ఆవిష్కరణలకు దిశానిర్దేశం చేశాయన్నారు. కంప్యూటర్ల ఆవిర్భావం తర్వాత గతంలో కంటే మేధాశక్తి ఇప్పుడు మరింత పెరిగిందని విశ్లేషించారు. విద్యారంగం అభివద్ధి చెందినా, శాస్త్రీయ, సైన్సు ఆలోచనలు ఆ స్థాయిలో పెరగలేదని చెప్పారు. సైన్సును పాఠ్యాంశాల నుంచి తొలగించటం సమంజసం కాదన్నారు. దీని ప్రభావం భవిష్యత్ తరాలు, సమాజంపై తీవ్రంగా ఉంటుందని వివరించారు. పారిశ్రామిక విప్లవం, యాంత్రీకరణ అన్నీ సైన్స్‌తోనే సాధ్యమయ్యాయని తెలిపారు. డార్విన్, మార్క్స్ సిద్ధాంతాలు శాస్త్రీయమైనవనీ, వాటిని అనుసరించాలని చెప్పారు. మంత్రతంత్రాలతో వ్యాధులు నయంకావనీ, మతం, మూఢనమ్మకాలు శాస్త్రాలు కావన్నారు. సైన్స్ అంటే ప్రశ్నే అనీ, దాన్ని విస్తరించుకోవాలని అన్నారు. ఏఐపీఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ యుగల్ రాయ్ మాట్లాడుతూ అశాస్త్రీయమైన మూఢనమ్మకాలను నమ్మకూడదన్నారు. న్యూటన్ జడత్వ సిద్ధాంతం సైన్సులో కొత్త పుంతలు తొక్కిందనీ, డార్విన్ జీవ పరిణామ సిద్ధాంత ప్రకారం ఇప్పటికీ సశాస్త్రీయంగా నిలిచిందంటూ కోవిడ్ ఉధృతి, టీకాల తయారీ, అవిపనిచేసే విధానాలను విశ్లేషించారు. దాన్ని కాదని గోమూత్రం తాగితే రోగాలు నయమవుతాయి అని ప్రచారం చేస్తే అంతకంటే మూర్ఖత్వం మరొకటి లేదన్నారు. ఏపిపిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ రజని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏఐపీఎఫ్ నాయకులు వీయస్ బోస్ సమన్వయ కర్తగా వ్యవహరించారు.

క్యాన్సర్‌పై అవగాహనతోపాటు వైద్య పరీక్షలూ అవసరం

- సినీ కార్మికులకు స్టార్ ఆస్పత్రి సహకారంతో వైద్య పరీక్షలు : ప్రముఖ సినీ హీరో చిరంజీవి



నవతెలంగాణ-బంజారాహిల్స్

క్యాన్సర్‌పై అవగాహనతోపాటు వైద్య పరీక్షలూ అవసరం అని, స్వచ్ఛంద సంస్థల సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించడం ఎంతో అవసరమని ప్రముఖ సినిమా హీరో చిరంజీవి అన్నారు. క్యాన్సర్ నుంచి తమ అభిమానులు, సినీ కార్మికులను రక్షించేందుకు చిరంజీవి ఒక అడుగు ముందుకు వేశారు. జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి నేత్ర రక్తనిధి, స్టార్ హాస్పిటల్ సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్, వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.గోపీచంద్, ఇతర వైద్యులతో కలిసి శుక్రవారం ఆయన రక్తనిధి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంలో ఇంకా లోపం ఉందనీ, దాన్ని పూర్తిస్థాయిలో భర్తీ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రుల సహకారం ప్రభుత్వానికి అవసరమనీ అన్నారు. అవగాహనతో పాటు వైద్య పరీక్షలు నిరంతరంగా సాగితేనే క్యాన్సర్ నుంచి ప్రజలను కాపాడుకోగలుగుతామని తెలిపారు. క్యాన్సర్ పట్ల ఎంత అవగాహన కల్పిస్తే అంత ఈ వ్యాధిని దూరం చేయగలమని సూచించారు. స్టార్ ఆస్పత్రి సహకారంతో సినీ కార్మికులు, వారి కుటుంబాలకు వైద్య పరీక్షలు నిర్వహించి సకాలంలో చికిత్స చేయించే ఏర్పాట్లు చేస్తామన్నారు. స్టార్ ఆస్పత్రి యాజమాన్యానికి అభినందనలు తెలియజేస్తూ ఈ సేవలు విస్తృతంగా కొనసాగించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణంలో నివసిస్తున్న వారు అత్యధికంగా కాలుష్య కోరల్లో వృత్తిరీత్యా జరిగే పరిణామాలతో ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారని, దీనికి వైద్యులు సూచించే వైద్య పరీక్షలతోపాటు క్రమం తప్పకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, నిద్రలేమి సమస్యలను అధిగమించాలని అన్నారు. నిత్యం కాలినడక, యోగా వంటి కార్యక్రమాలు చేస్తూ ఆరోగ్యాన్ని కొంతమేర సురక్షితం చేసుకోవచ్చని సూచించారు. క్యాన్సర్లను సకాలంలో గుర్తిస్తేనే మనిషి ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా కాపాడుకోగలమని వైద్యులు సైతం తెలియజేస్తున్నారని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని సకాలంలో చికిత్స తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో సినీ కార్మికులు, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, స్టార్ ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపా రద్దు కోసం ఐక్య పోరాటాలు

- తాడ్వాయి కుట్ర కేసును ఉపసంహరించుకోవాలి
- 146 మందిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఉపా చట్టాన్ని రద్దు చేయాలి. దేశద్రోహం, రాజద్రోహం, ఎన్ఐఏ చట్టాలను రద్దు చేయాలి. తాడ్వాయి కుట్ర కేసును ఉపసంహరించుకోవాలి. 152 మందిపై కేసు నమోదు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురిపైన ఉన్న కేసుల్నే ఎందుకు ఉపసంహరించుకుంది. ప్రభుత్వం విభజించు-పాలించు అనే రకంగా కుట్ర చేస్తున్నది. అందువల్ల ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి' అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. 'పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, 152మందిపై పెట్టిన తాడ్వాయి కుట్ర కేసును ఎత్తివేయాలి' అనే అంశంపై సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆ పార్టీ సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ పార్టీలపై నిషేధం, నిర్బంధం సరైందికాదని అన్నారు. ఎర్రజెండాను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఏమి చేయలేకపోయాయని గుర్తుచేశారు. ముమ్ముందు కూడా ఏమి చేయలేరని అన్నారు. కేసులు, జైళ్లు, నిర్బంధాలు ఎర్రజెండాలకు కొత్తేమికాదన్నారు. భీమాకోరేగావ్ కేసు దుర్మార్గమైందన్నారు. కుట్ర చేశారనే పేరుతో పూర్తి అంగవైకల్యం ఉన్న సాయిబాబాను జైళ్లో బంధించారని గుర్తుచేశారు. 152 మందిపై రాష్ట్ర ప్రభుత్వం ఉపా కేసు నమోదు చేయడం అన్యాయమని అన్నారు. బీజేపీకి తాను వ్యతిరేకమని గొప్పలు చెప్పిన కేసీఆర్ కూతురుపై కేసు పెట్టగానే ఢిల్లీకెళ్లారని గుర్తుచేశారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకొస్తుందనే నమ్మకం కేసీఆర్‌కు లేదని, కర్నాటక ఫలితాలు ఆయన్ను మరింత కలవరపెడుతున్నాయని అన్నారు. తాడ్వాయి కుట్ర కేసులోని 152 మందిలో కేవలం ఆరుగురిపై కేసును ఉపసంహరించుకోవడమేంటని ప్రశ్నించారు. ఉపా చట్టానికి వ్యతిరేకంగా అన్ని జిల్లాలో సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోడీ అమెరికాలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం శోచనీయమన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లురవి మాట్లాడుతూ రాజ్యాంగంలోని లౌకికవాదం, సామ్యవాదం అంశాలను పాఠ్యపుస్తకాల్లో తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉపా చట్టాన్ని రద్దు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలమల్లేష్ మాట్లాడుతూ మాట, ఆట, పాటలపై నిర్బంధం కొత్తేమికాదన్నారు. ఇదే అంశంపై ఈనెల 27న తమ పార్టీ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తాడ్వాయి కుట్ర కేసు అనేది 152 మంది సమస్య కాదని, తెలంగాణ అస్థిత్వ, హక్కులకు సంబంధించిన సమస్యగా గుర్తించాలని అన్నారు. ప్రశ్నించేవారిని భయపెట్టడానికి దేశవ్యాప్తంగా 25,200 మందిపై ఉపా కేసులు పెట్టారని, వీటిలో 2శాతం మందికి మాత్రమే శిక్షలు పడ్డాయని తెలిపారు. కానీ అందరిని జైళ్లలో పెట్టారని గుర్తుచేశారు. టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోదండరామ్ మాట్లాడుతూ ఉపా చట్టం అవసరంలేదని, అందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ ఉపా చట్టం రద్దు, తాడ్వాయి కుట్ర కేసును ఉపసంహరించుకోవాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో ఆప్ తెలంగాణ కన్వీనర్ దిడ్డి సుధాకర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు విమలక్క, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి రవి, ఎస్‌యూసీఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు హన్మేష్, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మహేష్, ఓపీడీఆర్ నాయకులు లక్ష్మి రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కన్నెగంటి రవి, టీవీవీ రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య, ఓయూ ప్రొఫెసర్ సమున్నత, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్, సామాజిక కార్యకర్త సజయ, హైకోర్టు న్యాయవాది లింగన్న, ఆఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు, కేంద్రప్రభుత్వ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు కృష్ణమోహన్, ఐఎఫ్‌టీయూ, పీవైఎల్, పీడీఎస్‌యూ, బీసీ సంఘం యువజన విభాగం, పౌరహక్కుల సంఘం, ప్రజాసంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

గురునానక్, శ్రీనిధి విద్యార్థులకు న్యాయం చేయాలి


- ఉన్నత విద్యామండలికి ఏఐవైఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురునానక్, శ్రీనిధి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావును శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు లేని ప్రయివేటు విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులను కాపాడకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గురునానక్ యాజమాన్యాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తే పోలీసులతో లాఠీచార్జీ చేయించడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నిర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిరిగిన జాతీయ జెండా.. ట్వీట్‌తో అప్రమత్తం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఖమ్మం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (నూతన కలెక్టరేట్)లోని భారీ పోల్‌పై ఏర్పాటు చేసిన జాతీయ జెండా గాలికి చిరిగింది. దీన్ని ఓ యువకుడు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో శుక్రవారం పోస్టు చేశాడు. కొందరు ప్రముఖులకు ట్వీట్ చేయడంతో హైదరాబాద్‌లో ఉన్న కలెక్టర్ వీపీ గౌతమ్ వరకు విషయం చేరింది. వెంటనే ఆయన కలెక్టరేట్ పాలన అధికారి కార్యాలయ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో ఆగమేఘాలపై వారు కొత్తజెండాను తీసుకొచ్చి, క్రేన్ సహాయంతో అమర్చారు.

మరో 1,827 స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ

- ఆర్థికశాఖ అనుమతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని టీచింగ్ ఆస్పత్రుల్లో 1,827 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ మెడికల్ హెల్త్ అండ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిన ఈ పోస్టులు భర్తీ చేస్తుంది. జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే 5,204 స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియను వైద్యారోగ్య శాఖ మొదలు పెట్టిన విషయం తెలిసిందే.

ఊహాజనిత కథనాలను ప్రసారం చేస్తున్నారు..

- వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తనకూ తెలంగాణ ప్రజలకు మధ్య దూరం పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఊహాజనిత కథనాలను ప్రసారం చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని ఆమె వాపోయారు. తన చివరి శ్వాస వరకు తెలంగాణ బిడ్డగానే ఉంటానని తెలిపారు. ఇక్కడి ప్రజల సమస్యలపై పోరాడుతూనే ఉంటానని పేర్కొన్నారు. తనపై వార్తలు రాసేవారు..కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలో జరిగిన వైఫల్యాల గురించి కూడా రాయాలని సూచించారు.

ఎస్టీ కమిషన్ ఏర్పాటు ఎందుకు చేయలేదు

- ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్రంలో ఎస్టీల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయకపోవడంపై వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శి, గిరిజన సంక్షేమ కమిషనర్, షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఎస్టీల కమిషన్‌ను ఏర్పాటు చేయాలంటూ లంబాడీ హక్కుల పోరాట సమితి నగార భేరీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాఖలు చేసిన పిల్‌పై విచారణను ఆగస్టు 17కు వాయిదా వేసింది. ఎస్సీ, ఎస్టీలకు ఒకే కమిషన్ వేయడాన్ని పిటిషనర్ తప్పుపట్టారు.



రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు

రాష్ట్ర స్థాయి పోలీస్ భద్రతా కమిషన్(ఎస్ఎస్‌సీ), పోలీసు ఫిర్యాదు అథారిటీ(పీసీఏ)లకు రెండు నెలల్లోగా ఆఫీసులు, స్టాఫ్ వంటి మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఎస్ఎస్‌సీ, పీసీఏలను ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయలేదని పేర్కొంటూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి లాయర్ వేణుమాధవ్ వేసిన వ్యాజ్యాలను శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీలతో కూడిన ధర్మాసనం విచారించింది. హైదరాబాద్, మరో జిల్లాలో రీజినల్ అథార్టీలకు చైర్మెన్, సభ్యులను నియమించామని ప్రభుత్వ ప్లీడర్ చెప్పారు. జిల్లాల్లో ఏర్పాటు చేయలేదని పిటిషనర్ వాదన. విచారణను ఆగస్టుకు వాయిదా వేశారు.

కోర్టుకు అజారుద్దీన్

కోర్టు ధిక్కార కేసులో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ చైర్మెన్, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ శుక్రవారం హైకోర్టు విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. అసోసియేషన్ నిర్వహించిన లీగ్ మ్యాచ్‌ల్లో నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ పాల్గొనేలా చేయాలని 2021లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయలేదని ఆ అసోసియేషన్ కోర్టు ధిక్కార పిటిషన్ వేసింది. దీనిని జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారించారు. తదుపరి విచారణకు కూడా హాజరుకావాలని అజారుద్దీన్‌ను ఆదేశించారు.

సింగరేణి ఎన్నికలపై కేసు

సింగరేణి యూనియన్ ఎన్నికలను అక్టోబర్ వరకు వాయిదా వేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం ఆదేశించారు. సింగరేణి యాజమాన్యం, గుర్తింపు సంఘం వేసిన రిట్లను విచారించి వారి అభ్యర్థనలకు అనుగుణంగా ఎన్నికలను అక్టోబర్ వరకు ఆపాలని ఆదేశించారు. అక్టోబర్ 1 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని, మూడు నెలల్లోగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

వీసీ కొనసాగింపుపై రిట్

కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పదవీ 2019 జులైలో ముగిసినా ఆ పదవిలో ఆయనను కొనసాగించడానికి కారణాలు చెప్పాలని హైకోర్టు కోరింది. అలా కొనసాగించడానికి ఉన్న అర్హతలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి, ఛాన్సలర్, రిజిస్ట్రార్లతోపాటు వీసీ డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డిలను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. హెల్త్‌కేర్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.

ఏసీపీగా పదోన్నతి పొందిన మధుసూదన్



నవతెలంగాణ- చైతన్యపురి

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చైతన్య పురి పోలీస్ స్టేషన్ లో ఇన్ స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించే సంగెం మధుసూదన్ ఏసీపీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి శుక్రవారం ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ యాదవ్, అనుదీప్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్, శ్రవణ్, అషిఫ్, వేణు గోపాల్ రెడ్డి, విజయ్, రాజు, మాచర్ల వరుణ్, మహేష్ యాదవ్, పింటూ, వినయ్, విప్లవ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ సీఐగా అనురాధ



నవతెలంగాణ -సంతోష్ నగర్

సైదాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో సీఐగా బి. అనురాధ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అనురాధ శుక్రవారం నవ తెలంగాణతో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో మహిళలు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. నేర ప్రవృత్తి ఉన్నవారిలో మార్పు తీసుకురావడం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శాంతి భద్రతల పరి రక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గా భవానీ నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ -సంతోష్ నగర్

చంపాపేట్ డివిజన్ పరిధిలోని దుర్గా భవానీ నగర్‌ను ఆదర్శంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు.దుర్గా భవానీ నగర్‌లో రూ. 30లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం చంపాపేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజ్ కుమార్ రెడ్డి, నాయకులు నల్ల రఘుమారెడ్డి, దుర్గా భవానీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్, కొత్తపేట ప్రభాకర్, పార్టీ శ్రేణుల నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. డివిజన్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రోడ్డు రవాణ, స్థానిక సమ స్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధి కారులదే అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు యా దగిరి రెడ్డి, యాదిరెడ్డి, సాయిలు గౌడ్, కిశోర్, నరసింహ యాదవ్, మోహన్ రెడ్డి, రత్నా రావు, లక్ష్మారెడ్డి, రాహుల్, మోహన్ రెడ్డి, రఘుమారెడ్డి, ఉమామహేశ్వర్, అంజయ్య, సామ శ్రీధర్ రెడ్డి, తలారి సత్య ప్రకాష్, నరేష్, బాలకృష్ణ, రాజు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా బక్రీద్ వేడుకలు జరుపుకోవాలి

- జాయింట్ కమిషనర్ సత్యనారాయణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

శాంతియుతంగా బక్రీద్ వేడుకలను జరుపుకోవాలని రాచకొండ జాయింట్ కమిషనర్ సత్యనారాయణ ఐపీఎస్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం బక్రీద్ పండుగ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జాయింట్ కమిషనర్ సత్యనారాయణ ఐపీఎస్..రాచకొండ జోనల్ డీసీపీలు, ఏసీపీలు, జీహెచ్ఎంసీ, వెటర్నరీ విభాగం అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో మత సామరస్యాన్ని కాపాడడానికి అవసరమైన అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎన్నో సున్నితమైన ప్రదేశాలు ఉన్నా యని, బక్రీద్ వేడుకల సమయంలో ఎటువంటి శాంతి, భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బక్రీద్ పండుగ సమయంలో ఎటువంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులతో ప్రజలు సహకరించాలని కోరారు. ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొనే సామూహిక కార్యక్రమాల బందోబస్తు సమయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా పశువుల అక్రమ రవాణా మీద నిఘా వేసి ఉంచాలని, రాచకొండ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణా నివారించడానికి 12 ప్రత్యేక చెక్ పోస్టులు, 6 హోల్డింగ్ పాయింట్స్ లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లు చేసే సందర్భంలో తగిన సమర్థవంతమైన అధికారులకు విధులు అప్పగించాలని సూచించారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, ఆయా ప్రాంతాల్లో సీసీ టీవీల పనితీరును పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోడ్ల మీద ట్రాఫిక్ జామ్ లు ఏర్పడకుండా, ఇతర సాధారణ ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బీఎన్‌రెడ్డి నగర్ అభివృద్ధే లక్ష్యం



- కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి

నవతెలంగాణ -వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధే నా లక్ష్యం అని కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేస్ 1 లో చేపట్టిన బీటీ రోడ్ పనులను శుక్రవారం జీహెచ్ఎంసీ డీఈ దామోదరరావు తో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచిం చారు. కాలనీల్లో ఏ సమస్య ఉన్నా తమదృష్టికి తీసుకొస్తే సకాలంలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవానికి రావాలని ఆహ్వానం



నవతెలంగాణ -ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లో బొడ్రాయి మూడో వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డికి శుక్రవారం బొడ్రాయి ఉత్సవ కమిటీ కన్వీనర్ జెల్లీ మోహన్, కో కన్వీనర్ వీరలి రవీందర్, గుడి మధుసూదన్ రెడ్డిలు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతలను ప్రతి ఒక్కరూ ఆరాధించాలని సూచించారు. గ్రామ దేవతలు గ్రామ రక్షకులుగా ఉంటారని వివరించారు. ఆహ్వాన పత్రాన్ని అందజేసిన వారిలో పల్లె నర్సింగ్ రావు, కొంపల్లి రవీందర్, పిట్టల నరేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు అబ్ది



- ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - వనస్థలిపురం

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో లబ్ది చేకూరుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని సచివాలయనగర్‌లో నివాసం ఉండే భువనేశ్ సాయికు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి చెక్కు మంజూరైంది. ఈ సందర్భంగా మంజరైన రూ.2,50,000 విలువ గల చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే లబ్ధిదారుడికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయ నిధి దోహదపడుతుందని చెప్పారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, సత్యంచారి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం పరిధి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 30వ డివిజన్ సుబ్రహ్మణ్యం కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న శశికళ కుటుంబాన్ని బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగిరింత నర్సింహారెడ్డి శుక్రవారం పరామర్శించారు. తర్వాత ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్ల గూడెం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గట్టు బాలకృష్ణ, కుమార్, విజయ్, సుధాకర్ రెడ్డి, భాస్కర్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబ పాలనకు చరమ గీతం పాడాలి

- బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. శుక్రవారం నియోజక వర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 28వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ చిత్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజా మహా సంపర్క అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గుర్రం మల్లారెడ్డి, సామ సంజీవ రెడ్డి, రంగారెడ్డి జిల్లా పార్టీ అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి, కార్పొరేషన్ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు రావాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఘట్కేసర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఘట్కేసర్ మున్సిపాలిటీ ఈ డబ్ల్యూఎస్ కాలనీ తెలుగు మీడియం పాఠశాలలోని 600 విద్యార్థులకు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి సొంత ఖర్చుతో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలోని విద్యార్థులకు చేయూత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ సభ్యురాలు దేవరకొండ పద్మ, రాజా, చారి, అబ్బగోని మీనా ఆనంద్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వీరేష్ గుప్తా, నజీర్, భాను, నవీన్, సుబ్బారావు, ఇక్బాల్, మడిపడిగే లక్ష్మయ్య, ఉపాధ్యాయులు అఖిల, హైమావతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కాలనీలో వాటర్ వర్క్స్ అధికారుల పర్యటన



నవతెలంగాణ- ఎల్బీనగర్

సరూర్ నగర్ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్ కాలనీలో వాటర్ వర్క్స్ డీజీఎం సరిత శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చారు. యూజీడీ పైప్ లైన్ పనులను త్వరగా మొదలు పెట్టాలని కాంట్రాక్టర్ వెంకటేష్‌కు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మాజీ యూత్ వింగ్ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పాలోజి లక్ష్మయ్య, గౌని శ్రీనివాస్ గౌడ్, కడారి యాదయ్య, కిల్లా మైసమ్మ దేవాలయ మెంబర్ రాగం సునీల్ యాదవ్, రమేష్, శివ పాల్గొన్నారు.

ఘనంగా మల్లేష్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- సంతోష్ నగర్

చంపాపేట్ డివిజన్ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త చేగొని మల్లేష్ గౌడ్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ..పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. తర్వాత కేక్ కట్ చేసి ఆయనకు తినిపించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నల్ల రఘుమా రెడ్డి, ఓరుగంటి వెంకటేష్ గౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోదు కృష్ణమాచారి పాల్గొన్నారు.

పలు చోట్ల
సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ- వనస్థలిపురం

ఏ వర్గాల ప్రజలకు ఏది కావాలో తెలిసిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మెట్రో రైల్‌ను ఎల్బీనగర్ నుంచి వార్డ్ అండ్ డేట్ వరకు విస్తరిస్తామని సీఎం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వనస్థలిపురం కాంప్లెక్స్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్రో విస్తరణ వల్ల లక్షలాది మందికి మేలు జరుగుతుందన్నారు. హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఫ్లై ఓవర్లు, స్కై వేలు అండర్పాస్‌లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుడు మధు గౌడ్, వేములయ్యా గౌడ్, సంతోష్ కురుమ, శ్రీనివాస్ యాదవ్, అజయ్ యాదవ్, రవి కుమార్ కమల్ల, భరత్, రాంబాబు, రాజేష్, కిట్టు, నాని, నరసింహ, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వనస్థలిపురం :

ఎల్బీనగర్ చౌరస్తా నుండి హయత్ నగర్ వరకు మెట్రో విస్తరణకు సీఎం కేసీఆర్ అంగీకరించినందుగాను హర్షం వ్యక్తం చేస్తూ..బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బీఎన్‌రెడ్డి నగర్ ఆటోస్టాండ్ వద్ద పార్టీ శ్రేణులు కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనిల్ చౌదరి, కొంగర మహేష్, నరేందర్ గౌడ్, రాఘవేందర్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు మునగాల రాఘవేందర్ రావు, దయాకర్ ముదిరాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు సువర్ణ రెడ్డి, ఉపాధ్యక్షురాలు నాగమణి రెడ్డి, జనరల్ సెక్రటరీ నిర్మలా దేవి, అమరేందర్ రెడ్డి, టీచర్స్ కాలనీ సౌత్ పార్ట్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ :

ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు మెట్రో రైలు పొడగింపును సీఎం కేసీఆర్ ప్రకటించడంతో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల రెడ్డి, కొప్పుల విఠల్ రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మన్సూరాబాద్, హయత్‌నగర్ బీఆర్ఎస్ కార్యకర్తలు హయత్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం



కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హస్తినాపురం :

సీఎం కేసీఆర్ చొరవతో ఎల్బీనగర్ నియోజవర్గానికి అధిక నిధులను సమీకరించి అభివృద్ధి పథంలో నిలపడంలో ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి కీలక పాత్ర పోషించారని హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆందోజ్ సత్యం చారి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు హస్తినాపురం డివిజన్ పరిధిలోని లక్కీ హెూటల్ వద్ద శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎల్బీనగర్ నియోజక వర్గానికి అధిక నిధులు కేటాయించడం శుభపరిణామం అని, ఫ్లై ఓవర్లు, స్కై ఓవర్లు అండర్ పాసులు, పెద్ద పెద్ద నాలల ఏర్పాటు చేసి ఎల్బీనగర్ నగర్ రూపు రేఖలు మార్చి అభివృద్ధికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ



118 జీవో ఇచ్చి ఎంతో మందికి మేలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారగోని శ్రీనివాస్ యాదవ్, లెంకల శ్రీకాంత్ రెడ్డి, శేషగిరి రావు, భిక్షపతి, చారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్తపై చేయి చేసుకున్న అల్లుడికి 10 రోజుల జైలుశిక్ష

నవతెలంగాణ- సంతోష్ నగర్

అత్తపై చేయి చేసుకున్న అల్లుడికి 10 రోజుల జైలుశిక్ష విధిస్తూ నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ తీర్పు నిచ్చింది. చాదర్ ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా మిర్యాలగూడ నివాసి టి.చంద్రశేఖర్ ప్రైవేటు ఉద్యోగి, చైతన్యపురి నివాసి సరిత కూతురు శివానిని చంద్రశేఖర్ కులాంతర వివాహం చేసుకున్నాడు. శివాని అనారోగ్యంతో మలక్‌పేట్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషయం తెలుసుకున్న తల్లి సరిత కూతురు శివానిని చూసేందుకు వచ్చింది. ఈ నెల 7న అత్త సరిత అల్లుడు చంద్రశేఖర్ పట్ల దుర్భాషలాడింది. దీంతో కోపోద్రిక్తుడైన చంద్రశేఖర్ అత్త సరితపై చేయి చేసుకున్నాడు. బాధితురాలు సరిత చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా..సీపీ యాక్ట్ 70బీ, 323 ఐపీసీ కింద కేసు నమోదు చేశారు. చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ లక్ష్మణ్ రావు కేసు వివరాలను పరిశీలించి నిందితుడు చంద్రశేఖర్‌కు 10రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు.

ఘనంగా జాతీయ స్థాయి
సాంకేతిక, సాహిత్య ఉత్సవం సద్యా 2 కే 23



నవతెలంగాణ -సంతోష్ నగర్

హైదరాబాద్ జిల్లా సైదాబాద్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక, సాహిత్య ఉత్సవం సద్యా 2 కే 23ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ డాక్టర్ కేపీ. శ్రీనివాసరావు, ఎంఇఎస్, సెక్రటరీ ఎం. కృష్ణ కుమార్, ఎంఇఎస్ కార్యదర్శి జె. సుధాకర్, ఎంఇఎస్ కోశాధికారి, ఎంఇఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. హనుమంతరావు, ఎంఇసిఎస్, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు సిబ్బంది కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. తర్వాత పోస్టర్ ప్రజెంటేషన్, లోగో డిజైన్, యాంగ్రీ బర్డ్, ఎస్కేప్ రూమ్, మిస్టరీ సాల్వింగ్, మెటల్ క్రాఫ్ట్, పర్సుయేసివ్ పిచ్ వంటి అనేక పోటీలను ఆయా విభాగాలు నిర్వహించాయి. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఫ్లాష్ మాబ్ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ప్రధానోపాధ్యాయులు, ఇతర ప్రముఖులు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



నవ తెలంగాణ సంతోష్ నగర్

మలక్‌పేట్ నియోజకవర్గంలోని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. అక్షయ హెూటల్‌కు సమీపంలో బురద, ప్లాస్టిక్ బూట్లతో మూసుకుపోయిన మ్యాన్‌హెూల్స్‌ను శుక్రవారం జీహెచ్ ఎంసీ ఏఈ వెంకన్నతో కలిసి సీఐ పరిశీ లించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లా డుతూ నియోజకవర్గం పరిధిలోని అజాంపూరా, ఓల్డ్ మలక్‌పేట్ డివిజన్ మార్కెట్ గంజ్ పలు డివిజన్ల ఆవరణంలో డ్రైనేజీ పొంగడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుందని వివరించారు. ఈ ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మాన్‌సూన్ బృందాలు, డీఆర్ఎఫ్‌తో కలిసి మ్యాన్‌హోల్స్‌ను క్లియర్ చేయించే ప్రయత్నం చేయించారు. కానీ డీప్, ప్లాస్టిక్ బూట్‌లు, వ్యర్థాలు అడ్డుపడుతున్నాయని తెలిపారు. స్థానికుల విజ్ఞప్తి పేరుకు ఎయిర్ టెక్ మిషన్ ద్వారా పరిష్కరించాలని కోరుతున్నారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా డ్రైనేజీ ప్రవాహాన్ని క్షుణంగా పరిశీలించి.. సమగ్రంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రెండు నెలలుగా మురుగు పరుగు..



నవతెలంగాణ- సంతోష్ నగర్

చంపాపేట్ డివిజన్ దుర్గా భవానీ నగర్ భాష్యం హై స్కూల్ కరూర్ బ్యాంక్ వద్ద రెండు నెలల నుంచి మురుగు పొంగిపొర్లుతూనే ఉంది. ఈ విషయంపై పలుమార్లు స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు మాత్రం నామ మాత్రంగానే చర్యలు చేపట్టారు. దీంతో యథావిధిగా మురుగు పారుతూనే ఉంది. దుర్వాసనకు ఇండ్లల్లో ఉండలేక పోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని మురుగు పారుదలకు శాశ్వత పరిష్కారం చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ఆదేశాల మేరకు ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పీవీఎస్ కాలనీలో రూ.17 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, వేముల శ్రీనివాస్, కిషోర్, శ్యామ్, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతమ్‌నగర్ (141) డివిజన్ అంబేద్కర్ విగ్రహం ఎదురుగా శుక్రవారం నందికంటి శ్రావణ్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముత్తూట్ ఎం జార్జ్ ఫౌండేషన్ సంస్థ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌లో డీసీసీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల అధ్యక్షులు నందికంటి శ్రీధర్ పాల్గొని మాట్లాడారు. కిడ్నీ, గుండె, షుగర్, బీపీకి ఉచిత పరీక్షలు చేసినట్టు తెలిపారు. పేద ప్రజలు ఈ ఉచిత క్యాంపుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, గౌతమ్ నగర్ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, జీవన్ రెడ్డి, హరి శంకర్, జంగయ్య, యాదగిరి, సానాది శంకర్, నాగరాజ్, సూర్య ప్రకాష్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర నాలా అభివృద్ధి'తో వరద ముంపునకు చెక్

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

ఏండ్లుగా వరద ముంపునకు గురవుతూ ప్రజల పడుతున్న కష్టాలకు సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమంతో తొలగిపోతున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం మినిస్టర్ రోడ్డులోని పికెట్ నాలాపై ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంలో భాగంగా రూ.20 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. గత పాలకులు నాలాల అభివృద్ధిని పట్టించుకోకపోవడం వల్ల ఏండ్ల నుంచి నాలాల పరిసర కాలనీల ప్రజలు ప్రతి ఏడాదీ వర్షాకాలంలో వరదముంపునకు గురవుతూ అనేక ఇబ్బందులు పడేవారన్నారు. బాధిత ప్రజల సమస్య పరిష్కారం గురించి కనీసం ఆలోచన కూడా చేయలేదన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వాటిని పరిష్కరించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. నాలాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా వరదముంపు సమస్యనకు శాశ్వత పరిష్కారం



చూపాలనే ఆలోచనతో మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. నాలాల వెంట ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపు, పూర్తిస్థాయిలో పూడిక తొలగించడం, శిథిలావస్థలో ఉన్న, ఇరుకుగా ఉన్న బ్రిడ్జిల స్థానంలో నూతనంగా విశాలమైన బ్రిడ్జిలను నిర్మించడం వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు వివరించారు. అందులో భాగంగా పికెట్ నాలాపై కరాచీ బేకరీ వద్ద రూ.10 కోట్లతో ఒక బ్రిడ్జిని నిర్మించి ప్రారంభించినట్టు తెలిపారు. మినిస్టర్ రోడ్డులోని పికెట్ నాలాపై నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించినట్టు తెలిపారు. బేగంపేటలోని నాలా అభివృద్ధి పనులు కూడా చేపట్టినట్టు చెప్పారు. ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల మీదుగా మూసీ వరకు ఉన్న హుస్సేన్ సాగర్ నాలా అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం కింద అభివృద్ధి పనులు జరిగిన ప్రాంతాల్లో వరదముంపు సమస్య నుంచి ప్రజలకు విముక్తి లభించిందన్నారు. నగరంలో ఉన్న అన్ని నాలాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, ఎస్ఎన్‌డీపీ, సీఈఓ, కిషన్, ఎస్ఈ రెడ్డి, ఈఈ శీధర్, జోనల్ కమిషనర్ శ్రీధర్, ఈఈ సుదర్శన్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శవంతంగా మల్కాజిగిరి



- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అభివృద్ధిలో మల్కాజిగిరి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా నిలుపుతానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం ఆయన మౌలాలి డివిజన్ పరిధిలో సుమారు రూ.కోటీ 40 లక్షలతో నూతనంగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా లక్ష్మి నగర్, నెహ్రూ నగర్, ఆర్‌కేహెచ్ స్ట్రీట్- 3, స్ట్రీట్ -4 తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. లక్ష్మినగర్‌లో రూ.4 లక్షలతో సివరేజీ వాటర్ పైప్ లైన్ పనులను ప్రారంభించారు. అనంతరం ఈస్ట్ ప్రగతి నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, డీఈ మహేష్, ఈఈ మధురిమ, వాటర్ వర్క్ జీఎం సునీల్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వికలాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంఆర్‌పీఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి కేశపాగ రాంచందర్ డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి తహశీల్దార్ కార్యాలయం ఎదుట వికలాంగుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలితమే నేడు వికలాంగుల పెన్షన్ రూ.4,116కు పెరిగిందన్నారు. వికలాంగుల పెన్షన్ రూ.3016 నుంచి రూ.6000వేలకు పెంచాలనీ, 5 జీవో ప్రకారం వికలాంగులకు డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. వికలాంగులకు ఎలాంటి షూరిటీ లేకుండా రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలనీ, వికలాంగుల శాఖను స్వతంత్రంగా ఉండేలా జీఓ విడుదల చేయాలన్నారు. వికలాంగులకు రేషన్ కార్డు లేకపోయినా వికలాంగుల సర్టిఫికెట్, ఆధార్, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల రీత్యా పెన్షన్ రూ.6వేలకు పెంచే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.మల్లేశ్, పి.శ్రీనివాస్, జి.నర్సింహ, జి.రాజరమణ్, కృష్ణ, అంబిక, నాగమణి, విశ్వనాథం, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు ప్రభాకర్ కన్నుమూత

నవతెలంగాణ-కంటోన్మెంట్



తెలంగాణ తొలి మలి దశ ఉద్యమకారుడు, కంటోన్మెంట్ బోర్డు మూడో వార్డు మాజీ సభ్యుల బి.ప్రభాకర్ శుక్రవారం చనిపోయారు. ఈనెల 17వ తేదీన అనారోగ్యానికి గురైన ఆయన కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం కన్నుమూశారు. 17వ తేదీన తన నివాసంలో భోజనం చేస్తుండగా ఆకస్మికంగా ముక్కులో నుంచి రక్తం రావడంతో కుటుంబ సభ్యులు కిమ్స్ ఆస్పత్రికి తరలించారు వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. ప్రభాకర్ సభ్యునిగా కొంతకాలమే ఉన్నప్పటికీ అనేక అభివృద్ధి పనులు చేయించారు. ఆయన సతీమణి అనిత ఆరేండ్లు సభ్యురాలుగా ఉండి వార్డులో ఎనలేని అభివృద్ధి పనులు చేశారు. ప్రభాకర్ ప్రజాభిమానం పొందిన వ్యక్తి. ఆయన మరణ వార్త తెలుసుకుని వార్డులోని ప్రజలు, అభిమానులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభాకర్ లాంటి ఉద్యమకారుడిని కోల్పోటం టీఆర్ఎస్‌కు తీరని లోటు అని కార్యకర్తలు మాజీ సభ్యులు చెబుతున్నారు. ప్రభాకర్ మరణ వార్త విని మాజీ సభ్యులు పాండుయాదవ్, శ్యామ్‌కుమార్ నలిని లోకనాథంతోపాటు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అక్కడే ఉండి పరిచారికలు చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభాకర్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, ఏఈ స్రవంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా అన్ని కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేసినట్టు తెలిపారు. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, స్థానిక నాయకులు పైళ్ల ప్రవీణ్, బేతాళ మల్లేష్, సురేష్ పాల్, ఉమేష్, హరి, నారాయణ, రఘు, సాగర్, సంతోష్ పాల్గొన్నారు.

25న మెడికల్ క్యాంపు

నవతెలంగాణ-కాప్రా

జన విజ్ఞాన వేదిక కాప్రా, మల్కాజిగిరి, కీసర మండల కమిటీల ఆధ్వర్యంలో బీపీ, షుగర్ పేషెంట్స్ కోసం మెడికల్ క్యాంపును శ్రీ చక్రి విద్యానికేతన్ హై స్కూల్ చక్రిపురం క్రాస్ రోడ్డులో ఈ నెల 25వ తారీకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్నట్టు జన విజ్ఞాన వేదిక కాప్రా మండల కార్యదర్శ సీహెచ్ ప్రభాకర్, ఉపాధ్యక్షులు జన్నిషా షేక్ తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో బీపీ, షుగర్ పేషెంట్స్‌కి పరీక్షలు నిర్వహించి డాక్టర్ల సూచనల మేరకు మందులను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని చక్రిపురం, కుషాయిగూడ, చర్లపల్లి, నాగారం, దమ్మాయిగూడ, రాంపల్లి తదితర ప్రాంతాల వారు ఉపయోగించుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 9989925997, 9700616679, 9959536083 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం : సతీష్‌కుమార్



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు శ్రీపతి సతీష్ కుమార్ తెలిపారు. ఏఎస్ రావు నగర్ డివిజన్‌కు చెందిన దూడల సాంబమూర్తి గౌడ్‌ను బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండోసారి నియమించారు. శుక్రవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో నే తెలంగాణ అభివృద్ధి సాధించిందనీ, మరింత అభివృద్ధి సాధించేందుకు టీడీపీని గెలిపించుకుందామన్నారు. టీడీపీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టినందుకు పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు శ్రీపతి సతీష్ కుమార్, మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షుడు కందికంటి అశోక్ కుమార్ గౌడ్, టీజీకే మూర్తికి సాంబమూర్తి గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.



రంగారెడ్డి జిల్లా డిఫెన్స్ కౌన్సిల్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి జిల్లా డిఫెన్స్ కౌన్సిల్‌ని ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి హరే కృష్ణ భూపతి ప్రారంభించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డీకొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ బుయాన్, జస్టిస్ పి.నవీన్‌రావు తెలంగాణ, రాష్ట్రంలోని 17 జిల్లాలకు జిల్లా న్యాయ సహాయ వాదిని, ఆ తర్వాత మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోసం జిల్లా న్యాయ సహాయ రక్షణ వ్యవస్థను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మల్కాజిగిరి జిల్లా అండ్ సెషన్ న్యాయమూర్తి బీఆర్ మధుసూదన్, పీఆర్ఎల్ సీనియర్ సివిల్ జడ్జి కం డీఎల్ఎస్ఏ కార్యదర్శి కిరణ్‌కుమార్, మల్కాజిగిరి బార్ అసోసియేషన్ జిల్లా కోర్టుల సముదాయం అధ్యక్షులు కోట రాంచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రాజు చేతుల మీదుగా మాన్యువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

25న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ మీర్‌పేట హెచ్‌బీ కాలనీ కౌండిన్య గౌడ సంక్షేమ సంఘం సభ్యుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌బీ కాలనీ మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన తొలి తెలుగు బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 25వ తేదీన రాష్ట్ర అబ్కారీశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, ఇతర నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విగ్రహ కమిటీ చైర్మన్ ముత్యం వెంకన్న గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పోదుపునూరి మల్లేష్‌గౌడ్, కృష్ణగౌడ్, దూసరి అశోక్ గౌడ్, మురహరి గౌడ్, బాలయ్య గౌడ్, సాయిలు గౌడ్, సురేష్ గౌడ్, హనుమాన్ దాస్ గౌడ్, వెంకటయ్య గౌడ్, దాసు గౌడ్, లక్ష్మి నారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

6,290 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఈనెల 27వ తేదీన జరగనున్న తన జన్మదినాన్ని పురస్కరించుకుని "గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ముమ్మరంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు కంటోన్మెంట్‌లోని మొత్తం 31 ప్రభుత్వ పాఠశాల ల్లో చదువుతున్న 6,293 మంది విద్యార్థులకు నోట్ పుస్త కాలను పంపిణీ చేశారు. శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలోని పలు ఉన్నత ప్రాథమిక ప్రభుత్వ విద్యాల యాల్లో పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు చదువు ఒక పేదరికం అడ్డు రాకుండా ఉండాలని తన వంతుగా ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోని,



రఘు, సాయి కిరణ్, రాజేష్, రాహుల్, యూనిస్, పరమేశ్, వంశి, సమ్ము తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీలో పూడిక తొలగించి సమస్యకు పరిష్కారం చూపండి



నవతెలంగాణ-నాచారం

నాచారం డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్ కమ్యూనిటీ హాల్ వద్ద కొద్ది రోజులుగా డ్రయినేజీ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించిన ఆమె డ్రయినేజీలో జామైన పూడికను తొలగించి మురుగునీరు బయటికి ప్రవహించకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కాలనీవాసులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రోజుల తరబడి డ్రయినేజీ పొంగిపొర్లడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే డ్రయినేజీలో పేరుకుపోయిన మురుగును తొలగించి నీళ్లు సాఫీగా కిందికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ లింగారావు, సివరేజ్ సూపర్వైజర్ రాకేష్, సాయినగర్ కాలనీ వెల్ఫేర్ ప్రతినిధులు శ్రీనివాస్, మల్లేష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

యువతి సెల్ఫీ వీడియో సూసైడ్ సంచలనం



నవతెలంగాణ-నాచారం

భర్త అత్తమామల వేధింపులు తాళలేక తన ఫేస్‌బుక్ లైవ్ పెట్టి సెల్ఫీ సూసైడ్ ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం నాచారం శాంతి గార్డెన్‌లో నివాసం ఉంటున్న సన ప్రేమించిన భర్త హేమంత్ పాటియాలా ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ద్యోగులు. రాజస్థాన్ ఉద్యోగం చేస్తున్న క్రమంలో సన, హేమంత్ మధ్య తరచూ గొడవలు జరిగేవి. ప్రస్తుతం నాచారం శాంతి గార్డెన్‌లో అత్త కిరణ్ పాటియాలా, మామ యుద్ధ వీర్‌సింగ్ వద్ద ఉంటున్న సనాను నిత్యం వేధింపులకు గురి చేయడంతో మనస్తాపానికి గురైన ఆమె సూసైడ్ చేసుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. కట్టుకున్న భర్త, అత్త, మామ కలిసి సనాని మానసికంగా ఇబ్బంది పెట్టడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని సన తండ్రి హర్షద్ నాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నాచారం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఘనంగా నాగేష్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవ తెలంగాణ-అంబర్‌పేట

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.నాగేష్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రోడ్డు నెం.6 బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ అంబర్‌పేట ఇన్ చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, రాష్ట్ర మహిళా నాయకురాలు దేవిరెడ్డి విజితరెడ్డి , సులోచన రెడ్డి, జీవన్ గౌడ్, బీవీ రమణ, కోట్ల రాము, జనార్దన్, చందర్‌చారీ, జెడీ రాహుల్, దిలీప్ కుమార్ నేత, శంకర్ గంగపుత్ర, ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఓయూ పాలకమండలి పదవీ కాలం(ఈసీ)

- నూతన సభ్యులను నియమించాలని ఆదేశాలు
- గడువు ముగిసిన సభ్యులతోనే ఓయూలో రెండు సమావేశాలు
- కొత్త కమిటీ వచ్చే వరకు పాత ఈసీతోనే, ఓయూ రిజిస్ట్రార్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం పాలక మండలిసభ్యుల(ఈసీ), పదవీ కాలం ఈ సంవత్సరం ఫిబ్రవరి 23 నాటితో ముగిసింది. నాడు 2020, ఫిబ్రవరి 23న, నాటి పాలక మండలి ని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెల్సిందే. దీనితో ఈ ఫిబ్రవరి 23 తో, ప్రస్తుత ఓయూ పాలక మండలి సభ్యుల పదవీ కాలం ముగిసింది.సభ్యుల పేర్లు పంపండి ఉన్నత విద్యామండలి ఆదేశాలు. పాలక మండలి రెండు రకాల సభ్యులు ఉంటారు. వీరిలో క్లాస్-1 క్రింద సెక్రటరీ హైయ్యర్ ఎడ్యుకేషన్, సెకరేటరీ ఫైనాన్స్ ,కాలేజ్ యేట్ కమిషన్, వీరు ప్రస్తుతానికి ఈ ముగ్గురు ఎవరైతే ఆ పోస్టులో ఉన్నారోవారే సభ్యులుగా ఉంటారు ఇది ఆనవాయితీ. క్లాస్-2 దీనిలో వర్సిటీ కాలేజ్ నుండి ఒక సీనియర్ సీనియర్ ప్రొపెసర్, వర్సిటీ కాలేజ్ నుండి ఒక ప్రిన్సిపాల్ పై ఇద్దరిని ఓయూ అధికారులు నియమిస్తు పేర్లు పంపాలి. ఇక ఒక అఫ్లియిడ్ కాలేజ్ నుండి ప్రిన్సిపల్, ఒక టీచర్, వీరితోపాటుగా విద్యారంగం, పబ్లిక్ లైఫ్, సోషల్ వర్క్, కామర్స్ లేదా బ్యాంకింగ్ రంగాలకు చెందిన వీరి నేమ్స్ కూడా ఓయూ సూచిస్తే ప్రభుత్వం పరిశీలిస్తుంది. రెండు క్లాస్‌లోని మొత్తం 9 మంది ఉంటారు. పై 9 మంది పేర్లు ఈ నెల 23 లోపు పేర్లు పంపాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇటివలే ఓయూకు ఆదేశాలు జారీ చేసింది. యూనివర్సిటీ ఈ పేర్లు పంపించారా ? లేదా ? అన్న విషయం తెలియాల్సి ఉంది ? పదవీ కాలం ముగిసిన సభ్యులతో రెండు సమావేశాలుంటాయి. పదవీ కాలం ముగిసిన సభ్యులతోనే మార్చి 14, జూన్ 1న, పాలక మండలి సమావేశాలు నిర్వహించడం శోచనీయం. ఇలా పదవీ కాలం ముగిసిన సభ్యులతో ఎలా సమావేశాలు నిర్వహిస్తారని అటు అధ్యాపకులు, విద్యార్థులు, విద్యా రంగానికి చెందిన నిపుణులు ప్రశ్నిస్తు న్నారు. మరొక వైపు ఈ రెండు ఈసీ సమావేశాల్లో తీసుకున్న అమోదించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలు,ఎంత వరకు అమలు అవుతాయా ? లేదా ? అన్న సందేహాలు సహితం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఓయూతో పాటుగా కాకతీయ, మహాత్మాగాంధీ, శాతవాహన, తెలం గాణ, పాలమూరు, యూనివర్సిటీల పాలక మండలి సభ్యుల పదవీ కాలం కూడా ఫిబ్రవరి 23తో ముగిసింది. ఒక తెలంగాణ మహిళ యూనివర్సిటీ ఇటీవలే నూతనంగా ఏర్పాటు అయిన విషయం తెల్సిందే. మరి ఈ యూనివర్సిటీ పరిధిలో ప్రస్తుతానికి ఏ కళాశాలాలు లేవు మరి ఈ యూనివర్సిటీ కి క్లాస్ 2 క్రింద 9 మంది సభ్యులను ఎలా ఎవర్ని నియమిస్తారో అన్నది ప్రశ్నర్థకంగా మారింది. ఓయూ యాక్ట్ ప్రకారం పాలక మండలి సభ్యుల పదవీ కాలం మాత్రం 3 సంవత్సరాలు మాత్రమే అని సమాచారం. ఇప్పుడు ఉన్న పాలక మండలి సభ్యుల అపాయింట్మెంట్‌లో ఉత్తర్వులలో వారి పదవీ కాలం ముగింపు డేట్ పొందు పరచలేదు. కొత్త పాలక మండలి వచ్చే వరకు వీరే కొనసాగుతారని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారాయణ అన్నారు.

అడ్డగుట్టలో 50 పడకల హాస్పిటల్ ఏర్పాటు చేయాలి

- నిర్మించే వరకూ పోరాటాలు
- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

అడ్డగుట్టలో 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అంజయ్య విగ్రహం ఎదుట శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అడ్డగుట్ట ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయ డంలో నియోజకవర్గ ఎమ్మెల్యే పద్మారావు పూర్తిగా నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. సుమారు 50వేల పైగా జనాభా ఉన్న అడ్డగుట్టలో ఆస్పత్రిని ఏర్పాటు చేయ కపోవడం సిగ్గుచేటైన విషయమని, నిత్యం అడ్డగుట్ట ప్రాం త ప్రజలు పొంగిపొర్లుతున్న డ్రైనేజీ, కలుషిత జలాలు, స్వైర విహారం చేస్తున్న దోమల బెడదతో వాంతులు విరేచనాలతో అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని అవస రాన్ని దృష్టిలో ఉంచు కొని తక్షణమే హాస్పటల్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించాలని అదే విధంగా హాస్పిటల్ కోసం కేటాయించిన స్థలంలో హాస్పటల్ ఏర్పాటు చేయక పోవడం వల్ల ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. హాస్పిటల్ ఏర్పాటు చేసేంత వరకు సిపిఐ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలను ప్రజా సంఘాలను కలుపుకొని హాస్పటల్ ఏర్పా టు అయ్యేంతవరకు దశల వారీగా పోరాటా లు కొనసాగు తాయని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్ర మంలో సీపీఐ సికింద్రాబాద్ సహాయ కార్యదర్శిలు ఉమరాన్, కొమరెల్లి బాబు, అడ్డగుట్టడివిజన్ కార్యదర్శి పాకాల యాదగిరి, రషీద్,ఖదీర్,గౌరీ నాగరాజ్, కాసిం, శంకరయ్య, బాలరాజ్, రమేష్, వెంకటయ్య,పాల్గొన్నారు.

తార్నాక డివిజన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

పాదచారులు సమీపంలోని రోడ్లను దాటడానికి, ట్రాఫిక్ నెమ్మదించకుండా పాదచారులు సురక్షితంగా దాటేందుకు వీలుగా రోడ్లకు అడ్డంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావు, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి అన్నారు. శుక్రవారం తార్నాక డివిజన్ పరిధిలో తార్నాక డివిజన్ సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద చింతామణి పార్శ్వనాథ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స ప్రవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో రెండు కోట్ల రూ.60 లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జీని డిప్యూటీ స్పీకర్ తిగుళ్ల పద్మారావు గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డిల చేతుల మీదుగా ప్రారంభించారు. నగరంలో నగర వాసులు, బాట చారుల సౌకర్యం కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జీ లు, అండర్ పాస్ రోడ్స్, ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ కార్పొరేటర్లు, హేమ శ్యామల, కంది శైలజ, రాసూరి సునీత, బీ ఆర్ ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడ మోతె శోభన్ రెడ్డి, యువ నాయకుడు, జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్‌పై వైద్య విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-బంజారాహిల్స్

యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్‌పై వైద్య విద్యార్థులకు పెంచేందుకు వర్క్ షాప్ వైద్య విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం ఎల్.వి.ప్రసాద్ ఐ.ఇనిస్టిట్యూట్ ప్రపంచ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు రోగుల భద్రతకు గణనీ యమైన ముప్పును కలిగిస్తున్న యాంటీమైక్రో బయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) యాంటీబయాటిక్స్ మందులకు స్పందించ కుండా వాటి సామర్థ్యాన్ని నిర్వీర్యం చేస్తూ,అంటువ్యాధుల చికిత్సను మరింత కష్టతరం చేస్తున్నదని దీనివలన ప్రపంచ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు, జాతీయ ఆర్థిక వ్యవస్థల, రోగుల భద్రతకు గణనీయమైన ముప్పు వాటిల్లుతున్నదన్నారు. దాని ఆవశ్యకతను గుర్తించి, ఎల్.వి.ప్రసాద్ ఐఇన్‌స్టిట్యూట్ (ఎల్‌వీపీ ఈఐ) సూపర్‌బగ్స్ ఎగైనెస్ట్ సూపర్‌హీరోస్ (ఎస్ఎఎస్-యానిమైక్రోబయల్ రెసి స్టెన్స్ పై అవగాహన పెంచడానికి అంకిత మైన కార్యక్రమం), సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎమ్ఎబి) ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడెమీ ఆఫ్ ఇండియా (ఐఎఫ్‌సీఎఐ) పెరుగుతున్న యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్ ఆటుపోట్లను ఎదుర్కోవటంపై రెండవ సంవత్సరం వైద్య విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఒక వర్క్ షాప్‌ను నిర్వహించింది. అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఉస్మానియా మెడికల్ కాలేజ్, ఎయిమ్స్ బీబీనగర్‌లతో సహా పలు వైద్య విద్యా సంస్థల నుంచి 85 మందికి పైగా వైద్య విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు.

బీసీబంధు ప్రకటించాలి : రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

బీసీ కులాలకు బీసీబంధు రూ.10 లక్షల ప్రతి కుటుంబానికి ఇవ్వాలని రాష్ట్ర జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్య క్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీసీలలో అన్ని కులస్తులకు లక్ష రూపా యలు కేటాయించాలని, అదేవిధంగా బీసీ బందు ప్రకటించి ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నీలం వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి



- నిజాం కళాశాల నాన్-టీచింగ్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ డిమాండ్
- ప్రిన్సిపాల్ ఛాంబర్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-హిమాయత్ నగర్

నిజాం కళాశాలలో పని చేస్తున్న నాన్-టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు గత 6నెలలుగా బకాయిపడ్డ తమ వేతనాలను వెంటనే చెల్లించాలని నిజాం కళాశాల నాన్-టీచింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కాంట్రాక్టు ఉద్యోగులు కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాన్-టీచింగ్ కాం ట్రాక్టు ఉద్యోగులు కుమార్, వినయ్, చేతన్, అరవింద్ తదితరులు మాట్లాడుతూ..ప్రతినెల నిర్ణీత తేదీలోగా తమకు వేతనాలు చెల్లించాలని కోరారు.గత ఆరు నెలల నుంచి జీతాలు చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ అస్తవ్యస్తమై తమ బ్రతుకులు అప్పుల పాల య్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు సకాలంలో చెల్లిస్తేగానీ తమకు జీవించే పరిస్థితి లేదని, తమ పరిస్థితులను అర్థం చేసుకుని, గత ఆరు నెలల నుంచి బకాయిపడ్డ జీతాలను చెల్లించాలని కళాశాల, యూనివర్సిటీ అధికారులను వారు కోరుతున్నారు. తమ సమస్యపై ఆరు రోజులుగా ప్రిన్సిపాల్ ఛాంబర్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కళా శాల ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు.ఇప్పటికైనా తమ వేతనాలను వెం టనే చెల్లించాలని, లేకపోతే ఉస్మానియా యూనివర్సిటీలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు గోపీ, రాకేష్, వెంకటేష్, దినకర్, కృష్ణ, నవీన్, శాంభవి, సహజ, హేమలత పాల్గొన్నారు.

'పటాన్ చెరువు వరకు మెట్రో రైల్ పొడిగిస్తామనడం హాస్యాస్పదం'

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టీ.నరసింహ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అధిక జనాభా కలిగిన హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న పాతనగరానికి మెట్రో రైల్ దిక్కులేదుకాని పఠాన్ చెరువు వరకు పొడిగిస్తామనడం సీఎం కేసీఆర్ ప్రకటించడం హాస్య స్పదంగా ఉందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఓల్డ్ సిటీ మార్గంలో ఇమ్లిబున్ నుండి ఫలక్‌నుమా కారిడార్ (గ్రీన్ లైన్) 5.5 కి.మీ మేర మెట్రో రైలును విస్తరించే ప్రణాళి కలను 2018లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ ప్రకటించి ఇప్పటి వరకు పనులను ప్రారం భించలేదని ఆయన విమర్శించారు. గతంలో పాత నగరానికి మెట్రో రైల్ పనులు చేపట్టాలని ఓల్డ్ సిటీ మెట్రో రైల్ జేఏసీ ప్రభుత్వానికి, హెచ్ఎంఆర్‌కు అనేక సార్లు విజ్ఞప్తి చేసిన నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో రైల్ కనెక్టివిటీ వస్తుందనే ఆశతో ఉన్న పాతబస్తీ వాసులు, ప్రతిరోజూ దూర ప్రాంతాలకు వెళ్లే వారికి మెట్రో రైల్ పెద్ద ఊరటనిస్తుందని, పాతబస్తీ అభివృద్ధికి ఇది దోహదప డుతుందని తెలిపారు.సీఎం కేసీఆర్ వివక్ష వైఖరి విడి, ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఓల్డ్ సిటీ మెట్రో రైల్ పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

37వ ఒలంపిక్ డే సందర్భంగా ఒలింపిక్ రన్



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

ప్రపంచ ఒలంపిక్ డే సందర్భంగా తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమం అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్ యాదవ్ ఆధ్వర్యంలో పరుగు నిర్వహించారు. శుక్రవారం చార్మినార్ నుండి ప్రారంభమైంది ఈ కార్యక్రమాన్ని పాతబస్తీలోని వివిధ మునిసిపల్ గ్రౌండ్ కోచుల పాఠశాలల పీఈటీలు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్ యాదవ్ కాగడాను వెలిగించి ఒలంపిక్ పరుగును ప్రారంభించాడు. దాదాపు 800 మంది వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఒలంపిక్ పరుగు లో పాల్గొన్నారు. ఏడు గంటలకు ప్రారం భ మైన ఈ ఒలంపిక్ పరుగు చార్మినార్ నుండి మదీనా హ్యాబిట్స్ అఫ్జల్గంజ్ నుండి లాల్ బహదూర్ స్టేడియానికి చేరుకుం ది. ఈ కార్యక్రమంలో భరత్ కుమార్ ప్రముఖ పరిశ్రమ కవిత. ఇమ్మానియేల్ ఆత్యాపాతియా కోచ్ ముఖేష్ ఇమ్మానియేల్ ఆదరణ మహేష్ సత్యనారాయణ బాక్సింగ్ కోచ్ శైలేంద్ర బాక్సర్ కృష్ణ పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కారాదు

వి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలనే ఆశయంతో చదువుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థుల ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాకూడదని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు, నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాంనగర్ డివిజన్ పరిధిలోని బాగ్‌లింగంపల్లి మైనారిటీ గురుకుల పాఠశాలలో పదవ తరగతిలో 9.8 ర్యాంకు సాధించిన సమీరా, అసియా లకు నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ అధ్య క్షులు సమతా రెడ్డి, ఉపాధ్యక్షులు నాయిని దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యనం దించా లనే గొప్ప సంకల్పంతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకుల విద్యా విధానాన్ని ప్రారంభి, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యన ందిస్తున్నారని తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 100% ఫలితాలు సాధించినం దుకు ఉపాధ్యాయులను అభినందించారు. మైనార్టీ గురు కుల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వాణిశ్రీ, ఫౌండేషన్ సభ్యులు రేషం మల్లేష్, నేత శ్రీనివాస్, కల్వ గోపి, బుజ్జి వెంకటేశ్వర్, ప్రభాకర్, సిరిగిరి శ్యామ్, సిరి గిరి కిరణ్, కార్తిక్ యాదవ్, కల్పన, సాలమ్మ ,రేఖ ,ఇందిరా, అనురాధ తదితరులు పాల్గొన్నారు

పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు

-ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్
-దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



నవతెలంగాణ-అడిక్ మెట్

ముషీరాబాద్ నియో జకవర్గంలోని దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో రౌడీషీటర్లుగా నమో దైన వ్యక్తులను కార్యకలా పా లపై దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పోలీస్ స్టేషన్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు కౌన్సిలింగ్ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ప్రస్తుత స్టేటస్ ఇటీవల కాలంలో వారిపై నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికార్యకలాపాలు ఏంటని విషయంపై ఆరా తీశారు. వారికి పలు సూచనలు చేశారు. సీఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లను గుర్తించామని, వారు నేర ప్రవృత్తి మానుకుని, సత్ప్రవర్తనతో మెలగడం మంచిదని హితవు పలికారు. గత పరిణామాలను మరిచిపోయి మంచి నడవడికతో జనజీవన స్రవంతిలో కలిసిపో వా లని సూచించారు. వివాదాలకు దూరంగా, బాధ్యతా యుతంగా ప్రవర్తించాలన్నారు. దౌర్జన్యాలు, నేరాలకు పాల్పడటం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా సహించేది లేదన్నారు. శాంతి భద్రత లకు విఘాతం కలిగించడం, కక్షలు, గొడవలకు దిగడం ద్వారా అశాంతి కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణ

ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-అడిక్‌మెట్

ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతూ దేశానికి ఆదర్శవంతంగా నిలుస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు విజయవంతమైన సందర్భంగా గాంధీ నగర్ లోని స్నేహిత రెస్టారెంట్ లో పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై మాట్లాడుతూ. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో ముందుంది అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు.దశాబ్ది ఉత్సవాలలో మన తెలంగాణ వైభోగాన్ని ప్రతి ఒక్కరికి వివరించి అన్ని రంగాలలో సంబరాలు జరుపుకునే విధంగా దశాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మహిళా సంక్షేమానికి వారి భరోసాకు తోడుగా నీడగా ఉన్నారని తెలిపారు. వారి రక్షణకు ప్రత్యేక షీ టీం ఏర్పాటు చేసి మహిళల్లో కొండంత భరోసా ఇచ్చా రన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జయసింహ, డివిజన్ ల అధ్యక్షులు రాకేష్ కుమార్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, వల్లాల శ్యామ్ యాదవ్, నర్సింగ్ ప్రసాద్, మోజెస్, లక్ష్మీ గణపతి దేవాలయ చైర్మన్ మచ్చుకుర్తి ప్రభాకర్, సీనియర్ నాయకులు పోతుల శ్రీకాంత్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, శంకర్ ముదిరాజ్, శ్రీధర్ రెడ్డి, పాల్గొన్నారు.



డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకల్లో బిజెపి అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు నాగభూషణ చారి, సీనియర్ నాయకులు బిక్ష పతి, గంధమాల ఆనం ద్ గౌడ్, శ్రావణ్ కుమారు, ఆర్ కృష్ణ ముదిరాజ్, హారతి, తిరుపతి గుప్తా, ఎమ్మెస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

రూ.రెండున్నర లక్షల ఎల్‌ఓసీ అందజేత : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరంలా మారిందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని దోభి గల్లీకి చెందిన కే.సంతోష్ కుమార్‌కి శుక్రవారం గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన రూ.2,50,000/- (2 లక్షల 50 వేలు) రూపాయల ఎల్‌వోసీని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాగ్ అంబర్ పేట డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, సీనియర్ నాయకులు ఆర్కే బాబు, రమేష్ నాయక్, కంచె మహేష్, గాజుల గోపాల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పై పాదయాత్ర : కార్పొరేటర్ జూపల్లి

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దీనబంధు కాలనీలో ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించిన స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ సమస్య, మంచినీటి సమస్యలు, సీసీ రోడ్లు వేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. దాదాపుగా దీన బంధు కాలనీలో అన్ని విధాల అభివృద్ధి పనులు చేపట్టామని దాదాపుగా పూర్తయ్యాయని, పెండింగ్ లో ఉన్న కొన్ని సమస్యలను అతి త్వరలో పూర్తి చేస్తామని, డ్రైనేజీ కోసం నిధులు కేటాయించారని పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ శివ ప్రకాష్, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ సత్యనారాయణ, బస్తీ కమిటీ అధ్యక్షుడు ఎస్‌వి. శెట్టి, మహేష్, వెంకటయ్య, సదానంద ముదిరాజ్ ,రాజు పుత్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను, యూనిఫామ్ లను శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్ గౌడ్, త్యాగి, హెడ్మాస్టర్ రత్నకుమారితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముద్దాపురం మదన్ గౌడ్ మాట్లాడుతూ... చదువుంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది అన్నారు. పాత ఆలోచనలకు స్వస్తి చెప్పి కొత్త కోణంలో ఆలోచిస్తే విజయం తథ్యమన్నారు. తమ బంగారు భవిష్యత్తుకు తమే బాటలు వేసుకోవాలన్నారు. తమ తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేయాలన్నారు. పాఠశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రమశక్తి అవార్డు గ్రహీత కే సుభాష్, కే రాంబాబు, డి కిరణ్ కుమార్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్‌దే

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-శామీర్‌పేట



వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ పార్టీదేనని అందరూ సమన్వయంతో పని చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటించారు. లక్ష్మాపూర్ లో అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన కుమ్మరి ఎల్లవ్వకు గతంలో లక్ష్మాపూర్ గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమం సందర్భంగా రోడ్డు విస్తరణ లో అన్యాయానికి గురైన ఆమె ఇంటిని పరిశీలించి తాను ఇల్లు నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ కో ఆర్డినెటర్లు నిర్మించిన ఇల్లు గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా రేవంత్ రెడ్డి హాజరై ప్రారంభించారు. అంతకుముందు గ్రామ ప్రధాన కూడలిలో బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శామీర్‌పేట మండలం తుంకుంట మున్సిపల్ కేంద్రంలోని జర్నలిస్టుల కార్యాలయాన్ని సందర్శించి విలేకర్లతో మాట్లాడారు. అక్కడి నుండి మున్సిపల్ కేంద్రంలోని మొగుళ్ల వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో తుంకుంట మున్సిపల్ కేంద్రానికి చెందిన తెలంగాణ మలిదశఉద్యమకారులు చిర్రబోయిన రామచందర్ యాదవ్ తన అనుచరులతో కలిసి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రేవంత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి , టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర జంగయ్య యాదవ్, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్, నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీల, కార్పొరేషన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు

26న మేడ్చల్ కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి



- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ రాథోడ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ఈనెల 26న తలపెట్టిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ పిలుపునిచ్చారు. మొత్తం 12 డిమాండ్లతో కలెక్టరేట్ ముట్టడి చేపడుతున్నామని తెలిపారు. వీటిలో కార్పొరేట్ ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, పెండింగ్ పాఠ్యపుస్తకాలను తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్ అందించాలని, ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మధ్యాహ్న భోజనానికి అధిక నిధులు కేటాయించాలని, అన్ని ప్రభుత్వ బడులను మన ఊరు-మన బడి పథకం కింద చేర్చాలని కోరారు. బీసీ వసతి గృహ ప్రవేశాలకు ఆన్‌లైన్ పద్ధతిని రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. మేడ్చల్ జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, జిల్లాలో ఉన్న గురుకుల అద్దె భవనాన్ని తొలగించి సొంత భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. మన ఊరు-మన బడి స్కీమ్ కింద ప్రతి ఒక్క పాఠశాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేద బడుగు బలహీన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం.కిరణ్, మౌలానా, శివ, శ్రీనివాస్, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పేద ప్రజలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- ప్రజా సంఘాల డిమాండ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ బస్తీలో, తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో, ఇంటింటికి వెళ్లి బస్తీలో ఉన్నటువంటి పేద ప్రజలందరికీ డబుల్ బెడ్ రూమ్ అప్లై చేసుకున్న వారందరికీ వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని నినాదాలు చేస్తూ ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల జిల్లా నాయ కులు ఏం శంకర్, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు ఏ. రంగారెడ్డి, సీఐటీయు నాయకులు ధర్మారావు, ఐద్వా నాయ కురాలు నరసమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచిన పేదవాడికి సొంత ఇల్లు లేకపోవడం పేద ప్రజల పట్ల పాలకుల చిత్తశుద్ధి ఏమిటో స్పష్టమవుతుందనీ అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభు త్వం తెలంగాణ రాష్ట్రానికి ఒక ఇల్లు కూడా మంజూరు చేయలేదనీ, ఇల్లులేని పేదలకు ఇంటి నిర్మాణానికి 10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబా ద్ శివారు ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి సంవత్సరాలు గడుస్తున్న పేదలకు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు రావడంలేదన్నారు. మేడ్చల్ జిల్లాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో 50 శాతం జిల్లా వాసులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సొంత ఇంటి స్థలం ఉన్న వాళ్లకు ఇల్లు కట్టుకోవడానికి మూడు లక్షల ఆర్థిక సాయం చేస్తామని గృహలక్ష్మి పథకాన్ని ప్రకటించారు. ఆ మూడు లక్షలు సరిపోవని రూ.5 లక్షలు ఇవ్వాలని అన్నారు. ఇంటి స్థలం లేని పేదలకు స్థలం కేటాయించి నిర్మాణం చేసుకోవ డానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, జీవో నెంబర్ 58, 59 ప్రకారం ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేద లందరికీ క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. అలాగే బీసీ రుణాలు, దళిత బంధు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై 26వ తారీ ఖున కూకట్‌పల్లి మండల ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం ఉంటుందని, ధర్నా కార్యక్రమంలో ప్రజల ందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిరణ్ ,విజయలక్ష్మి, భారతమ్మ, మహేశ్వరి, కాశీం, బాలరాజ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ నాలా మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలి



- కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఇబ్బందులు పడకుండా ఓపెన్ నాలా పనులు త్వరగా పూర్తి చేయాలని రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ శేఖర్‌గౌడ్ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్ ప్రాంతంలో జీహెచ్ ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న నాలా కల్వర్టు మట్టితో నిండి చిన్నపాటి, పెద్ద వర్షం రావడంతో నిత్యం వర్షపు నీరు రోడ్లపై ఫీటున్నర లోతులో ప్రవహిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు, స్థానిక హౌసింగ్, బిల్డింగ్స్ సొసైటీ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య దృష్టికి తీసుకు వచ్చారు. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్న కారణంగా కిలోమీటర్ పొడవు ఒపెన నాలా మరమ్మత్తు పనులు, కాలనీలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించాలని స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బి. విజయ్ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. ఓపెన్ నాలాను సంపూర్ణంగా శుద్ధి చేయాలని, నాలాలో మట్టి, చెత్త, చెదారం, చేరకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, డిఈ. భాను చందర్, ఏఈ. స్వాతి, జలమండలి మేనేజర్ పూజిత, డివిజన్ నాయకులు, సీనియర్ నాయకులు, మహిళ నాయకురాళ్ళు, కార్యకర్తలు కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం కృషి



- ఎమ్మెల్యే కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్‌లో వలు అభివృద్ధి కార్యక్రమాలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ శుక్రవారం స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌తో కలసి రూ.85 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, యోగ భవనం, దీన్ దయాల్ నగర్ వద్ద స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ పాలనలో కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలు, పట్టణాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. పురపాలక మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతో, శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు నేతృత్వంలో ఫతేనగర్ డివిజన్ అభివృద్ధి శరవేగంగా సాగుతుందన్నారు. మరింత అభివృద్ధి దిశగా పయనించాలంటే ఎమ్మెల్యే మాధ వరం కృష్ణారావును ప్రతి ఒక్కరూ బలపర్చాలని కోరారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయడం అభినందనీ యమని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు కంచి బిక్షపతి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, కృష్ణారెడ్డి, బిక్షపతి నేత, వేణు, సురేష్ నాయుడు, పవన్ రెడ్డి, సాంబ శివారెడ్డి, కాసు మహేందర్, రాజ్ కుమార్, సాగర్, పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ కార్మికుల కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పాలకవర్గం విఫలం చెందిందని అనేక మార్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దృష్టికి తీసుకువెళ్లిన ఇప్పటివరకు చిత్తశుద్ధి కనపరచడం లేదని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీఐటీయు అధ్యక్షుడు జి. వెంకటరాజం తెలిపారు. శుక్రవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో 100 మంది మున్సిపల్ కార్మికులతో నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు వెంకటరాజం మాట్లాడుతూ.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆవిర్భావం చెందితే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించబడి అభివృద్ధి చెందుతారని ఆశించిన కార్మికు లకు సమస్యలు తీరక నిరాశే ఎదురవుతుందన్నారు. మే డే సందర్భంగా ముఖ్యమంత్రి పారిశుధ్య కార్మికులకు తీపి కబురు చెబుతారని1000 రూపాయల వేతనం పెంచారని, పెంచిన వేతనం కేవలం పారిశుధ్య కార్మికులకేనని ప్లంబర్, వాటర్ మెన్ కార్మికులకు లేదని, అందరికీ వర్తింప చేయాలని తెలిపారు. కార్మికులకు ప్రతి నెల 5వ తారీకు వరకు రావలసిన జీతాలు 25 వరకు కూ డా రావడం లేదని, ఇప్పటికైనా కార్మికుల ఖాతాలోకి నేరుగా వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఆదివారం కార్మికులకు వారాంతపు సెలవు ఇవ్వాలని, అలాగే గతంలో కార్మికులకు నెలనెలా ఎంతో నాణ్యత పరంగా ఇచ్చేవారని, కార్పొరేషన్ అయ్యాక ఇప్పుడు నాణ్యత లేని ముక్కిన నూనెలు, సబ్బులు, బట్టలు, రిఫ్లెక్షన్ జాకెట్‌తో సహా అన్ని నాణ్య త లేనివి కార్మికులకు ఇస్తున్న వైనం. ఈ నాణ్యత లేని వస్తువులు మాకు వద్దే వద్దంటూ తీసుకోకుండా భీష్మించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుగుణ, మనీ, లింగమ్మ, నాగశేషు, లక్ష్మి, నరసింహ, తిరుపతయ్య, గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రహిత, మెరుగైన రవాణా సౌకర్యం కోసం కృషి

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



ప్రజలకు ట్రాఫిక్ రహిత, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు అన్నారు. డివిజన్ పరిధిలోని జేఎన్టీయూ ప్రధాన రహదారి నుండి అడ్డగుట్ట, సమతా నగర్ మీదుగా ప్రగతి నగర్ రోడ్డుకు వెళ్లే కూడలి (వినాయక జ్యువెల్లర్స్) వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారనికై ట్రాఫిక్ సీఐ నరసింహ రావుతో కలిసి నిత్యం వాహనాల ట్రాఫిక్ నియంత్రణకై చేపట్టవలసిన చర్యలను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ.. జేఎన్టీయూ ప్రధాన రహదారి నుండి అడ్డగుట్ట, సమతా నగర్ మీదుగా ప్రగతి నగర్ రోడ్డుకు వెళ్లే వాహనదారులకు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు. ట్రాఫిక్ సమ స్య పరిష్కారానికై దానిలో భాగంగా తీసుకోవాల్సిన చర్యల పై అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకో వాల్సిన చర్యలపై చర్చించారు. ట్రాఫిక్ సమస్య నివారణకై నాణ్యమైన, మన్నిక గల రోడ్లను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ నవీన్ కుమార్, ట్రాఫిక్ అధికారులు, డివిజన్ గౌరవ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్నిఅన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతాం



- ప్రభుత్వ విప్ ఆరికేపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని, వివేకానంద నగర్ కాలనీ, ఈనాడు కాలనీ, వివేకానంద నగర్ అపార్ట్మెంట్స్, మాధవరం కాలనీ, వెంకటేశ్వర నగర్ కాలనీలలో రూ. 2 కోట్ల 91లక్షల అంచనావ్యయంతో, చెపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ మాధవరం రంగరావుతో కలిసి, ప్రభుత్వవిప్ గాంధీ, ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి, ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకంలో, మంత్రివర్యులు కేటిఆర్, సహకారంతో,శేరిలింగంపల్లి నియోకజకంగంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు. అదేవిధంగా వివేకానంద నగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాల సంతోషకరం అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని ,సీసీ రోడ్లు, బిటి రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ గాంధీ తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు ,నాయి నేని చంద్రకాంత్ రావు,రాంచందర్, హరినాథ్ ఆంజనేయులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మేడ్చల్ జాతీయ రహదారిపై వ్రాహనాల తనిఖీలు



ట్రాఫిక్ సీఐ నర్సింహ రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

ప్రమాదాలు జరిగినప్పుడు లారీలకు గాని,ఇతర వాహనాలకు గాని అదనపు ఫిటింగ్ ఉండి వాహనం నెంబ ర్ ప్లేట్లు గుర్తించలేకపోతున్నామని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ నర్సింహ రెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి 44 పై లారీలు ఇతర వాహనాలను తనిఖీలు చేసి నంబర్ ప్లేట్ కు అడ్డంగా ఉన్న ఎలక్ట్రానిక్ ఫిటింగ్‌ను గ్యాస్ వెల్డింగ్ సహాయంతో తమ సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనానికి నెంబర్ ప్లేట్ కనపడకపోవడం ద్వారా ఎన్నో నష్టాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఉద్దేశపూ ర్వకం గా నంబర్ ప్లేట్ కనిపించకుండా చేసినట్లయితే వాహన యజమాని పై మోటర్ వెహికల్ యాక్ట్ 179(2) రూ.2వేల వరకు జరిమానా లేదా నెల రోజుల జైలు శిక్ష పడే అవకాశం ఉందని ట్రాఫిక్ సీఐ తెలిపారు. వాహనదారులు రోడ్డు ఎక్కేముందు తమ వాహనానికి ముందు వెనుక నెంబర్ ప్లేట్ సరిగ్గా ఉంచుకొని రోడ్డు ఎక్కాలని ట్రాఫిక్ సీఐ నర్సింహ రెడ్డి సూచించారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని శుక్రవారం శంభీపూర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు, సభ్యులుపాల్గొన్నారు.

నవలంగాణ-దుండిగల్



ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించిన నేపథ్యంలో జూన్ 2 నుండి 22 వరకు కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో ఉత్సవాలు విజయవంతం చేసినందుకు శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానందుని కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఉద్యమకారులు తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

శాంసన్‌కు పిలుపు

- రుతురాజ్, ముకేశ్‌లకు సైతం
- విండీస్‌తో వన్డేలకు భారత జట్టు

ముంబయి : సంజు శాంసన్ భారత వన్డే జట్టుకు ఎంపికయ్యాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు సారథ్యం వహిస్తున్న సంజు శాంసన్‌కు జాతీయ జట్టు తరఫున న్యాయమైన అవకాశాలు లభించలేదనే విమర్శ ఎక్కువగా వినిపిస్తోంది. స్వదేశంలో ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ నేపథ్యంలో బిగ్ హిట్టర్ సంజు శాంసన్‌కు సీనియర్ సెలక్షన్ కమిటీ జట్టులో చోటు కల్పించింది. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో భేటీ అయిన సీనియర్ సెలక్షన్ కమిటీ విండీస్ పర్యటనలో మూడు వన్డేలకు జట్టును ఎంపిక చేసింది. విండీస్‌తో టీమ్ ఇండియా ఐదు టీ20లు సైతం ఆడాల్సి ఉంది. పొట్టి ఫార్మాట్‌కు జట్టును తర్వాత ప్రకటిస్తామని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. భారత్, విండీస్ తొలి వన్డే జులై 27న క్వీన్స్ పార్క్ ఓవల్‌లో, చివరి వన్డే ఆగస్టు 1న బ్రియాన్ లారా క్రికెట్ అకాడమీలో జరుగనున్నాయి.



రుతురాజ్‌కూ చోటు : యువ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌తో పాటు సంజు శాంసన్ వన్డే జట్టులోకి వచ్చాడు. రిషబ్ పంత్ ఫిట్‌నెస్ సాధించి సెలక్షన్‌కు అందుబాటులో ఉంటే.. ఈ ఇద్దరిలో ఒకరు త్యాగానికి సిద్ధం కావాల్సిందే. దీంతో విండీస్ టూర్‌లో ఉత్తమ ప్రదర్శన చేసేందుకు ఇటు కిషన్, అటు శాంసన్ సిద్ధమవుతున్నారు. టాప్ ఆర్డర్ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్, పేసర్ ముకేశ్ కుమార్ సైతం వన్డేలో చోటు దక్కించుకున్నారు. రోహిత్ సారథ్యంలో.. హార్దిక్ పాండ్య వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో మూడు సార్లు సున్నా పరుగులకే నిష్క్రమించిన సూర్యకుమార్ యాదవ్ జట్టులో చోటు నిలుపుకున్నాడు. వాషింగ్టన్ సుందర్ జట్టులో చోటు కోల్పోగా.. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌కు తోడు కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్‌లు జట్టులో నిలిచారు. మహ్మద్ సిరాజ్, ఉమ్రాన్ మాలిక్, జైదేవ్ ఉనద్కత్, ముకేశ్ కుమార్‌లు పేస్ విభాగంలో ఉన్నారు.

భారత వన్డే జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య (వైస్ కెప్టెన్), శార్దుల్ ఠాకూర్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, యుజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్, జైదేవ్ ఉనద్కత్, మహ్మద్ సిరాజ్, ఉమ్రాన్ మాలిక్, ముకేశ్ కుమార్.

పుజారాపై వేటు



- యశస్వి జైస్వాల్‌కు పిలుపు
- రహానెకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు
- విండీస్‌తో టెస్టులకు భారత జట్టు ఎంపిక

సీనియర్ సెలక్షన్ కమిటీ ఎట్టకేలకు ఓ పెద్ద నిర్ణయం తీసుకుంది!. కొంతకాలంగా పేలవ ప్రదర్శన చేస్తున్న చతేశ్వర్ పుజారాకు ఉద్వాసన పలికింది. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్లో తేలిపోయిన పుజారాను సెలక్షన్ కమిటీ టెస్టు జట్టు నుంచి తప్పించింది. అతడి స్థానంలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌కు జట్టులో చోటు కల్పించింది. కరీబియన్లతో భారత్ రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది.

నవతెలంగాణ-ముంబయి

2025 ఐసీసీ డబ్ల్యూటీసీ వేటను టీమ్ ఇండియా భిన్నంగా మొదలుపెట్టనుంది. మరో రెండేండ్ల తర్వాత టెస్టు చాంపియన్‌షిప్ మెగా పోరు ఉండటంతో.. భవిష్యత్‌ను గమనంలో ఉంచుకుని టెస్టు జట్టుకు రూపకల్పన చేస్తోంది!. అందులో భాగంగానే ఫామ్ కోల్పోయి జట్టుకు భారమైన చతేశ్వర్ పుజారాను జట్టు నుంచి తప్పించింది. వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. జులై 12న భారత్, వెస్టిండీస్ తొలి టెస్టు డొమినికాలో ఆరంభం కానుండగా.. రెండో టెస్టు జులై 20 నుంచి పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో షెడ్యూల్ చేశారు. 2019 కరీబియన్ పర్యటనలో టెస్టు సిరీస్‌ను భారత్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. విండీస్ గడ్డపై వరుసగా గత నాలుగు టెస్టు సిరీస్ విజయాలు సాధించిన టీమ్ ఇండియా.. తాజాగా వరుసగా ఐదో టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకోవాలని చూస్తుంది. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్ సహా రిషబ్ పంత్ ఎన్‌సీఏలో రిహాబిలిటేషన్‌లో కొనసాగుతున్నారు. విండీస్ పర్యటనకు సెలక్షన్ కమిటీ ఈ ముగ్గురిని పరిగణనలోకి తీసుకోలేదు.

ముగ్గురికి పిలుపు : రుతురాజ్ గైక్వాడ్ గైర్హాజరీలో ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు స్టాండ్‌బై ఆటగాడిగా ఎంపికైన యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్.. తాజాగా టెస్టు జట్టులోకి వచ్చాడు. ఐపీఎల్, దేశవాళీ ఫస్ట్ క్లాస్ సీజన్లో నిలకడగా రాణిస్తున్న జైస్వాల్‌కు సెలక్షన్ కమిటీ తొలిసారి జాతీయ జట్టు పిలుపు అందించింది. యశస్వి జైస్వాల్‌తో పాటు రుతురాజ్ గైక్వాడ్, పేసర్ ముకేశ్ కుమార్‌లు టెస్టు జట్టుకు ఎంపికయ్యారు. స్టార్ పేసర్ మహ్మద్ షమికి విశ్రాంతి లభించగా.. ఉమేశ్ యాదవ్‌పై వేటు పడింది. ఉమేశ్ యాదవ్



స్థానంలో నవదీప్ సైని జట్టులో చోటు సాధించాడు. మహారాష్ట్ర తరఫున రుతురాజ్ 28 మ్యాచుల్లో ఎనిమిది సెంచరీలు బాదాడు. రుతురాజ్ బ్యాటింగ్ సగటు 42.19. ఇక యశస్వి జైస్వాల్ ముంబయి తరఫున 26 ఇన్నింగ్స్‌ల్లో 80.21 సగటుతో అదరగొట్టాడు. ఇటీవల ఇరానీ కప్‌లోనూ జైస్వాల్ 213, 144 ఇన్నింగ్స్‌లతో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఓపెనర్, నం.3 బ్యాటర్‌గా జైస్వాల్‌కు మంచి రికార్డుంది. పేసర్ ముకేశ్ కుమార్ బెంగాల్ తరఫున ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు. 39 ఫస్ట్ క్లాస్ మ్యాచుల్లో 149 వికెట్లు పడగొట్టాడు.

రహానెకు వైస్ కెప్టెన్సీ : ఈ ఏడాది ఫిబ్రవరిలో టెస్టు జట్టు నుంచి ఉద్వాసనకు గురైన అజింక్య రహానె ఐపీఎల్16లో అనూహ్యంగా కొత్త అవతారంలో అదరగొట్టాడు. ఐపీఎల్ మెరుపులతో ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆడే అవకాశం దక్కించుకున్న రహానె.. తాజాగా వెస్టిండీస్ టూర్‌లో వైస్ కెప్టెన్సీ బాధ్యతలు సైతం అందుకున్నాడు. ఇక చతేశ్వర్ పుజారాపై వేటుతో భారత జట్టు నం.3 స్థానంలో కొత్త బ్యాటర్‌ను చూడబోతుంది. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా రానుండగా.. యశస్వి జైస్వాల్ నం.3 స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం కనిపిస్తుంది. యశస్వి జైస్వాల్ జాతీయ జట్టు తరఫున అరంగ్రేటం కోసం ఎదురు చూస్తున్నాడు. మరోవైపు రుతురాజ్ వైట్‌బాల్ ఫార్మాట్‌లో అరంగ్రేటం చేయగా.. ముకేశ్ కుమార్ సైతం ఏ ఫార్మాట్‌లోనూ ఇంకా తొలి మ్యాచ్ ఆడలేదు.

పేస్ దళపతి సిరాజ్ : హైదరాబాద్ మియా భాయ్ మహ్మద్ సిరాజ్ భారత జట్టు నయా పేస్ దళపతి. బుమ్రా ఫిట్‌నెస్ సమస్యలతో దూరం కాగా, మహ్మద్ షమికి విశ్రాంతి లభించింది. దీంతో సెలక్షన్ కమిటీ మహ్మద్ సిరాజ్ సారథ్యంలోని పేస్ విభాగాన్ని ఎంచుకుంది. సిరాజ్ ముందుండి నడిపించనుండగా.. శార్దుల్ ఠాకూర్, నవదీప్ సైని, ముకేశ్ కుమార్, జైదేవ్ ఉనద్కత్‌లు అతడికి సహకారం అందించనున్నారు. స్పిన్, ఆల్‌రౌండర్ విభాగంలో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, అక్షర్ పటేల్ జట్టులో నిలిచారు. వికెట్ కీపర్లుగా తెలుగు తేజం శ్రీకర్ భరత్, ఇషాన్ కిషన్‌లు ఎంపికయ్యారు. రోహిత్, విరాట్‌లకు విశ్రాంతి లభిస్తుందని అంచనాలు ఏర్పడినా.. స్టార్ క్రికెటర్లు ఇద్దరూ కరీబియన్ టెస్టు సవాల్‌కు సిద్ధం కానున్నారు.

భారత టెస్టు జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, అజింక్య రహానె (వైస్ కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్, కె.ఎస్ భరత్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, శార్దుల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, ముకేశ్ కుమార్, జైదేవ్ ఉనద్కత్, నవదీప్ సైని.



టాలన్స్‌కు ఎదురుందా?

- గోల్డెన్ ఈగల్స్‌తో నేడు సెమీఫైనల్
- ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ 2023

జైపూర్ : ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్) తుది అంకానికి చేరుకుంది. ఆరు జట్లు పోటీపడిన అరంగ్రేట సీజన్ గ్రూపు దశ మ్యాచులు గురువారంతో ముగియగా.. నేడు సెమీఫైనల్స్‌తో అంతిమ ఘట్టానికి తెర లేవనుంది. గ్రూప్ దశలో ఏడు విజయాలతో తెలుగు టాలన్స్, మహారాష్ట్ర ఐరన్‌మెన్ అగ్రస్థానాల్లో నిలువగా.. రాజస్థాన్ పేట్రియాట్స్, గోల్డెన్ ఈగల్స్ యూపీ టాప్-4లో నిలిచి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. నేడు తొలి సెమీఫైనల్లో రాజస్థాన్ పేట్రియాట్స్‌తో మహారాష్ట్ర ఐరన్‌మెన్ తలపడనుంది. గ్రూప్ దశలో ఐరన్‌మెన్‌పై గెలుపొందిన జట్లలో రాజస్థాన్ పేట్రియాట్స్ ఒకటి. ఇక రెండో సెమీఫైనల్లో తెలుగు టాలన్స్‌తో గోల్డెన్ ఈగల్స్ ఉత్తర్‌ప్రదేశ్ తలపడనుంది. రాత్రి 7 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో మ్యాచులు ప్రసారం.

ఇక తెలుగు టాలన్స్ నేడు సెమీఫైనల్లో హాట్‌ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుంది. గోల్డెన్ ఈగల్స్ యూపీతో గ్రూప్ దశలో రెండు మ్యాచుల్లోనూ విజయాలు సాధించిన టాలన్స్ నేడు హ్యాట్రిక్‌పై కన్నేసింది. నసీబ్ సింగ్ (72), కైలాష్ పటేల్ (53), దేవిందర్ సింగ్ భుల్లార్ (52) అర్థ సెంచరీ గోల్స్‌తో తెలుగు టాలన్స్‌ను ముందుండి నడిపిస్తున్నారు. తెలుగు టాలన్స్ గోల్ కీపర్ రాహుల్ 150కి పైగా సేవ్‌లతో లీగ్‌లోనే విజయవంతమైన గోల్‌కీపర్‌గా కొనసాగుతున్నాడు. ఒత్తిడిలో రెట్టింపు ఉత్సాహంతో చెలరేగటం తెలుగు టాలన్స్ అదనపు బలం. గ్రూప్ దశలో ఎన్నో మ్యాచుల్లో వెనుకంజలో నిలిచినా.. వరుస గోల్స్ నమోదు చేసి ఆధిక్యమే కాదు విజయాలు నమోదు చేసింది. తెలుగు టాలన్స్‌ను నేడు సెమీఫైనల్లో గోల్డెన్ ఈగల్స్ యూపీ ఏ మేరకు నిలువరిస్తుందో చూడాలి.

కరాటే చాంప్స్ చరణ్య, జయంతి



హైదరాబాద్ : ఏపీ, తెలంగాణ ఐసిఎస్‌ఈ, ఐఎస్‌సి రీజినల్ జాతీయ కరాటే చాంపియన్‌షిప్స్‌లో చరణ్య, జయంతి విజేతలుగా నిలిచారు. కింగ్‌కోఠిలోని సెయింట్ జార్జ్ గర్ల్స్ గ్రామర్ స్కూల్‌లో జరిగిన అండర్-14 (26-30 కేజీలు) గర్ల్స్ ఫైనల్లో సాయి హర్షితపై పి. జయంతి 8-3తో గెలుపొందింది. 30-34 కేజీల విభాగంలో 2-0తో అంజలిపై విజయం సాధించిన చరణ్య టైటిల్ అందుకుంది. 34-38 కేజీల విభాగంలో మార్యమ్, 34-38 కేజీల విభాగంలో లీలా జేన్, 42-46 కేజీల విభాగంలో సిరి, ఓవర్ 50 కేజీల విభాగంలో స్వాతి విజేతలుగా నిలిచారు. విజేతలకు సెయింట్ జార్జ్ గర్ల్స్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ మార్లీన్ ఎస్తర్ బహుమతులు ప్రదానం చేశారు.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



హైదరాబాద్ : అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఒలింపిక్ డే రన్ ఉత్సాహభరితంగా సాగింది. హైదరాబాద్ వ్యాప్తంగా 15 కేంద్రాల నుంచి క్రీడాకారులు, విద్యార్థులు ఒలింపిక్ స్ఫూర్తి రన్‌తో ఎల్‌బి స్టేడియంకు చేరుకున్నారు. 15000 మందికి పైగా పాల్గొన్న ఒలింపిక్ డే రన్ ముగింపు వేడుక ఎల్బీ స్టేడియంలో జరిగింది. రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, తెలంగాణ ఒలింపిక్ సంఘం ఆఫీస్ బేరర్లు 15 కేంద్రాల నుంచి వచ్చిన ఒలింపిక్ జ్యోతిలను అందుకున్నారు. 'లెట్స్ రన్' నినాదంతో ప్రతి రోజు 30 నిమిషాల వ్యాయామంతో ఆరోగ్యం, ఆహ్లాదం సొంతం చేసుకోవాలని ఈ సందర్భంగా క్రీడాకారులు, విద్యార్థులకు సూచించారు.

ప్రణయ్ పరాజయం

తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్



తైపీ (చైనీస్ తైపీ) : తైపీ ఓపెన్ సూపర్ 300 టోర్నీలో భారత పోరాటానికి తెరపడింది. క్వార్టర్‌ఫైనల్స్‌కు ముందే భారత షట్లర్లు ఇంటిముఖం పట్టగా.. క్వార్టర్స్‌లో స్టార్ ఆటగాడు హెచ్.ఎస్ ప్రణయ్ పోరాటం ముగించాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ఐదో సీడ్, హాంగ్‌కాంగ్ ఆటగాడు లాంగ్ అంగాస్ 21-19, 21-8తో ప్రణయ్‌పై విజయం సాధించాడు. 38 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో మూడో సీడ్ ప్రణయ్ ఆశించిన ప్రదర్శన కనబరచలేదు. తొలి గేమ్ నువ్వా నేనా అన్నట్టు సాగగా.. 11-9తో విరామ సమయానికి హెచ్.ఎస్ ప్రణయ్ ఆధిక్యంలో నిలిచాడు. ద్వితీయార్థంలో ప్రతి పాయింట్ ఆధిక్యం మారుతూ సాగింది. 12-12తో స్కోరు సమం చేసిన అంగాస్.. ప్రణయ్‌ని వెంబడించాడు. 19-19 వద్ద ప్రణయ్‌ని వెనక్కి నెట్టి హాంగ్‌కాంగ్ షట్లర్ పైచేయి సాధించాడు. ఇక రెండో గేమ్‌లో ప్రణయ్ చేతులెత్తేశాడు. ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయాడు. 11-6తో విరామ సమయానికి ముందంజలో నిలిచిన అంగస్.. 21-8తో రెండో గేమ్‌ను, సెమీఫైనల్స్ బెర్త్‌ను సొంతం చేసుకున్నాడు.

నవచిత్రం




రామ్

నయా రిలీజ్ డేట్ ఎప్పుడంటే?

రామ్ పోతినేని హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రీకరణ ముగింపు దశకు చేరుకుంది. దసరా సందర్భంగా అక్టోబర్ 20న విడుదల చేయాలని మేకర్స్ తొలుత భావించారు. అయితే ఆ విడుదల తేదీకి ముందుగానే ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 15న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నట్టు మేకర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో రామ్ లుక్ అందర్నీ అలరిస్తోంది. ఇందులో శ్రీలీల రామ్ సరసన కథానాయికగా నటిస్తోంది.

రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ థండర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. భారీ అంచనాలతో ఈ సినిమా సెప్టెంబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాత: శ్రీనివాస చిట్టూరి, ప్రెజెంట్స్: జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్, సంగీతం: ఎస్‌ఎస్ తమన్, డివోపీ: సంతోష్ డిటాకే, ఎడిటింగ్: తమ్మిరాజు.

భిన్న కాన్సెప్ట్‌తో ఎస్కేప్



శ్రుతి పులారి

బాణాల క్రియేటీవ్ వర్క్స్ బ్యానర్ పై నిర్మించిన చిత్రం 'ఎస్కేప్'. ఈ సినిమా బెస్ట్ స్టోరీ, బెస్ట్ యాక్ట్రెస్, బెస్ట్ మూవీ, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్, బెస్ట్ కెమెరామెన్, బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్, బెస్ట్ ఫిమేల్ సింగర్ ఇలా దాదాపు 30 జాతీయ-అంతర్జాతీయ అవార్డులు గెలుచుకుంది.

ఈ సందర్భంగా మేకర్స్ సినిమా విశేషాలను షేర్ చేసుకోవడానికి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరోయిన్ శ్రుతి పులారి మాట్లాడుతూ,'మొదటి సినిమాకే ఇంత మంచి హీరోయిన్ పాత్ర రావడం, అందులోనూ సింగిల్ క్యారెక్టర్ మూవీ చేయటం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా 5 భాషల్లో విడుదల అవుతుంది. సినిమా విడుదలకు ముందే ఇలా ఎన్నో అవార్డులు గెలుచుకోవడం అద్భుతమైన విషయం' అని తెలిపారు.'ఈ సినిమాని కొత్త తరహ చిత్రీకరణ విధానంతో కేవలం పది రోజుల్లోనే చిత్రీకరణ పూర్తి చేశాం. ప్రస్తుతం ఈ చిత్రం చివరి దశ పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఇప్పటికే మాంగో మ్యూజిక్ ద్వారా ఈ చిత్రంలోని రెండు పాటలని విడుదల చేశాం. అవి ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తున్నాయి' అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గౌతమ్ కుమార్ పీ.ఏ అన్నారు.

నిర్మాత టి.రామసత్యనారాయణ మాట్లాడుతూ,'వైవిధ్యమైన కథతో దర్శకులు శ్రీధర్ బాణాల ఎంతో క్రియేటీవ్‌గా తెరకెక్కించారు' అని చెప్పారు. ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ ప్రజ్వల క్రిష్ ఒక పాటని అందించగా, మరో పాటని వెంకట్ ఐనాల అందించారు. బ్యాగ్రౌండ్ స్కోర్ జె. భాను ప్రసాద్ సమకూర్చారు.

కచ్చితంగా నాన్న పోలికే..



రామ్‌చరణ్, ఉపాసన

'ఏ తండ్రైనా తన బిడ్డను తొలిసారి తాకగానే ఎలాంటి అనుభూతి, ఆనందం కలుగుతుందో నాకూ అలాగే ఉంది. ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న తరుణం వచ్చింది. ఓ తండ్రికి ఇంతకన్నా ఆనందం ఏముంటుంది. ఆనందంలో మాటలు కూడా రావడం లేదు' అని హీరో రామ్‌చరణ్ అన్నారు.

రామ్ చరణ్, ఉపాసన దంపతులకు ఈనెల 20న పాప పుట్టిన సంగతి తెలిసిందే. పాప పుట్టిన మూడో రోజున హాస్పిటల్ నుంచి ఉపాసన డిశ్చార్జ్ అయిన నేపథ్యంలో మీడియాతో రామ్ చరణ్ మాట్లాడుతూ, "ఉపాసన, పాప రికవర్ కావటంతో హాస్పిటల్ నుంచి ఇంటికి వెళుతున్నాం. డాక్టర్ సుమన, డాక్టర్ రుమ, డాక్టర్ లత, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ అమితా ఇంద్రసేన, తేజస్విగారు సహా ఎంటైర్ అపోలో టీమ్‌కి థాంక్స్. చాలా బాగా చూశారు. అలాగే మా అభిమానుల ప్రార్థనలు, వాళ్లు చేసిన పూజలు గురించి ఎంత చెప్పినా తక్కువే. వాళ్లను ఎప్పటికీ మరచిపోలేను. మీరందరూ అందించిన బ్లెస్సింగ్స్ మా పాపకు ఎప్పుడూ ఉంటాయి. ఇంతకన్నా మధుర క్షణాలను మరచిపోలేను. ఈ అభిమానం మా పాపకు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. 21వ రోజు పాపకు పేరు పెడదామని అనుకుంటున్నాను. నేను, ఉపాసన ఇప్పటికే ఓ పేరు అనుకున్నాం. తప్పకుండా అది అందరికీ తెలియజేస్తాను. చాలా సంవత్సరాలుగా మేం ఎదురు చూస్తున్న మంచి తరుణమిది. పాప ఎవరి పోలిక అని అందరూ అడుగుతున్నారు.. ఇంకెవరు కచ్చితంగా నాన్న పోలికే (నవ్వుతూ)'. పాప రాకతో మాతోపాటు నాన్న(చిరంజీవి), అమ్మ అందరం చాలా సంతోషంగా ఉన్నాం. మీ ప్రేమ, అభిమానాలు ఎప్పటికీ ఉంటాయని ఆశిస్తున్నాను' అని చెప్పారు.

సర్కిల్.. సరికొత్త థ్రిల్లర్



రిచా పనై, సాయి రోనక్

దర్శకుడు నీలకంఠ తెరకెక్కిస్తున్న తాజా సినిమా 'సర్కిల్'. ఈ చిత్రంలో సాయి రోనక్, బాబా భాస్కర్, అర్షిణ్ మెహతా, రిచా పనై కీలక పాత్రల్లో నటించారు. ఆరా ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎమ్.వి శరత్ చంద్ర, టి సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించారు. సరికొత్త థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని జూలై 7న విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ఒక ఫొటోగ్రాఫర్ జీవితం చుట్టూ అల్లుకున్న కథతో ఈ సినిమా తెరకెక్కింది. తన జీవితంలో శత్రువులెవరో, మిత్రులెవరో తెలియని సందిగ్ధంలో హీరో ఏం చేశాడనేది ఆసక్తికరంగా చూపించబోతున్నారు దర్శకుడు నీలకంఠ. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన పాటలు, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. సినిమా కూడా ప్రేక్షకాదరణ పొందు తుందని చిత్రబృందం నమ్మకంగా చెబుతున్నారు.

యూనిక్‌గా ఉండే చిత్రం



చైతన్య రావ్, లావణ్య జంటగా నటించిన సినిమా "అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. మిహీరా, ఉత్తర, వైవా రాఘవ, లలిత్ ఆదిత్య ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని బిగ్ బెన్ సినిమాస్ పతాకంపై యష్ రంగినేని నిర్మించారు. చెందు ముద్దు దర్శకత్వం వహించిన ఈ సినిమా జూలై 21న విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను డైరెక్టర్ మారుతి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమాని చెందు 80, 90 బ్యాక్ డ్రాప్‌లో నేటివిటీ ఎక్కడా మిస్ కాకుండా యూనిక్‌గా తెరకెక్కించాడు. లావణ్య, చైతన్య ప్రామిసింగ్‌గా నటించారు. ఇలా క్రియేటివిటివ్‌గా, ప్యాషన్‌గా రూపొందించే చిత్రాలు చాలా తక్కువగా ఉంటాయి. టీజర్ చూస్తే ఇదొక క్వాలిటీ ఫిల్మ్ అనిపిస్తోంది. సినిమా సక్సెస్ కావాలని కోరుకుంటున్నా' అని తెలిపారు. 'టీజర్‌తో మా సినిమా ఎలా ఉండబోతుందో అర్థమవుతుంది. మా సినిమాలోని బ్యూటీ చూడబోతున్నారు' అని హీరో చైతన్యరావ్ అన్నారు. దర్శకుడు చెందు ముద్దు మాట్లాడుతూ, 'నా గత చిత్రంలాగే ఇందులో కూడా సరికొత్త స్క్రీన్ ప్లే చూస్తారు. ఒక మంచి కథను ఆసక్తికర కథనంతో, అందమైన లొకేషన్స్‌తో, ఆకట్టుకునే మ్యూజిక్‌తో తెరకెక్కించాను. ఇప్పుడొస్తున్న చిత్రాలతో పోలిస్తే ఖచ్చితంగా భిన్నంగా ఉంటుంది. ఫస్ట్ కాపీ రెడీగా ఉంది. వచ్చిన అవుట్ పుట్‌తో సంతోషంగా ఉన్నాం. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచే చిత్రమవుతుంది' అని తెలిపారు.

ఫీల్ గుడ్ సినిమా..




ప్రశాంత్, ఆది సాయికుమార్, శాంతి కుమార్

సాయికుమార్, శ్రీనివాస్ సాయి, ఆదిత్య ఓం, దీపాలి రాజపుత్, ఐశ్వర్య రాజీవ్ కనకాల కీలక పాత్రధారులుగా శాంతి కుమార్ తూర్లపాటి (జబర్దస్త్ ఫేం) దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మిస్తున్న చిత్రం 'నాతో నేను'. ఈ సినిమాలోని 'ఓసిని వయ్యారి రామ చిలుక' అంటూ సాగే లిరికల్ వీడియోను హీరో ఆది సాయికుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఈ మధ్యన నాన్న కథల ఎంపికలో ఆచితూచి అడుగేస్తున్నారు. ఇందులో అయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఫీల్ గుడ్ సినిమా అని, తన పాత్ర కొత్తగా ఉంటుందని నాన్న చెప్పారు. తాజాగా విడుదల చేసిన పాట నాకు బాగా నచ్చింది. లిరిక్స్ అర్థవంతంగా ఉన్నాయి. సినిమా కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'జబర్దస్త్ కమెడీయన్‌గా ప్రేక్షకులు నన్ను ఆదరించారు. ఇప్పుడు ఇంకో అడుగు ముందుకేసి దర్శకుడిగా తొలి ప్రయత్నం చేశాను. కథ, మాట, పాటలు నేనే రాసుకుని నిర్మాతల సహకారంతో ఈ సినిమా పూర్తి చేశాం' అని తెలిపారు. 'మంచి కథతో తొలి ప్రయత్నం చేశాం. ఇందులో సాయి కుమార్ కొత్తగా కనిపిస్తారు. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం' అని నిర్మాత అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

గుజరాత్‌లో ఒక్క రైతూ లబ్ధి పొందలే

- కేంద్ర ప్రాయోజిత పథకం 'బీజ్ గ్రామ్ యోజన' పని తీరు
- రెండేండ్లుగా నిధులు విడుదల చేయని కేంద్రం
- స్వంత రాష్ట్రాన్నే పట్టించుకోని మోడీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రైతుల ఆగ్రహం
- పంటలకు సిద్ధమవుతున్న సమయంలో అన్నదాతకు తప్పని కష్టాలు



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ తన స్వంత రాష్ట్రం గుజరాత్‌లోని రైతులను పట్టించుకోవటం లేదు. ఇందుకు కేంద్ర ప్రాయోజిత పథకం 'బీజ్ గ్రామ్ యోజన'(సీడ్ విలేజ్ ప్రోగ్రామ్) పని తీరే నిదర్శనం. ఈ పథకం కింద రెండేండ్లుగా కేంద్రంలోని మోడీ సర్కారు నిధులు విడుదల చేయలేదు. దీంతో బీజ్ గ్రామ్ యోజన కింద గుజరాత్‌లోని ఒక్క రైతు కూడా ప్రయోజనాన్ని పొందలేకపోయాడని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఇటు వర్షకాలం సమీపించి విత్తుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో మోడీ సర్కారు తీరు తమకు శాపంగా మారిందని రైతన్నలు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతన్నకు నకిలీ కష్టాలు

రైతులు చౌక ధరలకు నాణ్యమైన విత్తనాలు అందేలా ఆర్థిక సాయం చేయటం సదరు పథకం ఉద్దేశ్యం. 2014లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే, కేంద్రం 2021-22 మరియు 2022-23 సంవత్సరాలకు గానూ బీజ్ గ్రామ్ యోజనకు నిధులు విడుదల చేయలేదు. మరోపక్క, రైతన్నలను నకిలీ వీరులు టార్గెట్ చేస్తున్నారు. మాయమాటలు చెబుతూ రాష్ట్రంలోని రైతన్నలకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. దీంతో రాష్ట్రంలో అనేక మంది రైతులు నకిలీ ఊబిలో చిక్కుకుపోయి మోసపోతున్నారని రైతు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆ రెండేండ్లలో కూడా ప్రయోజనం పొందని రైతు

ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. బీజ్ గ్రామ్ యోజనను ప్రారంభించినపుడు గుజరాత్‌లో 11,052 మంది రైతులు లబ్ధి పొందారు. అయితే, ఆ సంఖ్య తర్వాతి ఏడాదికి 1,223కు తగ్గటం గమనార్హం. 2016, 2017 ఏడాదుల్లో అయితే ఏ ఒక్క రైతు కూడా ఈ పథకం కింద ప్రయోజనం పొందలేదు. 2018లో 1849 మంది, 2019లో 7,301 మంది రైతులు మాత్రమే లబ్ధి పొందారు.

2020లో ఈ సంఖ్య అత్యధికంగా 15,984కి చేరింది. కానీ, 2021 మరియు 2022లో మాత్రం గుజరాత్‌లోని ఏ ఒక్క అన్నదాత కూడా ఈ పథకం కింద లబ్ధిని పొందలేదు.

లోక్‌సభలో ఎంపీ ఉపేంద్ర సిన్హ్ రావత్ అడిగిన సమాధానానికి కేంద్రం సమాధానమిస్తూ.. 2020-21లో కేటాయించిన మొత్తం 1.56 కోట్లు పూర్తిగా వినియోగం జరిగిందనీ, 2021-22 మరియు 2022-23లో మాత్రం ప్రభుత్వం (కేంద్రం) ద్వారా ఎలాంటి నిధులూ విడుదల కాలేదని వివరించటం గమనార్హం.

స్పందించని రాష్ట్ర ప్రభుత్వం.. కాంగ్రెస్ ఆగ్రహం

కాగా, బీజ్ గ్రామ్ యోజనపై ప్రశ్నలకు సంబంధించి గుజరాత్ వ్యవసాయ మంత్రి రాఘవ్‌జీ పటేల్ స్పందించలేదు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పని తీరుపై గుజరాత్‌లోని ప్రధాన ప్రతిక్షం కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర వ్యవసాయం విభాగం కేంద్రానికి ప్రతిపాదన పంపాల్సిన అవసరం ఉన్నదని గుజరాత్ కాంగ్రెస్ రైతు విభాగం అధ్యక్షులు పాల్ అంబ్లియా అన్నారు.

కేంద్రంలో, రాష్ట్రంలో తమ ప్రభుత్వమే ఉంటే డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి, సంక్షేమంలో ముందుకెళ్లొచ్చని చెప్పిన మోడీ.. సాక్షాత్తూ తన స్వంత రాష్ట్రం విషయంలోనే రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారని రైతు సంఘాల నాయకులు, సామాజికవేత్తలు ఆరోపించారు. ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలే ఉన్న రైతులకు ఒరిగిందేమీ లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతను గుర్తెరిగి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

'టైటాన్' అన్వేషణ విషాదాంతం..

ఐదుగురు మృతి : అమెరికా కోస్ట్‌గార్డ్ ప్రకటన



బోస్టన్ : అట్లాంటిక్ మహాసముద్రంలో తప్పిపోయిన పర్యాటకుల మిని జలాంతర్గామి 'టైటాన్' అన్వేషణ విషాదాంతమైంది. సముద్ర గర్భంలో టైటానిక్ సమీపంలో టైటాన్ శకలాలను గుర్తించినట్టు అమెరికా కోస్ట్‌గార్డ్ ప్రకటించింది. టైటాన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు చనిపోయారని, వారి కుటుంబ సభ్యులకు తెలిపినట్టు పేర్కొంది. సముద్రంలో సుమారు 4 కిలోమీటర్ల లోతులో ఉన్న టైటానిక్ నౌక శకలాలను చూసేందుకు ఆదివారం బయలుదేరిన టైటాన్ కొన్ని గంటల్లోనే తప్పిపోయిన విషయం తెలిసిందే. భారత కాలమాన ప్రకారం... గురువారం సాయంత్రం 7 గంటల 15 నిమిషాల వరకే ఆక్సిజన్ సరిపోతుందని అంచనా వేశారు. పాకిస్థాన్ బిలియనీర్ షెహజాదా దావూద్ (48), ఆయన కుమారుడు సులేమాన్ (19), బ్రిటీష్ వ్యాపారవేత్త హమీష్ హార్డింగ్, ఈ యాత్ర నిర్వాహకుడు స్టాక్టన్ రష్, ఫ్రెంచ్ మాజీ నావికా అధికారి పాల్ హెన్రీ ఈ జలాంతర్గామిలో ఉన్నారు. మూడు రోజుల నుంచి వీరి ఆచూకీ తెలియలేదు. కెనడా, అమెరికా తీర రక్షక దళాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. వీరు ప్రయాణిస్తున్న టైటాన్‌లో 96 గంటలకు సరిపడా ఆక్సిజన్ నిల్వలే ఉండడంతో క్షణక్షణం ఉత్కంఠగా మారింది. గురువారం సాయంత్రం రిమోట్ ఆపరేటెడ్ వెహికల్ సహాయంతో టైటానిక్ నౌకకు సమీపంలో కొన్ని శకలాలను గుర్తించినట్టు అమెరికా కోస్ట్‌గార్డ్ ప్రకటన విడుదల చేసింది.

తీవ్రమైన పీడనం పెరగడం వల్లే పేలుడు...

తీవ్రమైన పీడనం పెరగడం వల్ల 'టైటాన్' పేలిపోవడంతో అందులో ఉన్న ఐదుగురు మరణించారని అమెరికా కోస్ట్‌గార్డ్ ప్రకటించింది. రిమోట్ కంట్రోల్డ్ వెహికల్ సాయంతో మినీ జలాంతర్గామి శకలాలను గుర్తించామని తెలిపింది. టైటానిక్ ఓడ సమీపంలో 488 మీటర్ల దూరంలో ఈ శకలాలను గుర్తించినట్టు యుఎస్ కోస్ట్ గార్డ్ పేర్కొంది. వెంటనే ఈ విషయాన్ని బాధితుల కుటుంబాలకు తెలిపినట్టు రియర్ అడ్మిరల్ జాన్ మౌగర్ తెలిపారు. యుఎస్ కోస్ట్ గార్డ్, రెస్క్యూ సిబ్బంది తరపున మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఈ ఐదుగురు నిజమైన అన్వేషకులు : ఓషన్ గేట్ సంస్థ

"ఈ ఐదుగురు నిజమైన అన్వేషకులు. ప్రపంచ మహాసముద్రాల అన్వేషణ, రక్షణలో వీరు ఎంతో అభిరుచిని కలిగిఉన్నారు. ప్రస్తుత ఈ విషాద సమయంలో వీరి కుటుంబాల గురించే మా ఆలోచనలు ఉన్నాయి. ఈ ఘటనకు చింతిస్తున్నాం" అని ఓషన్ గేట్ సంస్థ యుఎస్ కోస్ట్‌గార్డ్ వివరణకు ముందు ఒక ప్రకటన విడుదల చేసింది

ప్రధాని లేకుండా మణిపూర్‌పై
అఖిలపక్ష సమావేశం అర్థరహితం : కాంగ్రెస్



న్యూఢిల్లీ : మణిపూర్ పరిస్థితిపై అఖిలపక్ష సమావేశాన్ని కాంగ్రెస్ శుక్రవారం తిరస్కరించింది. ప్రధాని గైర్హాజరు కావడంతో ఈ చర్చ అర్థరహితమని కాంగ్రెస్ మండిపడింది. మణిపూర్ ఉద్రిక్త పరిస్థితులపై చర్చించేందుకు హోంమంత్రి అమిత్‌షా జూన్ 24న అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

గత 50 రోజులుగా మణిపూర్ మండిపోతున్నా ప్రధాని మౌనం వహించారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని దేశంలో లేని సమయంలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారని, దీంతో ఈ సమావేశం ప్రధానికి ముఖ్యమైనది కాదని స్పష్టమైందని రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు. ప్రధాని మోడీ లేనపుడు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రయోజనమేమిటని కాంగ్రెస్ సోషల్‌మీడియా ప్రతినిధి జైరాం రమేష్ పేర్కొన్నారు. మణిపూర్ హింసాకాండపై ప్రధాని మౌనం వహించారని, మణిపూర్‌కు చెందిన ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీలు, సొంత పార్టీ సహచరులను కలిసేందుకు నిరాకరించారని అన్నారు. మణిపూర్‌కు శాంతి సామరస్యాలు అవసరం అయినపుడు ఢిల్లీలో సమావేశం నిర్వహించి ప్రయోజనమేమిటని అన్నారు. ప్రధాని విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం అర్థం కావడం లేదు, ఇది వింతగా ఉందని అన్నారు.

మణిపూర్‌లో విధ్వంసం జరిగి 50 రోజులైన తర్వాత ఇప్పుడు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడమేమిటని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి. వేణుగోపాల్ మండిపడ్డారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను అమలు చేయకపోవడం అపహాస్యమని అన్నారు. శాంతి కోసం జరిగే ఏ ప్రయత్నమైనా మణిపూర్‌లో జరగాలని అన్నారు. అక్కడ పోరాడుతున్న వర్గాలను ఏకతాటిపైకి తెచ్చి రాజకీయ పరిష్కారం సాధించాలని అన్నారు. ఢిల్లీలో కూర్చుని యక్యలె యునట్టడం చేస్తే ప్రయత్నలోపమేనని అన్నారు.

అమూల్ గర్ల్ రూపకర్త డాచున్హా మృతి

న్యూఢిల్లీ : అమూల్ గర్ల్ రూపకర్త, డాచున్హా కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సిల్వెస్టర్ డాచున్హా మంగళవారం రాత్రి మృతి చెందారు. అట్టర్లీ-బట్టర్లీ ప్రచారంలో తొలిసారిగా అమూల్ గర్ల్ కార్టూన్‌ను డాచున్హా గీశారు. అప్పటి నుంచి దీనికి ఎంతో పేరు వచ్చింది. భారీ కటౌట్లు, వాల్ పోస్టర్ల రూపంలో ప్రదర్శించడంతో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రకటనల సంస్థ 'ఏఎస్‌పీ'లో మేనేజర్‌గా ఉన్న సమయంలో డాచున్హా ఈ బొమ్మ గీశారు. తరువాత ఆయన సొంతంగా డాచున్హా కమ్యూనికేషన్స్‌ను స్థాపించారు. సందర్భానుసారంగా పత్రికల్లో అమూల్ గర్ల్ కార్టూన్లు ఇవ్వడం డాచున్హా ప్రత్యేకత.

భవన నిర్మాణ కార్మికులకు కేరళ అండ

- రెట్టింపు ఖర్చు చేసిన 'సంక్షేమ' నిధులు
- ఉన్నవాటినే ఖర్చు చేయని ఇతర రాష్ట్రాలు

తిరువనంతపురం : కార్మికులను ఆదుకోవడంలో సీపీఐ(ఎం) అధికారంలో ఉన్న కేరళ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఆదర్శంగా నిలిచింది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉన్న నిధుల కంటే రెట్టింపు స్థాయిలో అదనపు నిధులను ఖర్చు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పన్ను చట్టం ప్రకారం ఆయా రాష్ట్రాల్లో రోడ్లు, భవనాల నిర్మాణదారులు, కంపెనీల నుంచి ఒక శాతం పన్ను వసూలు చేయాలి. వీటిని భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుల ద్వారా ఆయా రాష్ట్రాల కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు ఖర్చు చేయాలి. కేరళ రాష్ట్రంలో 20,45,538 మంది కార్మికులు ఆ రాష్ట్ర భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్నారు. కేరళ సంక్షేమ బోర్డుకు పన్నుల రూపంలో రూ.2,740.95 కోట్ల నిధులు వచ్చాయి. ఈ నిధులతోపాటు కేరళ ప్రభుత్వం అదనంగా రూ.1,648.83 కోట్లు కలిపి మొత్తం రూ.4,399.78 కోట్లను కార్మికుల కోసం ఖర్చు చేసింది. కార్మికుల సంక్షేమం కోసం ఉన్న నిధులతోపాటు అదనంగా ఖర్చు చేసింది కేరళ ప్రభుత్వం ఒక్కటేనని ఫిబ్రవరిలో జరిగిన పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి రామేశ్వర్ తేలి వెల్లడించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పన్ను చట్టం ప్రకారం పన్ను ద్వారా వచ్చిన నిధులను బోర్డులో సభ్యులుగా నమోదైన కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలి. కార్మికుడు ప్రమాదవశాత్తు మరణించినా, అంగవైకల్యం కలిగినా రూ.5 లక్షల వరకు బీమా కల్పించాలి. కార్మికుల ఆరోగ్యానికి, కార్మికుల ఆడిపిల్లల పెళ్లి ఖర్చులు, మెటర్నటీ, పిల్లల చదువుల కోసం బోర్డు నుంచి ఆర్థికసాయం అందించాలి. కార్మికుల ఇంటి నిర్మాణం కోసం రుణాలు అందించాలి. 60 ఏళ్లు దాటిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కూడా చట్ట ప్రకారం కల్పించాలి. దేశవ్యాప్తంగా 5.06 కోట్ల భవన నిర్మాణ కార్మికులు ఆయా రాష్ట్రాల వారీ భవన నిర్మాణ సంక్షేమ బోర్డుల్లో సభ్యులుగా ఉన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల బోర్డుల్లో మొత్తం రూ.87,478 కోట్ల నిధులు ఉన్నాయి. అయితే ఇందులో రూ.49,269 కోట్లు మాత్రమే రాష్ట్రాలు కార్మికుల కోసం ఖర్చు చేశాయని మంత్రి చెప్పారు. భవనాలు, రోడ్లు ఇతర నిర్మాణదారులు, కంపెనీల నుంచి పన్ను వసూలు చేసి కార్మికుల సంక్షేమం కోసం బోర్డులు ఖర్చు చేయడం నిరంతర ప్రక్రియ. కేరళలో తప్ప మిగతా ఏ రాష్ట్రంలోనూ కార్మికుల కోసం ఈ నిధులను వినియోగించిన దాఖలాలు లేవు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా కార్మికుల సంక్షేమానికి వెచ్చించిన పాపాన పోలేదు. బిజెపి అధికారంలో ఉన్న గోవా, ఉత్తరప్రదేశ్, త్రిపురలోనూ ఇదే పరిస్థితి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయి.



9-12వ తరగతుల పాఠ్యాంశాల్లో
సావర్కర్ బయోగ్రఫీ : యూపీ బోర్డ్



లక్నో : 9 నుండి 12 తరగతి పాఠ్యాంశాల్లో సావర్కర్ బయోగ్రఫీని చేర్చాలని యుపి బోర్డ్ నిర్ణయించింది. దీన్ దయాళ్ ఉపాధ్యాయ, మహావీర్ జైన్, పండిట్ మదన్ మోహన్ మాలవీయ, అరబిందో ఘోష్, రాజారామ్‌మోహన్‌రాయ్, సరోజిని నాయుడు, నానాసాహెబ్, చంద్రశేఖర్ ఆజాద్, రామకృష్ణ పరమహంసల జీవిత చరిత్రలతో పాటు సావర్కర్ బయోగ్రఫీని చేరుస్తున్నట్లు తెలిపింది. ఎదుగుతున్న, దేశ నిర్మాణంలో పాలుపంచుకునే విద్యార్థుల నైతిక, సాంస్కృతిక విలువలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ అధ్యాయాన్ని చేర్చినట్లు యుపి విద్యాశాఖ మంత్రి గులాబ్ దేవి పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. యుపి ప్రభుత్వం తన నిర్ణయాన్ని మరోసారి పరిశీలించుకోవాలని సమాజ్ వాది పార్టీ (ఎస్‌పి) పేర్కొంది. బ్రిటీష్ పాలకులకు క్షమాపణలు చెప్పి స్వాతంత్ర్య సమరయోధుల మనోభావాలను దెబ్బతీసిన సావర్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడమేమిటని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇందుకు యుపి ప్రభుత్వం లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులకు క్షమాపణలు చెప్పాల్సి వుంటుందని ఎస్‌పి ప్రతినిధి సునీల్ సాజన్ మండిపడ్డారు.

పదిరెట్లు పెరిగిన ధాన్యం ఉత్పత్తి

ప్రాసెసింగ్‌కు విస్తృత అవకాశాలు
సటాకే కంపెనీ ప్రతినిధులతో మంత్రి గంగుల కమలాకర్ చర్చలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో పదిరెట్లు ధాన్యం ఉత్పత్తి పెరిగిందనీ, ఫలితంగా మిల్లింగ్, ప్రాసెసింగ్‌కు విస్తృత అవకాశాలు ఏర్పడ్డాయని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారంనాడాయన రాష్ట్రంలో మిల్లింగ్ పరిశ్రమల స్థాపన కోసం జపాన్‌కు చెందిన సటాకే కార్పోరేషన్ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రస్తుత సీజన్‌లో 1.30 కోట్ల టన్నుల ధాన్యాన్ని తమ శాఖ సేకరించిందనీ, అదే స్థాయిలో వేగంగా మిల్లింగ్ చేస్తూ, ఉప ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే అంశాలపై వారితో చర్చించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సటాకే కార్పొరేషన్ తమ ఉత్పత్తుల గురించి మంత్రికి వివరించారు. ప్రపంచవ్యాప్తంగా యూఎస్, యూకే, థాయ్‌లాండ్, చైనా, వియాత్నాం తదితర వరి పండించే దేశాల్లో తమ కంపెనీ మిల్లింగ్ యూనిట్లు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. అత్యధికంగా రోజుకు లక్ష టన్నుల వరకూ మిల్లింగ్ సామర్థ్యం ఉందన్నారు. నిల్వ సామర్థ్యం, బాయిలర్ల పనితీరు, ఉప ఉత్పత్తులు తదితర అంశాలపై మంత్రి వారితో చర్చించారు. సమావేశంలో ఆ శాఖ కమిషనర్ వీ అనిల్‌కుమార్, సటాకే కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్‌కే బజాజ్, ఎజీఎం హెచ్ సతీష్‌కుమార్, డీలర్లు కే విఠల్, కే వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

మహావీర్ ఆస్పత్రి సేవలు అమూల్యం

డాక్టర్ బొట్టు చంద్రకాంత్‌రావుకు సత్కారం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



నగరంలోని మహావీర్ ఆస్పత్రి సేవలు అమూల్యమైనవనీ, పూర్తి సేవా దృక్పదంతో ఇక్కడి సిబ్బంది పనిచేస్తున్నారని ప్రముఖ స్థిరాస్తి రంగ నిపుణులు యనమల రాజు అన్నారు. ఈ ఆస్పత్రి స్థలాన్ని తిరిగి ఇప్పించడంలో పేదల డాక్టర్ డాక్టర్ చంద్రకాంత్‌రావు తీవ్రంగా కృషి చేశారని చెప్పారు. శుక్రవారంనాడాయన డాక్టర్ చంద్రకాంత్‌రావును ఆస్పత్రిలో సన్మానించారు. డాక్టర్ చంద్రకాంత్‌రావు ఇప్పటికే ఎన్నో గుట్కా, సిగరెట్, తంబాక్, పాన్ మసాలా వ్యతిరేక అవగాహనా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేట్ రియల్ ఎస్టేట్ ట్రైనర్ సిరి యనమల, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే సయ్యద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్
నలుగురు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని కుప్వారాలో శుక్రవారం ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మిలిటెంట్లు మరణించారు.

కుప్వారాలోని మచల్ సెక్టార్‌లో గల నియంత్రణరేఖ (ఎల్‌ఓసీ) సమీపంలో పోలీసులు, ఆర్మీ అధికారులు శుక్రవారం సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో నియంత్రణ రేఖ మీదుగా పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ నుంచి భారత్‌లోకి చొరబడేందుకు యత్నిస్తున్న నలుగురు ఉగ్రవాదులను భద్రతా సిబ్బంది గుర్తించారు. కాల్పుల్లో ఆ నలుగురు మరణించినట్టు కాశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు. గతవారం కూడా కుప్వారాలోని నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ)కి సమీపంలో ఉన్న జంగుండ్ కెరాన్ వద్ద భారీ చొరబాటు ప్రయత్నాల్ని భద్రతా బలగాలు అడ్డుకున్నాయి.

స్వతంత్ర పరిశీలకుడు అక్కర్లేదు

- బెంగాల్ ఎన్నికలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతిపాదనకు హైకోర్టు తిరస్కరణ

కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల పర్యవేక్షణకు స్వతంత్ర పరిశీలకుడిని నియమించాలన్న ప్రతిపాదనను శుక్రవారం కోల్‌కతా హైకోర్టు తిరస్కరించింది. సీబీఐ విచారణపై ఆదేశాలను రిజర్వ్ చేసింది. జులై 8న పశ్చిమబెంగాల్‌లో నిర్వహించే పంచాయతీ ఎన్నికల పర్యవేక్షణ కోసం స్వతంత్ర పరిశీలకుడిని నియమించాలని జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. నామినేషన్ల దశలోనే బెంగాల్‌లో తృణమూల్ గూండాలు పలుచోట్ల హింసాకాండకు పాల్పడటంతో ఈ కేసును ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటోగా స్వీకరించింది. కమిషన్‌కి చెందిన డైరెక్టర్ జనరల్ (విచారణ) దామోదర్ సారంగియాస్‌ను పరిశీలకుడిగా నియమిస్తున్నట్టు ప్రకటించింది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకించిన పశ్చిమ బెంగాల్ స్టేట్ ఎలక్షన్ కమిషన్ (డబ్ల్యుబిఎస్ఇసి) హైకోర్టును ఆశ్రయించింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీకి స్వతంత్ర పరిశీలకుడిని నియమించే హక్కు, సున్నితమైన ప్రాంతాలను గుర్తించే హక్కు లేదని పేర్కొంది.

మాజీ ఎంపీ సహా పది మందికి జైలు శిక్ష

కన్నౌజ్ : ఉత్తరప్రదేశ్‌లో మాజీ ఎంపీ రామ్ బక్ష్ వర్మ సహా పది మందికి కోర్టు జైలు శిక్ష విధించింది. 2017లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసులో ఒక్కొక్కరికీ ఏడాది జైలు శిక్షతోపాటు రూ.3 వేలు చొప్పున జరిమానా విధిస్తూ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ధర్మవీర్ సింగ్ తీర్పు చెప్పారు. జైలు శిక్ష పడిన వారిలో మాజీ ఎంపీ తనయుడు సైతం ఉన్నారు. మాజీ ఎంపీ రామ్ బక్ష్ వర్మ గతంలో రెండు పర్యాయాలు (1994, 2006) రాజ్యసభకు నామినేట్ అయ్యారు. 1977లో జనతా పార్టీ నుంచి, 1989లో జనతాదళ్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2017లో నిర్వహించిన ఊరేగింపులో వర్మ మద్దతుదారులు పోలీసులతో గొడవపడటంతో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ వర్మ, మరికొందరిపై 2017 జనవరి 25న తిర్వా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో వర్మ సహా పది మందికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. వర్మ ప్రస్తుతం సమాజ్‌వాదీ పార్టీలో ఉన్నారు.

అదానీ గ్రూప్ ఏం చెప్పింది?
ఆరా తీస్తున్న అమెరికా అధికారులు

వాషింగ్టన్ : హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అమెరికాలోని తన పెట్టుబడిదారులకు అదానీ గ్రూప్ ఏం చెప్పిందో తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. దీనిపై అమెరికా సెక్యూరిటీలు-ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్‌ఈసీ), న్యూయార్క్‌లోని అటార్నీ కార్యాలయం అధికారులు ఆయా పెట్టుబడిదారులను ప్రశ్నించడం ప్రారంభించారు. అదానీ గ్రూపులో అమెరికాకు చెందిన సంస్థాగత ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. హిండెన్‌బర్గ్ నివేదిక బహిర్గతమైన తర్వాత వీరందరితోనూ అదానీ గ్రూప్ సంప్రదింపులు జరిపింది. కాగా తన పెట్టుబడిదారులను అమెరికా అధికారులు ప్రశ్నిస్తున్నారన్న విషయంపై సమాచారం లేదని అదానీ గ్రూప్ ప్రతినిధి చెప్పారు. గౌతమ్ అదానీ నేతృత్వంలోని కంపెనీలపై భారత్‌లో ఇప్పటికే విచారణ జరుగుతోంది. కంపెనీ వాటాల ధరలు పెరుగుతాయంటూ ఇన్వెస్టర్లను మభ్యపెట్టడం, ఖాతాలలో మోసాలు తదితర ఆరోపణలపై అదానీ గ్రూపును విచారిస్తున్నారు.

పీఎం కిసాన్ మొబైల్ యాప్‌లో ఫేస్ అథెంటికేషన్

- కేంద్ర ప్రభుత్వ పథకంలో తొలిసారిగా ఇలాంటి విధానం

న్యూఢిల్లీ : మోడీ సర్కారు పీఎం-కిసాన్ యాప్‌లో ఫేస్ అథెంటిఫికేషన్ పద్ధతిని తీసుకొచ్చింది. దీంతో ఇకపై రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను వన్ టైమ్ పాస్‌వర్డ్, వేలి ముద్రలకు బదులుగా మొబైల్ ఫోన్‌లలో తమ ఫేస్‌ను స్కానింగ్ చేయటం ద్వారా పూర్తి చేసుకోవచ్చు. కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఈ యాప్ ఫీచర్‌ను ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కైలాశ్ చౌదరీ, సంబంధిత అధికారులు కూడా హాజరయ్యారు. ఫేషియల్ అథెంటికేషన్ మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీని చేసుకునే తొలి ప్రభుత్వ పథకంగా పీఎం-కిసాన్ స్కీం నిలిచిందని కొత్త ఫీచర్ గురించి వివరాలను వెల్లడిస్తూ అగ్రికల్చర్ అదనపు సెక్రెటరీ ప్రమోద్ కుమార్ మహేంద్ర వెల్లడించారు. పీఎం-కిసాన్ మొబైల్ యాప్‌లో ఫేస్ అథెంటిఫికేషన్‌కు సంబంధించి వ్యవసాయ మంత్రిత్వ శాఖ పైలెట్ టెస్టింగ్‌ను ఈ ఏడాది మే 21న ప్రారంభించిందని ఆయన వివరించారు. అప్పటి నుంచి 3 లక్షల మంది రైతుల ఈ-కేవైసీ విజయవంతంగా పూర్తయిందని చెప్పారు. వేలిముద్రలు, ఓటీపీల ద్వారా సంబంధిత కేంద్రాల వద్దకు వెళ్లి ఈ-కేవైసీని పూర్తి చేసుకోవడం ఇబ్బందిగా తయారైందనీ, ముఖ్యంగా వృద్ధుల విషయంలో వేలి ముద్రలు సరిపోలటం లేదని అధికారులు తెలిపారు. ఈ-కేవైసీ ప్రక్రియను సులభతరం చేసేందుకే ఫేస్ అథెంటికేషన్‌ను ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకాన్ని 2019లో ప్రారంభించారు. ఈ పథకం కింద రైతు లబ్ధిదారులకు ఏడాదికి రూ.6000 ఆర్థిక సాయం (ప్రతి నాలుగు నెలలకు మూడు సమాన ఇన్‌స్టాల్‌మెంట్‌లలో) అందుతుంది.